
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 179


గురువారం 13-3-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సింధు ఆరో'సారీ'..

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో మళ్లీ తొలి రౌండ్‌లో ఓడిన భారత స్టార్ - 12లో



అబిద్ అలీ అస్తమయం

టీమిండియాకు 34 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్ - 12లో



హైజాక్‌కు తెర

రైలు హైజాక్‌కు తెర దించినట్టు పాకిస్తాన్ ప్రకటించింది. ప్రయాణికులందరినీ బీఎల్‌ఏ చెర నుంచి విడిపించినట్టు ఆర్మీ వెల్లడించింది.

వివరాలు 6లో ▸



మాయా చర్మం..

ఎంతటి గాయాన్నయినా నాలుగే గంటల్లో 90%, 24 గంటల్లో పూర్తిగా నయం చేసే హైడ్రోజెల్‌ను శాస్త్రవేత్తలు రూపొందించారు.

వివరాలు 6లో ▸



ఈయూ ప్రతీకార సుంకాలు

అమెరికా నుంచి వచ్చే పారిశ్రామిక, పాడి ఉత్పత్తులపై కొత్త సుంకాలు వసూలు చేయనున్నట్లు బుధవారం ఈయూ చెప్పింది.

వివరాలు 6లో ▸



పాఠశాలల్లో ఎయిర్ ప్యూరిఫయర్లు

వాయు కాలుష్యం నుంచి పిల్లలను రక్షించేందుకు బడుల్లో ఎయిర్ ప్యూరిఫయర్లను పెట్టాలని సౌమ్య స్వామినాథన్ చెప్పారు.

వివరాలు 6లో ▸


నెల్లూరులో జరిగిన 'యువత పోరు' ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, యువత



బాబు నయవంచనపై తిరుగుబాటు

యువత పోరు

వైఎస్ జగన్ పిలుపుతో కదంతొక్కిన విద్యార్థులు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండ్


అనంతపురంలో..

- ఎన్నికల హామీ మేరకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాల్సిందేనంటూ యువత గర్జన
- బాబు సర్కారు వేధింపులు, పోలీసుల బెదిరింపులకు వెరవకుండా బైక్ ర్యాలీలు, ప్రదర్శనలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల వరకు వైఎస్సార్‌సీపీ యువత పోరు ర్యాలీలు

10లో

- డిమాండ్లపై విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి కలెక్టర్లకు వినతి పత్రాలను అందజేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- పది నెలల బాబు సర్కారు పాలనపై పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకతకు 'యువత పోరు' ర్యాలీలు అద్దం పట్టాయంటున్న రాజకీయ పరిశీలకులు
- రైతు పోరు.. విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసన తరహాలోనే యువత పోరు సక్సెస్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

నిరంతరం ప్రజలతోనే..

'వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్'గా వైఎస్సార్‌సీపీ: వైఎస్ జగన్

పార్టీ ఎప్పుడూ ప్రజలకు అండగా నిలబడుతుంది


వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2లో

జనం గొంతుకై నిలుస్తుంది

మళ్లీ వచ్చేది మనమే... మన పార్టీనే

కేంద్ర కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం

పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన వైఎస్ జగన్

చంద్రబాబూ.. తొలి హెచ్చరిక

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం
- 'యువత పోరు'ను పోలీసులతో అడ్డుకోవడానికి మీ ప్రభుత్వం కుటిల యత్నాలు
- వాటన్నింటినీ అధిగమించి మీ ప్రభుత్వం పెడుతున్న కష్టాలపై విద్యార్థులు, నిరుద్యోగులు నిలదీశారు
- పలు సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు తోడుగా ఉంటాం

10లో

సర్కారు మోసం.. యువతకు శాపం

- వైఎస్సార్‌సీపీ ఆందోళనతో అట్టుడికిన మండలి
- వాయిదా తీర్మానం తిరస్కరించిన చైర్మన్
- యువత సమస్యలపై చర్చకు ఎమ్మెల్సీల పట్టు
- చైర్మన్ పోడియం ఎదుట నినాదాలు
- సభ స్తంభించడంతో మూడు సార్లు వాయిదా.. మార్షల్స్‌ను మోహరించిన ప్రభుత్వం
- దుష్ట సంప్రదాయానికి తెర తీశారని బొత్స మండిపాటు
- ప్రభుత్వ తీరుకు నిరసనగా వాకౌట్

3లో

గ్లోబల్ సౌత్‌కు 'మహాసాగర్'

మారిషస్ ప్రధాని రామ్‌గులాంతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చలు



6లో

ఇరు దేశాల మధ్య కుదిరిన 8 కీలక ఒప్పందాలు

మోదీకి మారిషస్ అత్యున్నత జాతీయ పురస్కారం

మారిషస్ అత్యున్నత పురస్కారం 'ద గ్రాండ్ కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషియన్'ను ప్రధాని మోదీకి ప్రదానం చేస్తున్న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్



సామాన్యులకు స్టార్'లింక్' అయ్యేనా!

మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లోనూ హైస్పీడ్ ఇంటర్నెట్

విదేశాల్లో ఇప్పటికే అందుబాటులో.. ఖరీదూ ఎక్కువే..

మన దేశంలో చవక ధరలో తెస్తామంటున్న టెలికం కంపెనీలు

తొలుత వ్యాపార సంస్థలకు.. తర్వాత సాధారణ జనానికి..

14లో

ఘటనా స్థలంలో పోలీసులు, స్థానికులు



చిత్తూరులో దొంగల హల్‌చల్!

బొమ్మ తుపాకీలతో వచ్చి స్థానికులతో చావు దెబ్బలు.. రంగంలోకి ఆక్టోపస్.. సవ్యంగా ముగిసిన ఆపరేషన్

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

3లో

ఇలంటాకట్



ఇంకా నయం! ప్రభుత్వాన్ని హైజాక్ చేస్తారేమోనని భయపడ్డా..!!

ఏటా 1.75 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలు



- మహిళా సాధికారతపై చర్చలో సీఎం చంద్రబాబు
- అమూల్ తరహాలో డ్వాక్రా ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్
- డీలిమిటేషన్ తర్వాత అసెంబ్లీలో 75 మంది మహిళలు
- జనాభా పెరుగుదల కోసం అందరూ పిల్లలను కనాలి

- వివరాలు 3లో

చంద్రబాబూ.. ఒక్క ఆరోపణ అయినా రుజువు చేశావా?



- నాపై, నా తండ్రిపై కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారు
- కూటమి ప్రభుత్వం బురద జల్లుతోంది
- మద్యం స్కాం రూ.50 వేల కోట్లని.. ఇప్పుడు రూ.3 వేల కోట్లే అంటున్నారు
- అటవీ భూమిని ఆక్రమించామన్నారు
- 75.76 ఎకరాలు మాదేనని కలెక్టరే నివేదిక ఇచ్చారు : ఎంపీ మిథున్‌రెడ్డి

- వివరాలు 5లో

క్లుప్తంగా...

తిరుపతి అల్లర్లపై స్టేటస్ రిపోర్ట్ సమర్పించండి..

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి : తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అల్లర్లపై సీబీఐ దర్యాప్తు కోరుతూ మాజీ ఎంపీ, ప్రముఖ ఆర్థికవేత్త సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై బుధవారం హైకోర్టు స్పందించింది. అల్లర్లపై స్థాయీ నివేదిక(స్టేటస్ రిపోర్ట్)ను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అల్లర్లపై పోలీసులు నమోదు చేసిన కేసులు, వాటిపై దర్యాప్తు ఏం చేశారు? దర్యాప్తు ఎంత వరకు వచ్చింది.. తదితర వివరాలతో స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని స్పష్టం చేసింది. స్టేటస్ రిపోర్ట్‌ని పరిశీలించాక తదుపరి ఏం చేయాలో నిర్ణయిస్తామంది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఆ మేరకు వారికి నోటీసులిచ్చింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

కొడాలి నానికి సెక్షన్ 35(3) నోటీసులివ్వండి

విశాఖ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : మాజీ మంత్రి కొడాలి నానిపై నమోదు చేసిన కేసులో ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని విశాఖ త్రీ టౌన్ పోలీసులను బుధవారం హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. చంద్రబాబు, లోకేశ్‌లను తరచూ దూషిస్తున్నారంటూ అంజనా ప్రియ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాఖ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలని కోరుతూ కొడాలి నాని హైకోర్టునాశ్రయించారు.

ప్లీజ్.. ఒక్కసారైనా మాట్లాడండి! : స్పీకర్



సాక్షి, అమరావతి : శాసనసభ సమావేశాల్లో ప్రతి ఎమ్మెల్యే కనీసం ఒక్కసారైనా మాట్లాడాలంటూ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం సూచించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమం పూర్తయి, జీరో అవర్ ప్రారంభానికి ముందు ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికి 23 మంది ఎమ్మెల్యేలు ఈ సమావేశాల్లో మాట్లాడలేదన్నారు. వారు మాట్లాడే అవకాశం తీసుకోవాలని సూచించారు. 23 మంది ఎమ్మెల్యేల సంఖ్య అన్నది వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిపా అంటూ సభ్యులు ప్రశ్నించగా.. వాళ్లు కాకుండా అంటూ స్పీకర్ బదులిచ్చారు. దయ చేసి ప్రతీ ఎమ్మెల్యే మాట్లాడాలని సూచించారు.

ఆశ్రమ కట్టడాలు తొలగించడం దురదృష్టకరం

మంత్రి ఆనం



సాక్షి, అమరావతి: కాశిరెడ్డినాయన ఆశ్రమంలో భవనాలను కూల్చివేయడం దురదృష్టకరమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం శాసనసభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని పలువురు సభ్యులు ప్రస్తావించగా మంత్రి సమాధానమిస్తూ.. 'కూల్చినవి ఇటీవల నిర్మించిన సత్రాలు, ఆలయాలు కావు. ఇవన్నీ పూర్వమే ఉన్నాయన్న సమాచారం వచ్చింది. ఇప్పుడు టైగర్ జోన్ మారడంతో ఫారెస్ట్ అధికారులు కూలగొట్టే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే ఉన్న వాటిని కూలగొట్టడం దురదృష్టకరం. కూల్చేసిన వాటి నిర్మాణానికి ఏం కావాలో అన్ని చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

విశాఖ నుంచి రెండు కొత్త విమాన సర్వీసులు

31 నుంచి రాయ్‌పూర్‌కు, ఇండోర్‌కు



గోపాలపట్నం (విశాఖ): విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మరో రెండు కొత్త విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31వ తేదీ నుంచి విశాఖపట్నం–రాయ్‌పూర్, విశాఖపట్నం–ఇండోర్‌కు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఇండిగో విమానయాన సంస్థ వారంలో ఐదు రోజులపాటు(సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవారం) ఉదయం 11 గంటలకు ఈ సర్వీసులు నడపనుంది.

'తల్లికి వందనం' ప్రైవేటు స్కూళ్లకు ఇవ్వొద్దు

టీడీపీ ఎమ్మెల్సీ దువ్వూరి

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఇస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని టీడీపీ ఎమ్మెల్సీ దువ్వూరి రామారావు అన్నారు. శాసన మండలిలో బుధవారం 'విద్యారంగంలో సంస్కరణల'పై జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు.

నిరంతరం ప్రజలతోనే..

'వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్'గా వైఎస్సార్ సీపీ: వైఎస్ జగన్

పార్టీ ఎప్పుడూ ప్రజలకు అండగా నిలబడుతుంది

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ.. వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్ (నోరు లేని ప్రజల గొంతుక)గా ఉంటుందని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ జగన్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

ప్రజల కష్టాల్లో నుంచి పుట్టింది..

వైఎస్సార్ సీపీని స్థాపించి 15 ఏళ్లు అవుతోంది. పార్టీ పుట్టింది కష్టాల్లో నుంచి.. ఈ ప్రయాణంలో ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వారి తరఫున వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్‌గా ప్రతి అడుగులోనూ పోరాటం చేస్తూ వస్తోంది. మనం ప్రతిపక్షంలో కూర్చోవడం కొత్త కాదు. ఈ 15 ఏళ్ల ప్రయాణంలో పదేళ్లు మనం ప్రతిపక్షంలోనే ఉన్నాం. అధికార పక్షానికి దీటైన సమాధానం ఇస్తూ వస్తున్నాం. కళ్లు మూసి తెరిచేసరికే ఇప్పటికే దాదాపు సంవత్సరం అయిపోయింది. మరో మూడు నాలుగు సంవత్సరాల్లో జరిగే ఎన్నికల్లో మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీనే. ఈరోజు వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రతి కార్యకర్త గ్రామంలోని ఏ ఇంటికైనా ధైర్యంగా వెళ్లగలడు. ఏ పేద ఇంటికైనా మన కార్యకర్త సగర్వంగా, కాలర్ ఎగరేసుకుని వెళ్లగలిగే అవకాశం ఉంది. ఆ కార్యకర్తను చూసినప్పుడు ఆ ఇంట్లో ప్రతి అక్క, ప్రతి చెల్లి, ప్రతి సోదరుడు, ప్రతి అవ్వ, తాత, ప్రతి రైతు చిరునవ్వుతో పలకరిస్తారు. ఎందుకంటే.. వైఎస్సార్‌సీపీ ఎప్పుడైనా కూడా



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్

చెప్పిందంటే చేస్తుందన్న నమ్మకం ఈ రోజుకూ ప్రతి ఇంట్లో ఉంది కాబట్టే!

పిల్లల ఫీజుల కష్టాలు... 'యువత పోరు'

ఈరోజు విద్యాదీవెన, వసతి దీవెనకు సంబంధించి, పిల్లలకు జరుగుతున్న అన్యాయంపై నిరసన కార్యక్రమం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 10 నెలలు అవుతోంది. ఎన్నికల వేళ వాళ్లు చెప్పిన సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ గాలికెగిరిపోయాయి. చదువులు, వైద్యం, గవర్నెన్స్, వ్యవసాయం.. ఏది చూసినా వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఈరోజు పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి, ఒక్కొక్క క్వార్టర్‌కు రూ.700 కోట్ల చొప్పున విద్యాదీవెన కింద ఏడాదికి నాలుగు క్వార్టర్లకు రూ.2,800 కోట్లు కేటాయించాలి. వసతి దీవెన కింద ప్రతి ఏడాది ఏప్రిల్‌లో మరో రూ.1,100 కోట్లు కేటాయించాలి. అంటే.. గత ఏడాది ఈ రెండింటికి సంబంధించి పిల్లల చదువుల కోసం మొత్తం రూ.3,900 కోట్లు కేటాయించాల్సిన పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్న పరిస్థితి కనిపిస్తోంది. అంటే.. రూ.3,200 కోట్లు బకాయిలు పెండింగ్‌లో పెట్టారు. అంతేకాకుండా ఈ ఏడాది 2025–26కి సంబంధించి విద్యాదీవెన కింద రూ.2,800 కోట్లు, వసతి దీవెన కింద మరో రూ.1,100 కోట్లు కలిపి మొత్తం మరో రూ.3,900 కోట్లు ఇవ్వాలి. అంటే గతేడాది పెట్టిన రూ.3,200 కోట్ల బకాయిలతో కలిపి మొత్తం దాదాపు రూ.7,100 కోట్లు కేటాయించి, పిల్లలను ఆదుకోవాల్సింది పోయి కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే నామమాత్రంగా కేటాయించి పిల్లల చదువులతో ఆడుకుంటున్నారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలసి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే కార్యక్రమం కూడా యాదృచ్ఛికంగా ఈరోజు జరుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నా.

> వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజలకు తోడుగా, వారికి అండగా నిలబడుతుంది. ప్రజల తరఫున వారి గొంతుకై నిలుస్తుంది. "యువత పోరు" నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి నాయకుడు, కార్యకర్తకు అభినందనలు.



తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ పార్వతి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, పలువురు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే

ఊరూరా ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

- పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ
- పలుచోట్ల రక్తదాన, అన్నదాన శిబిరాలు, దుస్తుల పంపిణీ
- వైఎస్సార్ చిత్రపటాల వద్ద ఘన నివాళి
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

జనం గుండెల్లో వైఎస్సార్‌సీపీ



ఈ ఫొటోలో కనిపించే మహిళా వ్యవసాయ కూలీలు అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన వారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగనన్న చేసిన మేలును, అందించిన పథకాలను గుర్తు చేసుకుంటూ పొలంలోనే వైఎస్సార్‌సీపీ జెండాలతో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కులం, మతం, పార్టీ, ప్రాంతం చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి వైఎస్ జగన్ ఆదుకున్నారని గుర్తు చేసుకున్నారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. - ఆత్మకూరు

సాక్షి, అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించాయి.ఊరూరా పార్టీ జెండాలు రెపరెపలాడాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు ఎక్కడికక్కడ పార్టీ కార్యాలయాల్లో జెండాను ఎగురవేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఆయన చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలు కేకులు కట్ చేసి పంచిపెట్టారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదానం, దుస్తుల పంపిణీ , ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏ రాజకీయ పార్టీతో పొత్తులు లేకుండా, పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రతి ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేసి, విజయాలను సొంతం చేసుకున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఈ సందర్భంగా నేతలు గుర్తు చేసుకున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. అనునిత్యం ప్రజా పక్షంగానే వైఎస్సార్‌సీపీ అడుగులు ముందుకు వేసిందని, గత పోరాటాల గురించి చర్చించుకున్నారు. అన్ని జిల్లాల కార్యాలయాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు పార్టీ జెండాను ఎగుర వేసి కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపారు. నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో, డివిజన్లు, వార్డుల్లో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకలు ప్రజల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. జెండా ఆవిష్కరణ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిందాబాద్, జై జగన్ అంటూ పార్టీ శ్రేణులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. పేదల బతుకుల్లో వెలుగు నింపేందుకు ఏర్పడిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని నేతలు కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వైఎస్ జగన్ ప్రసంగం అందరినీ ఆకట్టుకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 'వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్' అని వైఎస్ జగన్ అన్న మాటలు అన్ని వర్గాల్లో భరోసా కలిగించాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత

- హామీల అమలులో సర్కారు పూర్తి వైఫల్యం
- యువత పోరు విజయవంతం
- రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేశారు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సాక్షి, అమరావతి: విద్యార్థులు, యువత పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' విజయవంతం అయిందని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు యువత పోరు ఆందోళనలో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని వెల్లడించారు. మొద్దు నిద్రలో ఉన్న పాలకుల కళ్లు తెరిపించేలా చేపట్టిన ఈ కార్యక్రమం కూటమి సర్కార్ గుండెల్లో దడ పుట్టించిందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ 15 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ దివంగత వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం అయినప్పటికీ విద్యార్థులు, యువత సమస్యలపై దృష్టిసారించి ప్రభుత్వంపై పోరాటానికి ముందడుగేసినట్లు చెప్పారు. యువత పోరుకు స్వచ్ఛందంగా యువత తరలి రావడం చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. 9 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్రమైన తిరుగుబాటును ఎదుర్కొంటోందని అప్పిరెడ్డి తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

విద్యార్థులు, యువతను ప్రభుత్వం గాలికొదిలేసిందని, వారి జీవితాలతో ఆటలాడుతోందని అప్పిరెడ్డి విమర్శించారు. . పేదరికంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని, కూటమి పార్టీలు మేనిఫెస్టోలో చేర్చిన హామీలకు కనీస గౌరవం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.


ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది

9 నెలలకే ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ప్రజా స్పందన ఈ స్థాయిలో ఉందంటే ప్రభుత్వ వ్యతిరేకత ఎంతగా పెరుగుతున్నదో తెలుస్తోందని అప్పిరెడ్డి తెలిపారు. సమస్యలపై ప్రశ్నిస్తుంటే కూటమి ప్రభుత్వం భయపడుతోందని.. నిరసనలకు అనుమతి ఇవ్వడం లేదని, అడుగడుగునా తమ పార్టీ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేసిందని అన్నారు. అన్ని నిర్బంధాలను అధిగమించి యువత పోరు నిరసన విజయవంతమైందని అప్పిరెడ్డి తెలిపారు. తక్షణం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు విద్యార్థులు, యువత పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

చెవిరెడ్డికి పోలీసుల నోటీసులు

- 5 కేసుల్లో విచారణకు హాజరుకావాలని జారీ
- ఐదు కాదు 50 కేసులు పెట్టుకోండి.. బెదిరేది లేదు: చెవిరెడ్డి

ఒంగోలు సిటీ: ఎన్నికల సందర్భంగా తొమ్మిది నెలల క్రితం పెట్టిన ఐదు కేసులకు సంబంధించి విచారణకు హాజరుకావాలంటూ వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి బుధవారం పోలీసులు నోటీసులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'యువత పోరు' ఆందోళనలో పాల్గొనేందుకు మంగళవారం రాత్రి చెవిరెడ్డి ఒంగోలుకు వచ్చారు. పొద్దు పోయే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో చర్చించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఇబ్బందిపెట్టే ఉద్దేశంతో బుధవారం ఉదయమే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. చెవిరెడ్డి వద్దకు వెళ్లి మీ మీద 5 కేసులున్నాయని, నోటీసులు తీసుకుని విచారణకు హాజరుకావాలని చెప్పారు. ఈ కేసులు ఎప్పుడు, ఎవరు, ఎందుకు పెట్టారు అని చెవిరెడ్డి అడగడంతో.. విచారణకు వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతామని తెలిపారు. దాంతో చెవిరెడ్డి సంతకం పెట్టి నోటీసులు తీసుకున్నారు. కాగా చెవిరెడ్డిపై ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని 5 పోలీసు స్టేషన్ల పరిధిలో 5 కేసులు నమోదు చేశారు. ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో 4 నుంచి 5 సెక్షన్లను ఆయనపై మోపారు. అధికార పార్టీ మెప్పు కోసం పోలీసులు పాత ఆరోపణలను తవ్వితీసి తప్పుడు కేసులు బనాయించడం పై ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి నోటీసులు అందజేస్తున్న ఎస్‌ఐ చౌడయ్య

పోరాటాల పార్టీ మాది..

కేసులకు బెదరం

"వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలతో పుట్టింది. గతంలో చంద్రబాబు పాలనలో నాపై 88 కేసులు పెట్టారు.. అనేక జైళ్లకు తిప్పారు. తప్పుడు కేసులకు బెదిరేదే లేదు.. ఐదు కాదు..50 కేసులైనా పెట్టుకోండి. కార్యకర్తలకు, ప్రజలకు అండగా నిలబడి పోరాడతాం.. ఈ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తాం" అని చెవిరెడ్డి పేర్కొన్నారు.

బెయిల్ రాకుంటే ఆత్మహత్యే శరణ్యం

మేజిస్ట్రేట్ ముందు కన్నీటిపర్యంతమైన పోసాని కృష్ణమురళి

- లోకేశ్ టీడీపీలోకి రమ్మన్నారు.. రానని చెప్పాను
- నాకు నార్కో ఎనాలసిస్ టెస్ట్ చేయండి
- సోషల్ మీడియా పోస్టులు పెడితే ఇన్ని కేసులు కడతారా?
- నా మీద ఎన్ని కేసులు కట్టారో నాకే తెలియదు
- రాష్ట్రమంతా తిప్పుతున్నారు.. తప్పు చేస్తే నన్ను నరికేయండి



పోసానిని తీసుకెళుతున్న పోలీసులు

సాక్షి, అమరావతి /గుంటూరు లీగల్: బెయిల్ రాకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి ఆవేదన వ్యక్తం చేశారు. పోసానిని సీఐడీ పోలీసులు బుధవారం రాత్రి గుంటూరులో ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరు పరిచారు. ఈ సందర్భంగా పోసాని అనారోగ్య సమస్యల గురించి విన్నవించుకున్నారు. తన పరిస్థితి చాలా దైన్యంగా ఉందని దయచేసి విడుదల చేయమని వేడుకున్నారు. ఈ కేసులకు సంబంధించి తనకు ఎటువంటి పాపం తెలియదని, తానేం చేయలేదని న్యాయమూర్తి ఎదుట బోరున విలపించారు. నిజం మాట్లాడినందుకు తన మీద కక్ష కట్టి ఇలాంటి అన్యాయమైన కేసులు పెట్టారని విన్నవించారు. తల్లి మీద, పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నానని తనకే పాపమూ తెలియదని న్యాయమూర్తిని వేడుకొన్నారు. బెయిల్ ఇవ్వాలని కోరారు. వయసు మీదపడడంతో కూర్చోలేక పోతున్నానని చెప్పుకొచ్చారు. పోలీసులు ఎక్కడినుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియడం లేదని, ఇప్పటికే కొన్ని వందల మైళ్ల ప్రయాణం చేయించారని, ఎందుకు నన్ను తిప్పుతున్నారో అర్థం కావడం లేదని, ఇలా చేస్తే తాను ఎక్కువ రోజులు బతకనని మొరపెట్టుకున్నారు. టీడీపీలోకి రమ్మంటే రానందుకు లోకేశ్ తనను వేధిస్తున్నారని, నంది అవార్డుల ప్రకటనలో పక్షపాతాన్ని ఎత్తిచూపడంతో కక్ష కట్టారని తెలిపారు. అన్నీ నిజాలే చెబుతున్నానని నార్కో ఎనాలసిస్ టెస్టుకూ సిద్ధమన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఇన్ని కేసులు కడతారా అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసి ఈ నెల 23వ తేదీ వరకు రిమాండ్ విధించారు. పోసానిని గుంటూరు జైలుకు తరలించారు.

పోసాని పిటిషన్ కొట్టివేత

సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయడంతో పాటు తదుపరి చర్యలన్నీ నిలిపేయాలని కోరుతూ సినీ నటుడు పోసాని కృష్ణమురళి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఇప్పటికే పీటీ వారెంట్‌ను అమలు చేసి కర్నూలు నుంచి మంగళగిరి మేజిస్ట్రేట్ వద్దకు పోసానిని తీసుకొస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ చెప్పడంతో హైకోర్టు దానిని పరిగణనలోకి తీసుకుంది. పీటీ వారెంట్ అమలైన నేపథ్యంలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. సీఎం చంద్రబాబును పోసాని దూషించారంటూ మంగళగిరికి చెందిన తెలుగు యువత అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు గతేడాది కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఫ్రీహోల్డ్ భూములపై మరో 2 నెలలు ఆంక్షలు పొడిగింపు

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేత
- వైఎస్ జగన్ హయాంలో 13.59 లక్షల అసైన్డ్ భూములకు హక్కులు

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం అసైన్డ్ భూములకు ఇచ్చిన యాజమాన్య హక్కులపై (ఫ్రీ హోల్డ్) కొనసాగిస్తున్న ఆంక్షలను కూటమి ప్రభుత్వం మరో 2నెలలు పొడిగించింది. ఈ మేరకు బుధవారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మెమో జారీ చేశారు. అసైన్ చేసి 20 ఏళ్లు దాటిన భూములకు వైఎస్ జగన్ ప్రభుత్వం చట్టబద్ధంగా ఫ్రీహోల్డ్ (యాజమాన్య హక్కులు కల్పన) చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 13.59 లక్షల ఎకరాల భూములను ఫ్రీహోల్డ్ చేయడంతో వాటికి సంబంధించిన రైతులకు హక్కులు లభించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సవరించిన అసైన్డ్ భూముల చట్టం ప్రకారం మిగిలిన అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాల్సి ఉంది. కానీ ఆ పని చేయకపోగా ఫ్రీహోల్డ్ అయిన 13.59 లక్షల ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేసింది. కొన్ని భూములు అక్రమంగా ఫ్రీహోల్డ్ అయ్యాయనే పేరుతో వాటిని ఇప్పటికి రెండుసార్లు వెరిఫికేషన్ చేయించింది. అందులో ఏమీ తేలకపోవడంతో రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు విధించింది. రెండు నెలలకోసారి ఈ ఆంక్షలను పొడిగిస్తోంది.


17 నుంచి ఇంటర్ జవాబు పత్రాల వాల్యూయేషన్

- నేటితో మొదటి ఏడాది పరీక్షలు పూర్తి
- ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు వెల్లడి

సాక్షి, అమరావతి: ఈనెల 17వ తేదీ నుంచి మొత్తం 25 జిల్లా కేంద్రాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల వాల్యూయేషన్ ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియను ఏప్రిల్ మొదటి వారానికల్లా పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు గురువారంతో ముగుస్తుండగా, రెండో ఏడాది పరీక్షలు 15వ తేదీన ముగియనున్నాయి. మిగిలిన మైనర్ సబ్జెక్టులకు ఈనెల 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. అయితే, ముందుగా పూర్తయిన పరీక్షల జవాబు పత్రాల ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల వాల్యూయేషన్‌ను తొలుత పూర్తి చేయాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మినహా మిగిలిన జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇందులో 18 వేల మంది సిబ్బంది పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల వాల్యూయేషన్ పూర్తిచేసి.. రెండోవారంలో ఫలితాలు ప్రకటించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10,58,893 మంది విద్యార్థులు పరీక్షలకు ఫీజు చెల్లించగా, సగటున 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

పెద్దిరెడ్డికి ఊరట

- 80 సెంట్ల భూమి విషయంలో తదుపరి చర్యలన్నీ నిలుపుదల : హైకోర్టు



సాక్షి, అమరావతి : మాజీమంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. తిరుపతి ఎంఆర్‌పల్లి పరిధిలోని సర్వే నెంబర్ 261/1లో రామచంద్రారెడ్డికి చెందిన 80 సెంట్ల భూమి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని దేవదాయ శాఖ అధికారులను ఆదేశించింది. దేవదాయ శాఖ ఇచ్చిన షోకాజ్‌కు సమాధానమిచ్చేందుకు పెద్దిరెడ్డికి 2 వారాల గడువునిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

ఆ ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ పొడిగింపు



సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, టి.కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ సస్పెన్షన్‌ను ప్రభుత్వం మరో ఆరు నెలలపాటు పొడిగించింది. హనీట్రాప్ వేసి బడా బాబులను బురిడీ కొట్టించే చరిత్ర ఉన్న కాదంబరి జత్వానీతో కుట్రపూరితంగా అక్రమ కేసు నమోదు చేసి చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీను గతంలో చేసిన సస్పెన్షన్ కాలపరిమితి ముగియడంతో.. సస్పెన్షన్‌ను మరో ఆరు నెలలు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి

మంత్రి నిమ్మల రామానాయుడు

సాక్షి, అమరావతి: అడ్వాన్స్ నిధులతో పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. తమ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు రూ.5,052 కోట్ల అడ్వాన్స్ నిధులు వచ్చినట్లు బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ కల్లా డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని, 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని నిమ్మల పునరుద్ఘాటించారు.

సర్కారు మోసం.. యువతకు శాపం

- వైఎస్సార్‌సీపీ ఆందోళనతో అట్టుడికిన మండలి
- వాయిదా తీర్మానం తిరస్కరించిన చైర్మన్
- యువత సమస్యలపై చర్చకు ఎమ్మెల్సీల పట్టు
- చైర్మన్ పోడియం ఎదుట నినాదాలు
- సభ స్తంభించడంతో మూడుసార్లు వాయిదా
- మార్షల్స్‌ను మోహరించిన ప్రభుత్వం
- దుష్ట సంప్రదాయానికి తెర తీశారని బొత్స మండిపాటు
- ప్రభుత్వ తీరుకు నిరసనగా వాకౌట్



యువత సమస్యలపై వాయిదా తీర్మానానికి పట్టుబడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలను అడ్డుకుంటున్న మార్షల్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువతను చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా మోసగించిందని వైఎస్సార్‌సీపీ ధ్వజమెత్తింది. యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అని ఎన్నికలకు ముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని మండిపడింది. చంద్రబాబు కూటమి పాలనలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, మొండితోక అరుణ్‌కుమార్, రమేశ్ యాదవ్ మండలిలో బుధవారం వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. దానిని తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు చర్చకు పట్టుబడుతూ స్పీకర్ పోడియం ఎదుట ఆందోళనకు దిగారు. యువతకు న్యాయం చేయాలనే నినాదాలతో మండలిని హోరెత్తించారు. ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించినా, ప్రతిపక్షం వెనక్కు తగ్గలేదు. వీరి ఆందోళన మధ్యనే మంత్రులు సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ సభ్యులు నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలను స్తంభింపజేశారు. దీంతో 10.15 గంటలకు సభను చైర్మన్ వాయిదా వేశారు. తిరిగి 10.33కు సభ పునఃప్రారంభం కాగానే మళ్లీ వాయిదా తీర్మానంపై చర్చకు పట్టుబడుతూ విపక్షం ఆందోళనకు దిగింది. సభలో గందరగోళం నెలకొనడంతో 10.44 గంటలకు ఒకసారి, 11.40 గంటలకు మరోసారి సభ వాయిదా పడింది.

మార్షల్స్‌ను అడ్డుపెట్టి..

ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో మండలి కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోవడంతో మూడోసారి సభ పునఃప్రారంభం అయ్యే సమయానికి ప్రభుత్వం మార్షల్స్‌ను మోహరించింది. మధ్యాహ్నం 12.10 గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం వద్దకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలను మార్షల్స్ నిలువరించారు. దీంతో మార్షల్స్, విపక్ష ఎమ్మెల్సీల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అనేలా రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులను నట్టేట ముంచారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలిస్తామని, లేదంటే మొదటి రోజు నుంచే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పారు' అని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'చంద్రబాబు మోసాల గురించి సభలో ఆందోళన చేశాం. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాం. మా హయాంలో ఎక్కడా ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయి లేదు. జాబ్ క్యాలెండర్ ఎక్కడిచ్చారో చూపించాలి. ప్రజల కోసం నినదిస్తే మా మీద మార్షల్స్‌ని ప్రయోగిస్తారా? ఇదేం సంస్కృతి? ఇది అసమర్థ ప్రభుత్వం' అని ధ్వజమెత్తారు.

'ఆడబిడ్డ నిధి' నిధులు విడుదల చేశారా!?

వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నకు 'ఈ ప్రశ్నలు ఉత్పన్నం కావు' అని ప్రభుత్వం జవాబు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇప్పటివరకు ఆడబిడ్డ నిధి పథకం ద్వారా లబ్ధి పొందిన వ్యక్తులు, ఖర్చుచేసిన నిధుల వివరాలేమిటి?.. ఈ పథకం కింద 19–59 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలకు నిధులు విడుదల చేశారా? అని వైఎస్సార్‌సీపీ సభ్యులు దాసరి సుధ, తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, బి. విరూపాక్షి, బూచేపల్లి శివప్రసాద్ ప్రశ్నించారు. వీరు లేవనెత్తిన ఈ ప్రశ్న బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో చర్చకు వచ్చింది. దీంతో.. 'ఈ ప్రశ్నలు ఉత్పన్నం కావు' అంటూ ప్రభుత్వం తన లిఖితపూర్వక జవాబులో పేర్కొంది. అలాగే, ఈ పథకం అమలు పరిశీలనలో ఉందంటూ తెలిపింది. అంతేకాక.. 2019–24 మధ్య 45–60 ఏళ్ల వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు సంవత్సరానికి రూ.18,750ల ఆర్థిక సహాయం అందించినట్లు కూడా అందులో పేర్కొంది. నిజానికి.. రాష్ట్రంలో 19 నుంచి 59 ఏళ్ల వరకు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి పథకం కింద ఇస్తామంటూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు–పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు.

50 ఏళ్లకు పింఛన్ పొందిన వారు 12 లక్షల మంది..

రాష్ట్రంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50 ఏళ్లకు పెన్షన్లు పొందిన వారు 12,09,732 మంది అని ప్రభుత్వం లిఖితపూర్వకంగా వెల్లడించింది. అలాగే, ఈ పింఛను లబ్ధిదారుల సంఖ్య 2024 జూన్ నాటికి 65,18,496 ఉండగా.. 2025 ఫిబ్రవరి నాటికి 63,59,907కు తగ్గినట్లు తెలిపింది. వృద్ధాప్య పింఛన్ కనీస అర్హత వయస్సు 60 ఏళ్లుగా ఉండగా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ–జనసేన పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, ఈ పథకంపై ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి విధానపరమైన నిర్ణయం తీసుకోకపోయినా అసెంబ్లీలో మాత్రం 2024–25లో 50 ఏళ్లకు లబ్ధిపొందిన వారు 12,09,732 మందిగా జవాబిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

మహిళలను నమ్మించి మోసగించిన చంద్రబాబు

- ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

సాక్షి, అమరావతి: మహిళలను నమ్మించి మోసగించిన ఘనుడు సీఎం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా మహిళా సాధికారత గురించి చంద్రబాబు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని, మహిళా సాధికారతపై మాట్లాడే అర్హత ఆయనకు లేదని ధ్వజమెత్తారు.

ఏటా 1.75 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలు

మహిళా సాధికారతపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, అమరావతి : మహిళా సాధికారతతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందులో భాగంగా నియోజకవర్గానికి 1,000 మంది చొప్పున ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 75 వేల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బుధవారం ఆయన మహిళా సాధికారతపై శాసనసభలో జరిగిన చర్చలో ప్రసంగించారు. ఈ ఏడాది డ్వాక్రా మహిళలకు రుణాల కింద రూ.65,000 కోట్లు ఇస్తున్నామని, ఇందులో కనీసం సగం పెట్టుబడిగా తీసుకురాగలిగితే కనీసం ఏటా రూ.6,000 కోట్ల లాభాలు అందుకుంటారన్నారు. ఇందుకోసం 24 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. గుజరాత్ అమూల్ తరహాలో డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ఒక బ్రాండ్ తీసుకొచ్చి అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎలీప్ సంస్థ విజయవాడ, అనకాపల్లి, కుప్పంలో మహిళా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈ ఉగాది నుంచి పీ4 ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వారు అట్టడుగున ఉన్న వారిని దత్తత తీసుకుని అండగా నిలవాలన్నారు. ప్రతి ఎమ్మెల్యే కనీసం వెయ్యి మంది డ్వాక్రా, మెప్మా మహిళలను ఏడాదిలోగా పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసే బాధ్యతను ఉద్యమంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 10 లక్షల మంది మహిళలకు ఉపయోగపడేలా రూ.4,400 కోట్ల రుణాలు, సబ్సిడీలు ఇచ్చి.. ఒకే రోజు 3 లక్షల 80 వేల లావాదేవీల ద్వారా రూ.5 కోట్ల విలువైన 35,220 డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో మార్కెట్ చేయడం ద్వారా మూడు గిన్నిస్ బుక్ రికార్డులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళలపై ఇంకా వివక్షా?

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతుండటం బాధాకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రస్తుత అసెంబ్లీలో 21 మంది మహిళలు ఉన్నారని, డీలిమిటేషన్ పూర్తయ్యి 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే.. శాసనసభలో 75 మందికిపైగా మహిళా ఎమ్మెల్యేలు ఉంటారని చెప్పారు. మే నెలలో తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. అందరూ పిల్లలను కనాలని, ఇప్పుడు ఇద్దరు పిల్లలకంటే తక్కువ ఉంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులు కారని బిల్లు తేవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతి కార్యాలయంలో చైల్డ్ కేర్ యూనిట్ ఏర్పాటు తప్పనిసరి చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. మహిళా భద్రతకు 13 రకాల ఫీచర్స్‌తో శక్తి యాప్, 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎవ్వరైనా సరే ఆడబిడ్డల జోలికొస్తే ప్రపంచంలో ఎక్కడున్నా పట్టుకొచ్చి శిక్షిస్తామని స్పష్టం చేశారు.

ఆడబిడ్డల ద్రోహానికి జగన్ ఒక కేస్ స్టడీ

తల్లికి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి నిన్నటి వరకు ఈ సభలో ముఖ్యమంత్రిగా ఉన్నాడని, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్‌కు మహిళలపై మాట్లాడే హక్కు ఎక్కడిదని సీఎం చంద్రబాబు నిలదీశారు. 'సరస్వతీ సిమెంట్స్ విషయంలో విజయమ్మకు చెందిన షేర్స్‌ను ఆమె కూతురుకు ఇవ్వడంపై ఎన్సీఎల్టీలో జగన్ కేసు వేశాడన్నారు. ఇది ఆడబిడ్డల ద్రోహానికి సంబంధించి ఒక కేస్ స్టడీ' అని అక్కసు వెళ్లగక్కారు.

బాబు నోట తోబుట్టువుల మాటా?

అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఎస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత దూషణలకు దిగడం చూసి అసెంబ్లీ లాబీల్లో పలువురు టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలు ఆశ్చర్యపోయారు. చంద్రబాబు తన సోదరుడు, సోదరిలను ఏనాడైనా ఆదుకున్నారా? అని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. సోదరుడిని గానీ, సోదరిని గానీ చంద్రబాబు కనీసం పట్టించుకున్న దాఖలా లేదని మరో సీనియర్ ఎమ్మెల్యే అన్నారు. అదే జగన్ తన చెల్లికి పెళ్లైన 20 ఏళ్ల తర్వాత కూడా రూ.200 కోట్లు ఇచ్చాడని ఎమ్మెల్యేలు గుర్తుచేసుకున్నారు. ఎప్పుడూ ఎవరికీ ఎలాంటి సాయం చేయకుండా చంద్రబాబు ఇలా మాట్లాడడంలో ఔచిత్యం ఏముందని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం అక్కడున్నవాళ్లను ఆశ్చర్యచకితులను చేసింది.

స్వర్ణముఖిలో ఇసుకాసురులు!



స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): స్వర్ణముఖి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అధికార పార్టీ నేతలు రాత్రింబవళ్లు నదిలో యథేచ్ఛగా ఇసుకను తోడేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. నిరంతరం వందలాది ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తూ నదీ తీర గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. వివరాలు.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుపతి జిల్లా రేణిగుంట మండలం జీపాళెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక దోపిడీ మొదలైంది. ఇక్కడి నుంచి రోజుకు 500కు పైగా ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. ఇదేవిధంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగితే.. మరికొన్ని రోజుల్లో స్వర్ణముఖిలో ఇసుక కనుమరుగైపోయే అవకాశం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినా.. తాము ఫిర్యాదు చేసినా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు. ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తున్న నాయకుడు.. టీడీపీకి చెందిన నియోజకవర్గ ముఖ్య నేతకు అనుచరుడని స్థానికులు తెలిపారు. అందుకే అధికారులు కూడా పట్టించుకోవట్లేదని ఆరోపించారు.

విష్ణు డెంటల్‌లో బాంబ్ కలకలం

లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు, యాజమాన్యం



తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని బీవీ రాజు విద్యాసంస్థల్లో ఒకటైన విష్ణు డెంటల్ కళాశాలలో బుధవారం బాంబ్ పెట్టినట్లు అజ్ఞాత వ్యక్తి చేసిన మెయిల్ కళాశాలలో కలకలం రేపింది. డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రామరాజుకు డెంటల్ కళాశాలలో బాంబ్ పెట్టినట్లు మెయిల్ వచ్చింది. దీంతో కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. విద్యార్థులను తరగతి గదుల నుంచి బయటకు పంపించి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేయగా బాంబ్ జాడ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మెయిల్ ఎక్కడ నుంచి వచ్చిందనే విషయాన్ని పోలీసు సైబర్‌క్రైమ్ బృందం రంగంలోనికి దిగి విచారణ చేపట్టారు.

నకిలీ విత్తనాలతో నష్టం.. రైతు ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం
- అనంతపురం జిల్లాలో ఘటన



ఆస్పత్రిలో రైతు మురళి

బత్తలపల్లి/అనంతపురం సెంట్రల్ : నకిలీ విత్తనాలను డీలర్ అంటగట్టడంతో మోసపోయి నష్టపోయిన రైతు.. విత్తన డీలర్ దుకాణం ఎదుటే ఆత్మహత్యకు యత్నించాడు. బాధిత రైతు కుటుంబీకులు తెలిపిన వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన గుజ్జల మురళి తన నాలుగెకరాల్లో కళింగర పంట సాగు చేశాడు. మూడు నెలల కిందట అనంతపురం జిల్లా కేంద్రంలోని శ్రావణి ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.2 లక్షలు వెచ్చించి కళింగర విత్తనాలను కొనుగోలు చేశాడు. పంటకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతరత్రా ఖర్చులన్నీ కలిపి రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. కాయలు కాసినా లోపల తెలుపు ఉండటం, రంగు రాకపోవడంతో ఆందోళన చెందాడు. ఈలోపు బెంగళూరు నుంచి వ్యాపారులు పొలంలోకి వచ్చి కాయలను పరిశీలించారు. కొన్ని కాయలను వ్యాపారులు కోసి చూడగా.. తెలుపు రంగులో ఉండడంతో నకిలీ విత్తనాల వల్లే ఇలా జరిగిందని చెప్పారు. దీంతో రైతు నాలుగు రోజులుగా డీలరు దుకాణం వద్దకు వెళ్లి సమస్యను వివరించే యత్నం చేయగా డీలర్ ఏమాత్రం పట్టించుకోలేదు. అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదు. దీంతో బుధవారం క్రిమిసంహారక మందు తీసుకుని డీలరు దుకాణం వద్ద తాగాడు. అక్కడున్న రైతులు గమనించి అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. రైతను సర్వజనాస్పత్రిలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవి, ఏవో శశికళ పరామర్శించారు. జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలను రైతు నుంచి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా, డీలర్ నకిలీ విత్తనాలను అంటగట్టడం వల్లే తాము నష్టపోయామని, డీలర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో తన భర్త ఆత్మహత్యకు యత్నించినట్టు బాధిత రైతు భార్య వెంకటరమణమ్మ కన్నీరుమున్నీరయ్యారు.

17న చేనేత కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం వెల్లడి

మంగళగిరి టౌన్: బడ్జెట్‌లో చేనేత కార్మికులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికులకు రూ. 2వేల కోట్ల బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు.

చిత్తూరులో దొంగల హల్‌చల్!



నిందితులను పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

చిత్తూరు అర్బన్: వ్యాపారంలో ఆర్థికంగా నష్టపోయిన ఓ వ్యాపారి.. ఆర్థికంగా నిలదొక్కుకున్న మరో వ్యాపారి ఇంట్లో చోరీకి యత్నించి పోలీసుల చేతికి చిక్కాడు. చిత్తూరు నగరంలో మూడున్నర గంటల పాటు జరిగిన ఈ చోరీ ప్రయత్నం ఘటన స్థానికంగా కలకలం రేపగా.. ఏకంగా అసెంబ్లీలో దీనిపై సీఎం చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. చిత్తూరు గాంధీరోడ్డు – లక్ష్మీ థియేటర్ కూడలిలోని ఓ భవనంలో బొమ్మల విక్రయాల షాపు ఉంది. భవనం యజమాని చంద్రశేఖర్ ఆర్థికంగా నిలదొక్కుకున్న వ్యక్తి. బుధవారం ఉదయం 6.28 గంటల ప్రాంతంలో ముఖాలకు మాస్కులు, చేతిలో బ్యాగు పట్టుకుని ఆరుగురు ఓ కారులో వచ్చి భవనంలోకి చొరబడ్డారు. మొదటి అంతస్తులో ఉన్న చంద్రశేఖర్, ఆమె తల్లి, భార్య వద్దకు వెళ్లి ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు బ్యాగులో వేయాలంటూ తుపాకులు గురిపెట్టారు. ఓ రౌండ్‌ను గాల్లో కాల్చడంతో అది బొమ్మ తుపాకీగా తేలిపోయింది. దీంతో చంద్రశేఖర్ భార్య శాంతి కేకలు వేయడంతో రెండో అంతస్తులో ఉన్న కుమారుడు లోకేశ్ కిందకి వచ్చాడు. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు, దొంగలు ఒకరిపై ఒకరు కలియబడి దాడి చేసుకుంటున్నారు. అంతలో లోకేశ్ తప్పించుకుని రోడ్డుపైకి పరుగెత్తుకుంటూ వచ్చి కేకలు వేశాడు. దీంతో స్థానికులు ఉమాపతి, అతని స్నేహితులు దొంగలపై దాడి చేసి, నలుగురిని బంధించారు. మరో ఇద్దరు భవనంలోనే ఆయుధాలతో ఉన్నారన్న పుకార్లు వ్యాపించాయి. సమాచారం అందుకున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ.. సాయుధ బలగాలను, ఆక్టోపస్ బృందాన్ని రప్పించి చుట్టు పక్కల ప్రాంతాలను జల్లెడ పట్టారు. దాదాపు మూడు గంటలకు పైగా నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. చోరీకి యత్నించిన వారిలో రాజేష్ తప్పించుకోగా. మిగతా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుల్లో ఇంకా ఒకరిద్దరు ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రధాన నిందితుడు స్థానిక వ్యాపారి

ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న సుబ్రమణ్యం రెడ్డి కర్నూలుకు చెందిన వ్యక్తి. చిత్తూరులో సోఫాలను తయారుచేయించి విక్రయిస్తుంటాడు. రూ.కోట్లలో టర్నోవర్ చేసిన సుబ్రమణ్యంరెడ్డి ఇటీవల వ్యాపారం కోసం ఎక్కువగా అప్పులు చేసి భారీ నష్టాలు చవిచూశాడు. ఏదైనా పెద్ద దొంగతనం చేసి అప్పులన్నీ తీర్చేయాలని భావించాడు. తన షాపులో పనిచేసే నంద్యాలకు చెందిన ప్రవీణ్, ఇబ్రహీం, అనంతపురానికి చెందిన రామాంజనేయులు, నవీన్, కర్నూలుకు చెందిన రాజేష్‌లను పిలిపించుకున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ఫ్యాన్సీ దుకాణంలో రెండు ఎయిర్ గన్ (బొమ్మ తుపాకులు)లను కొనుగోలుచేసి, చోరీకి యత్నించి పోలీసులకు చిక్కాడు. చిత్తూరు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేశారని, జిల్లా పోలీసు శాఖను అభినందిస్తున్నట్లు సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రశంసించారు.

గూడ్స్ రైలు ఎక్కి.. విద్యుత్ తీగలు పట్టుకుని..

యువకుడి ఆత్మహత్యాయత్నం



గాయపడిన అమర్‌నాథ్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు ఆగి ఉన్న గూడ్స్‌రైలు ఎక్కి విద్యుత్ తీగలు పట్టుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన బుధవారం జరిగింది. నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కంభం మండలం రావిపాడుకు చెందిన వరికుంట్ల అమర్‌నాథ్ అనే యువకుడు రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్‌రైలు బోగీలను ఎక్కి పైన ఉన్న విద్యుత్ తీగలు పట్టుకున్నాడు. దీంతో విద్యుత్‌షాక్‌కు గురైన అమర్‌నాథ్ తీవ్రంగా గాయపడి కిందపడిపోయాడు. యువకుడిని గమనించిన స్థానికులు, రైల్వేసిబ్బంది చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న నంద్యాల జీఆర్‌పీఎఫ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టింది. అమర్‌నాథ్ చెన్నైలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు తెలిసింది. యువకుని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియదని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు.

తిరుమలను కాంక్రీట్ జంగిల్ కానివ్వొద్దు


- నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం
- టీటీడీకి స్పష్టం చేసిన హైకోర్టు
- పలు మఠాలకు, టీటీడీ ఈవోకు నోటీసులు

సాక్షి, అమరావతి: తిరుమలలో నిర్మాణాల విషయంలో అత్యంత జాగురూకతతో వ్యవహరించాలని హైకోర్టు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానాల(టీటీడీ)కి స్పష్టం చేసింది. ఎంతో సుందరమైన తిరుమలను కాంక్రీట్ జంగిల్ కాకుండా చర్యలు తీసుకోవాల్సిందేనని తేల్చి చెప్పింది. నిర్మాణాలను ఇలాగే కొనసాగిస్తే కొంత కాలం తర్వాత తిరుమల అటవీ ప్రాంతం కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో తాము చాలా కఠినంగా వ్యవహరిస్తామంది. తిరుమలలో ధార్మిక సంస్థలు మఠం పేరుతో ఎలా పడితే అలా నిర్మాణాలు చేస్తామంటే కుదరదంది. ఇప్పటికే ఓ మఠం చేపట్టిన నిర్మాణాలపై చర్యలకు ఆదేశించామని గుర్తు చేసింది. తిరుమలలో నిర్మాణాలు చేసిన పలు మఠాలకు నోటీసులిచ్చింది. అలాగే దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవో, టీటీడీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ తదితరులకూ నోటీసులిచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను మే 7కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా పలు మఠాలు నిర్మాణాలు చేపట్టాయని, వీటి విషయంలో చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన మహేష్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది చిత్తరవు నాగేశ్వరరావు, న్యాయవాది ఉదయ్ కుమార్ వాదనలు వినిపించారు.

108 ఆలస్యం.. అనంతవాయువుల్లో ప్రాణం !

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఎస్ఐ మృతి

- దాదాపు రెండు గంటలు నరకయాతన
- కూటమి పాలనలో ఆపద్బాంధవికి 'ఆయుష్షు' తీరినట్టేనంటున్న జనం



గురుస్వామి (ఫైల్)

వడమాలపేట (విజయపురం): ఒకప్పుడు ఆపద సమయాల్లో బాధితులను సకాలంలో ఆస్పత్రులకు తీసుకెళ్లి వారికి ఆయుష్షు పోసి.. ఆపద్బాంధవిలా ఆదుకున్న 108.. నేడు కూటమి ప్రభుత్వ పాలనలో అక్కరకు రాకుండా పోతుందనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. ఇటీవల కాలంలో 108 సకాలంలో చేరుకోకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు గాల్లో కలుస్తున్న వరుస ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. ఈ క్రమంలోనే మంగళవారం ఓ గుండె ఆగిపోగా.. బుధవారం ఓ ఏఎస్ఐ ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా ఏర్పేడుకు చెందిన గురుస్వామి (61) వడమాలపేటలో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటకు చెందిన అతని సహోద్యోగి మృతి చెందడంతో ఆయన కర్మ క్రియలకు వెళ్లి తిరిగి ఇంటికి బయలు దేరారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపానికి రాగానే.. ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆయన తలకు స్థానికులు కట్టుకట్టి 108కు సమాచారం అందించారు. అయితే సమాచారం అందుకున్న సిబ్బంది ఎంతకూ 108 వాహనాన్ని పంపలేదు. ఈ మార్గంలో ప్రైవేటు వాహనాలు కూడా అందుబాటులో లేకపోవడంతో స్థానికులు 108 కోసమే వేచిఉండాల్సి వచ్చింది. పదే పదే ఫోన్లు చేయడంతో.. ఎట్టకేలకు రెండు గంటల అనంతరం 108 అక్కడకు చేరుకుంది. అయితే అప్పటికే పరిస్థితి విషమించి గురుస్వామి తుదిశ్వాస విడిచారు. గురుస్వామికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. సకాలంలో 108 వచ్చి ఉండుంటే ఏఎస్ఐ గురుస్వామి ప్రాణాలు నిలిచేవని, ఇటీవల కాలంలో ఈ కారణం వల్లనే ఓ ఎస్సై మరికొంతమంది మృతి చెందారని స్థానికులు వాపోయారు.



యవ్వనం అంటే ఏమిటి? ఒక కల.
ప్రేమంటే ఏమిటి? ఆ కలలోని భావం.
– సొరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 13 మార్చి 2025

నెత్తురోడుతున్న బలూచిస్తాన్

ఒక ప్రాంత ప్రజల ఆకాంక్షలను ఉక్కుపాదంతో అణచాలని చూస్తే... దాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి అక్కడి వనరులను పీల్చిపిప్పి చేస్తే... ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రూపంలో ఆగ్రహజ్వాలలు ఎగిసిపడతాయి. విభజనానంతరం పాకిస్తాన్ ఒక దేశంగా ఏర్పడినప్పుడు అందులో విలీనం కాకుండా తాము స్వతంత్రంగా ఉంటామని కలాత్ సంస్థానం ప్రకటించినప్పుడు నూతన పాలకులు ససేమిరా అంగీకరించలేదు. అక్కడి వనరులపై కన్నేసిన పాలకులు ఆ సంస్థానాన్ని నమ్మించి, స్నేహ ఒడంబడిక కుదుర్చుకుని చివరకు దాన్ని బుట్టదాఖలా చేశారు. ఈ ద్రోహం వెనక పాక్ జాతిపిత మహమ్మదాలీ జిన్నాతోసహా పలువురున్నారు. దాని పర్యవసానాలు ఈ ఏడున్నర దశాబ్దాలుగా ఆ దేశం అనుభవిస్తూనే ఉంది. క్వెట్టానుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) మిలిటెంట్లు హైజాక్ చేసి వందలమందిని అపహరించుకు పోవటం, కొందరిని హతమార్చటం ఆ వరసలో మరో చర్య. బుధవారం భద్రతా దళాలను రంగంలోకి దింపి దాదాపు 200 మంది ప్రయాణికులను విడిపించినట్టు చెబుతున్నారు. ఇందుకు ప్రతిగా 50 మంది బందీలను మిలిటెంట్లు హతమార్చగా, ఆ తర్వాత మిలిటెంట్లందరినీ పాక్ సైన్యం మట్టుబెట్టిందంటున్నారు. ఇలా నిత్యం నెత్తురోడుతున్న బలూచిస్తాన్ భౌగోళికంగా పాకిస్తాన్‌లోనే ఉన్నా, అక్కడివారు తమను తాము పాకిస్తానీలుగా పరిగణించుకోరు. ఒకనాడు సాధారణ సమస్యల కోసం ఉద్యమించినవారు ఇప్పుడు స్వాతంత్ర్యాన్ని కోరుకునేదాకా వచ్చారు. పాక్ పాలకుల నిర్వాకమే ఇందుకు కారణం.

బలూచిస్తాన్ సాధారణ ప్రాంతం కాదు. ఇక్కడి భూమిలో బంగారం, వజ్రాలు, వెండి, రాగి వనరులు నిక్షిప్తమైవున్నాయి. దేశ వర్తక, వాణిజ్యాలను అత్యున్నత స్థాయికి తీసుకుపోగల డీప్ సీ పోర్టు ఉన్న గ్వాదర్ కూడా ఇక్కడిదే. 2002లో ఈ ఓడరేవు తొలి దశలో కొంత భాగాన్ని పూర్తిచేసి ఆదరాబాదరాగా ప్రారంభించారు. కానీ ఆ తర్వాత పనులు పడకేశాయి. దీన్ని నిర్మిస్తున్న చైనా... స్థానికులకు నామమాత్రం అవకాశాలిచ్చింది. ఇది బలూచి వాసుల అసంతృప్తిని మరిన్ని రెట్లు పెంచింది. భౌగోళికంగా వైశాల్యంలో ఫ్రాన్స్‌ను పోలివుండే ఈ ప్రాంత జనాభా కేవలం 90 లక్షలు. ఇంత తక్కువ జనాభాతో, అపరిమితమైన వనరులతో ఉండే ఈ బలూచిస్తాన్ గత 77 ఏళ్లలో వాస్తవానికి అద్భుతమైన ప్రగతి సాధించివుండాలి. కానీ విషాదమేమంటే ఇక్కడున్న 70 శాతం మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతుంటారు. వారికి ఉపాధి అవకాశాలుండవు. వేరేచోటకు వెళ్లి స్థిరపడేంత చదువుసంధ్యలుండవు. సైనిక దళాల్లో సైతం బలూచిస్తాన్ వాసులకు మొండిచేయి చూపారు. వారిపై పాక్ సైన్యాధికారుల్లో వున్న అపనమ్మకమూ, భయాందోళనలే అందుకు కారణం. తెలివైన పాలకులైతే ఆ ప్రాంతానికి స్వయంప్రతిపత్తినిచ్చి, దాని అభివృద్ధికి బాటలు పరిచేవారు. కానీ పాకిస్తాన్ పాలకులు అణచివేతే పరిష్కారం అనుకున్నారు. సైనిక పదఘట్టనలతో అది పాదాక్రాంతం అవుతుందనుకున్నారు.

బలూచిస్తాన్‌లో తరచు మిలిటెంట్ దాడులకు పాల్పడే బీఎల్‌ఏ 2000 సంవత్సరంలో ఏర్పడినా అంతకు చాలాముందునుంచే ఉద్యమకారులను అపహరించి మాయం చేయటం, బూటకపు ఎన్‌కౌంటర్లలో వారిని హతమార్చటం పాక్ సైన్యం ఒక పద్ధతిగా కొనసాగించింది. 2011 నుంచి లెక్కేసినా దాదాపు 10,000 మంది అదృశ్యమయ్యారని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అంటున్నది. బీఎల్‌ఏ సైతం అదే మార్గం ఎంచుకుంది. మొదట్లో చెదురు మదురు ఘటనలకే పరిమితమైన ఆ సంస్థ ఇటీవలి కాలంలో భారీ దాడులకు పాల్పడుతోంది. బీఎల్‌ఏ కారణంగా చైనా–పాకిస్తాన్ కారిడార్ (సీపీఈసీ) అటకెక్కేలావుంది. చైనా ఖండాంతర ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్‌ఐ)లో సీపీఈసీ కీలకమైనది. కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న జాతీయ రహదారులనూ, ఇతర మౌలిక సదుపాయాలనూ బీఎల్‌ఏ లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయటం ఇందుకే. 6,500 కోట్ల డాలర్ల విలువైన సీపీఈసీలో ఇంధనం, రవాణా, పారిశ్రామిక కారిడార్లూ, గ్వాదర్ పోర్టు వగైరాలున్నాయి. స్థానికులకు అవకాశాలీయకుండా ఇంత పెద్ద నిర్మాణాన్ని తలకెత్తుకుంటే అసంతృప్తి రాజుకుంటుందన్న ఇంగితజ్ఞానం పాలకులకు కొరవడింది.

బలూచిస్తాన్ వాసుల డిమాండ్లు ధర్మమైనవి. కానీ అందుకు హింసాత్మక మార్గాన్ని ఎంచుకోవటంవల్ల న్యాయమైన సమస్య మరుగున పడుతుంది. బలూచిస్తాన్‌లో జాతి, మత, తెగ, రాజకీయ విశ్వాసాలతో నిమిత్తం లేకుండా మానవ హక్కుల కోసం పోరాడే బలూచ్ యక్‌జహితీ కమిటీ (బీవైసీ) 2019 నుంచీ పనిచేస్తోంది. ఆ సంస్థ నాయకురాలు డాక్టర్ మెహ్రాంగ్ బలూచ్‌కు అన్ని వర్గాల నుంచీ అపారమైన ఆదరణ వుంది. పాక్ సైన్యం ఆగడాల కారణంగా తండ్రి అదృశ్యం కావటం, చాన్నాళ్ల తర్వాత ఛిద్రమైన ఆయన మృతదేహం లభ్యం కావటం ఆమె పట్టుదలను మరింత పెంచాయి. నిరుడు ఆగస్టులో డాక్టర్ మెహ్రాంగ్ గ్వాదర్‌లో తలపెట్టిన ర్యాలీయే దీనికి రుజువు. సైన్యం ఎన్ని అడ్డంకులు కల్పించినా అది విజయవంతమైంది. శాంతియుతంగా జరిగిన ఆ ర్యాలీలో పాల్గొన్నారన్న కక్షతో డజన్లకొద్దీమందిని అరెస్టు చేస్తే దానికి నిరసనగా 12 రోజుల పాటు ధర్నా సాగించి వారిని విడిపించుకున్న చరిత్ర బీవైసీది. అణచివేత ధిక్కారానికి దారి తీస్తుంది. దాన్ని ఉపేక్షిస్తే తిరుగుబాటుకు బాటలు పరుస్తుంది. ప్రజల మౌలిక ఆకాంక్షలను బేఖాతరు చేస్తే ఎంత శక్తిమంతమైన రాజ్యానికైనా భంగపాటు తప్పదు. బలూచిస్తాన్ ప్రజలు దాన్నే చాటుతున్నారు.

మనోభావాల మందుపాతర?

విశ్లేషణ



ఎన్. వేణుగోపాల్

ఒక కార్టూన్ ప్రకటించడం రాజ్యాంగబద్ధమైన భావప్రకటనా స్వేచ్ఛలో భాగం అవునా కాదా నిర్ధారించుకోవడానికి ఒక పత్రిక ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసిన దుస్థితికి చేరింది మన సమాజం. ఇవాళ దేశంలో కార్టూన్ అనే అతి సాధారణ సృజనాత్మక ప్రక్రియ మనోభావాల మందుపాతరగా మారిపోయింది. ఒక కార్టూన్ వల్ల భారత సార్వభౌమత్వానికీ, సమగ్రతకూ, పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలకూ ముప్పు వాటిల్లుతున్నదనీ మద్రాసు హైకోర్టు ముందర కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది.

ఇంతకూ ఏమిటా కార్టూన్? అమెరికా ప్రభుత్వం తన దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించారని, లేదా చట్టవిరుద్ధంగా ఉంటున్నారని 300కు పైగా భారతీయ పౌరులను పట్టుకుని, ఫిబ్రవరిలో మూడు విడతలుగా వెనక్కి పంపించింది. ఆ దేశపు చట్టాల ప్రకారం అది సాధారణమే కావచ్చు. వారు తమ దేశంలో ప్రవేశించిన నేరం చేసినందుకు దేశం నుంచి వెళ్లగొట్టడం అనే శిక్ష వేశారు, సరిపోయింది. ఒకే నేరానికి రెండు, మూడు శిక్షలు వేయడం సహజ న్యాయానికి వ్యతిరేకం. కానీ వారికి రెండో శిక్షగా చేతులకూ కాళ్లకూ సంకెళ్లు వేశారు. మూడో శిక్షగా వారిని జంతువుల్లా, సరుకుల్లా చూసి యుద్ధవిమానాల్లో రవాణా చేశారు. ఇది తప్పనిసరిగా భారత ప్రజలకు జరిగిన అవమానం, నేరాన్ని మించి శిక్ష విధించడం. భారత ప్రభుత్వంలో అత్యున్నతాధికారం నెరపుతున్న వ్యక్తిగా ప్రధాన మంత్రి తన సాటి పౌరులకు జరిగిన ఈ అవమానం గురించి, విపరీత శిక్షల గురించి ఆ శిక్షలు విధించిన దేశాధ్యక్షుడితో సమావేశంలో కనీసం మాట మాత్రం ప్రస్తావించకపోవడం, నిరసన తెలపకపోవడం ఎవరినైనా ఆలోచింపజేస్తుంది. అలా అవతలివైపు వ్యంగ్య ఆలోచనకు చిత్రరూపమైన కార్టూన్‌ను సుప్రసిద్ధ తమిళ పత్రిక 'ఆనంద వికటన్'కు చెందిన వికటన్ ప్లస్ వెబ్‌సైట్ ఫిబ్రవరి 10 సంచిక ముఖచిత్రంగా ప్రచురించింది. అందులో అమెరికా అధ్యక్షుడి ముందు భారత ప్రధాని చేతులకూ కాళ్లకూ సంకెళ్లతో కూచుని ఉన్నట్టు చిత్రించారు. దాని మీద తమిళనాడు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకుల ఫిర్యాదు మేరకు, వెంటనే కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆనంద వికటన్ వెబ్‌సైట్‌ను మూసివేసింది.

తర్వాత 'ఆనంద వికటన్' పిటిషన్‌పై విచారణ జరుపుతున్న మద్రాసు హైకోర్టు ఇప్పటికైతే, మధ్యంతర ఉత్తర్వులలో వెబ్‌సైట్‌ను మూసివేయగూడదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తుదితీర్పు వచ్చేదాక కార్టూన్‌ను ఉపసంహరించాలని ఆనంద వికటన్‌కు సూచించింది.

ఇట్టే పడే దృష్టి!

ఏదైనా పత్రిక చూస్తున్నప్పుడు పాఠకుల దృష్టి సహజంగా కార్టూన్ మీదికి పోతుంది. మిగిలిన వార్తలన్నీ నిండా అలుక్కుపోయి ఉండగా, కార్టూన్ స్థలం సింగిల్ కాలం అయినా, రెండు కాలాలో మూడు కాలాలో అయినా, ఆ రేఖలూ, రేఖల మధ్య ఖాళీలూ, బాగా తెలిసిన ముఖాలే కాస్త వక్రంగా మారి ఉండటమూ, ఒకటో రెండో హాస్య, వ్యంగ్య, వెటకార పూరితమైన వాక్యాల వ్యాఖ్యలూ తప్పనిసరిగా పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి. కార్టూన్ ప్రక్రియ ఎంతో ఆదరణ చూరగొన్నదీ, గౌరవనీయమైనదీ మాత్రమే కాక కనీసం రెండు వందల సంవత్సరాల చరిత్ర ఉన్నది. పందొమ్మిదో శతాబ్దపు మధ్య భాగంలో 'పంచ్' పత్రికలో రాజకీయ కార్టూన్లు ప్రారంభమయ్యాయంటారు. రాజకీయ నాయకులే నిర్ణేతలుగా, ప్రముఖులుగా, అందరికీ తెలిసినవారుగా ఉన్న సమాజంలో వారే కార్టూన్‌కు ప్రధాన వస్తువు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు. అలాగే రాజకీయ ఘటనల ప్రభావం సమాజంలో ప్రతి ఒక్కరి మీద ఉంటుంది గనుక, ఆ ఘటనల అవతలి కోణం మీద ప్రజలకు ఆసక్తి ఉంటుంది గనుక సహజంగానే వాటి మీద వ్యంగ్యపు, వెటకారపు వ్యాఖ్యానం బహుళ జనాదరణ పొందుతుంది.

ఒక ప్రక్రియగా కార్టూన్ ఎంత విశాలమైనదీ, లోతైనదీ, ఆకర్షణీయమైనదీ, ఆమోదయోగ్యమైనదీ అంటే ఆ కార్టూన్‌లో వెటకారానికి గురైన రాజకీయ నాయకులకు కూడా అది నవ్వు పుట్టిస్తుంది. అది తమను నొప్పించిందనో, వెటకరించిందనో, తమ మీద వ్యంగ్య వ్యాఖ్య చేసిందనో నొచ్చుకునే సందర్భంలో అయినా ఆ బాధిత వ్యక్తులు కూడా నవ్వుకునే గొప్ప కళ కార్టూన్. అసలు తనమీద వచ్చిన పరిహాసాన్ని ఆమోదించడం, తన పనిమీద వ్యంగ్య వ్యాఖ్యకు అవకాశం ఇవ్వడం ఆ వ్యక్తి విశాల హృదయానికి, సౌమనస్యానికి సంకేతాలు.

వ్యంగ్యాన్ని స్వీకరించలేక...


అందువల్లనే కార్టూన్ల, హాస్య, వ్యంగ్య రచనల వారపత్రికగా వెలువడుతుండిన 'శంకర్స్ వీక్లీ'ని అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆదరించాడు. అసలు శంకర్స్ వీక్లీ పుట్టుక కథే చిత్రమైనది. అప్పటికి 'హిందుస్థాన్ టైమ్స్'లో కార్టూనిస్టుగా ఉండిన శంకర్ పిళ్లై అప్పటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి మీద విపరీతంగా కార్టూన్లు వేస్తుండగా అవి ఆపమని సంపాదకుడు దేవదాస్ గాంధీ ఆదేశించాడు. దానితో విభేదించి బైటికి వచ్చిన శంకర్ తన సొంత పత్రికగా 1948లో 'శంకర్స్ వీక్లీ' పెట్టాడు. ''మౌలికంగా వ్యవస్థా (ప్రభుత్వ) వ్యతిరేక పత్రిక'' అని శంకర్ చెప్పుకున్నప్పటికీ, పత్రికను ప్రధానమంత్రి నెహ్రూనే ఆవిష్కరించాడు. ఆ పత్రికలో తన మీద, తన మంత్రివర్గం మీద, తన ప్రభుత్వపు చర్యల మీద శంకర్, ఇతర కార్టూనిస్టులు వేసిన కార్టూన్ల లోని హాస్యాన్నీ వ్యంగ్యాన్నీ నెహ్రూ అభినందించాడు. ఇరవై ఏడు సంవత్సరాలు నిరాటంకంగా నడిచిన 'శంకర్స్ వీక్లీ' ఎమర్జెన్సీ విధించాక ఆరు వారాలకు ఆగిపోయింది. ఎమర్జెన్సీకీ పత్రిక ఆగిపోవడానికీ సంబంధం లేదని శంకర్ అన్నాడు. ఆ పత్రిక చూడటం తనకు చాలా అలవాటనీ, అది చూడకపోతే కొరతగా ఉంటుందనీ ఇందిరా గాంధీ కూడా అంది. కానీ మొత్తానికి పత్రిక ఆగిపోయింది.

తర్వాతి కాలంలో శంకర్స్ వీక్లీలా పూర్తిగా కార్టూన్లకూ, హాస్య, వ్యంగ్య రచనలకూ అంకితమైన పత్రికే లేకుండా పోయింది. బహుశా మన సమాజంలో హాస్య చతురత, హాస్యాన్నీ, వ్యంగ్యాన్నీ ఆమోదించే విశాల హృదయాలు కుంచించుకుపోవడం మొదలయిందేమో!

'శంకర్స్ వీక్లీ'లోనే ప్రారంభమైన ఆర్.కె. లక్ష్మణ్, ఒ.వి. విజయన్, ఇ.పి.ఉన్ని, రాజిందర్ పూరీ, కుట్టి, బాల్ థాకరే, యేసుదాసన్ వంటి ఎందరో రాజకీయ కార్టూనిస్టులు నాలుగు దశాబ్దాలు భారత రాజకీయ కార్టూన్ రంగాన్ని వెలిగించారు. తెలుగులో కూడా ఎందరో రాజకీయ కార్టూనిస్టులు ఎందరెందరో నాయకుల మాటలనూ, హావభావాలనూ, పనులనూ తరతరాలు నవ్వుకునేంత హాస్య, వ్యంగ్య దృష్టితో చిత్రించారు.

ఆ మహోజ్వల చరిత్ర గల కార్టూన్ కళకు ఇప్పుడు కాని కాలం దాపురించినట్టే ఉంది. పూర్తిగా కార్టూన్లకు, హాస్య, వ్యంగ్య రచనలకు అంకితమైన పత్రికలు లేవు. పత్రికల్లో ప్రతిరోజూ కార్టూన్ కనబడటం లేదు. సింగిల్ కాలం పాకెట్ కార్టూన్ మొక్కుబడి వ్యవహారమైపోయింది. కార్టూన్ స్ట్రిప్‌లు ఖాళీ నింపే ఆరో వేలు అయిపోయాయి. అన్నిటికన్నా ముఖ్యం రాజకీయ కార్టూన్ ఏ రాజకీయ నాయకుడి మనసు నొప్పిస్తుందో, ఏ నాయకుడి భక్తుల మనోభావాలను, ఏ మత, కుల, ప్రాంత, భాషా సమూహపు మనోభావాలను గాయపరుస్తుందో, ఆచితూచి అడుగువేయవలసిన మందుపాతరల క్షేత్రంగా మారిపోయింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



'ఆనంద వికటన్' లోగో

'శంకర్స్ వీక్లీ' కార్టూన్ (1970 జూలై 5)

◆ రాజకీయ నాయకులే నిర్ణేతలుగా, ప్రముఖులుగా, అందరికీ తెలిసినవారుగా ఉన్న సమాజంలో వారే కార్టూన్‌కు ప్రధాన వస్తువు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు.

◆ అక్రమ వలసదారులను అమెరికా సంకెళ్లతో తిప్పి పంపిన నేపథ్యంలో– తమిళ పత్రిక 'ఆనంద వికటన్'లో అమెరికా అధ్యక్షుడి ముందు భారత ప్రధాని చేతులకూ కాళ్లకూ సంకెళ్లతో కూచుని ఉన్నట్టు చిత్రించారు. తమిళనాడు బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ 'ఆనంద వికటన్' వెబ్‌సైట్‌ను మూసివేసింది.

సోషల్ మీడియా

ప్రతీకార చర్య



అఫ్గానిస్తాన్‌లోని మా వాళ్లు చెబుతున్నదేమంటే, అఫ్గానిస్తాన్‌లోని నాయకులను లక్ష్యం చేసుకున్నందుకు ప్రతీకారమే బెలూచిస్తాన్ రైలు హైజాక్. ఎందుకంటే, చాలామంది క్షేత్ర స్థాయి బెలూచ్ నాయకులు అఫ్గానిస్తాన్‌లో ఉంటున్నారు. కొంత 'ప్రతిఘటన' ఏదో చూపాలనుకుంటున్నారు.

– అభిజిత్ అయ్యర్ మిత్ర, వ్యాఖ్యాత

రెండు దెబ్బలు



వృద్ధులకు రెండు రకాల దెబ్బ. మొదటిది – కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసినట్టుగా ఆరోగ్య బీమా మీద 18 శాతం జీఎస్టీని తొలగించలేదు. పైగా కిస్తీని ఈ ఏడాది నుంచి 10 శాతం పెంచారు.

– ఎం.కె. వేణు, సంపాదకుడు

రిటైర్ కావాలంటే...



సొంతిల్లు, అదనంగా ఓ ఐదుకోట్ల రూపాయల విలువైన ఆస్తి లేకుండా ఇండియాలో రిటైర్ అవ్వడానికి లేదు. ఇది కేవలం మధ్యతరగతిగా బతకడానికి! అదే కొంచెం విలాసంగా జీవించాలంటే 20 కోట్లయినా ఉండాలి.

– సౌరవ్ దత్తా, ఫైనాన్షియల్ అడ్వైజర్

చెప్పేందుకు మాత్రమే...



నాకు విచిత్రంగా కనిపించేది ఏమంటే, భిన్నత్వమే మన గొప్ప బలం అని చెప్పేవాళ్లంతా, భిన్న సమూహాల మధ్య తేడాలు ఉంటాయని సూచించినప్పుడు భయంతో వెనక్కిపోతారు.

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

వద్దు బలవంతం



హోలీ దాదాపు దగ్గరికి వచ్చేసింది. మీ ఉద్దేశాలు ఏవైనా ఏ మహిళనూ హోలీ ఆడమని బలవంత పెట్టకండి.

– సుఖద, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఆటలు లేని బాల్యమా?

ప్రపంచీకరణతో మన దేశానికి ఏస్థాయిలో మేలు జరిగిందో అదే స్థాయిలో కీడూ జరుగుతోంది. ఇప్పటి వరకూ పాశ్చాత్యదేశాలను మాత్రమే పట్టి పీడిస్తూ వచ్చిన అధిక బరువు, ఊబకాయం లాంటి సమస్య అభివృద్ధి చెందుతున్న భారత్‌కు సైతం తలనొప్పిగా మారింది. ప్రధానంగా చిన్నారులలో అధిక బరువు, ఊబకాయాలు... ఫ్యాటీ లివర్ వ్యాధికి దారి తీయడం ఆందోళన కలిగిస్తోంది. జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనూహ్యంగా మార్పులకు లోనుకావటం, ఆడుకునే అవకాశం లేకపోవడం పిల్లల ఈ స్థితికి కారణమని నిపుణులు అంటున్నారు.

పాఠశాల స్థాయి నుంచే ఆటలకు దూరమవుతున్న చిన్నారులు టీవీలకు, సెల్ ఫోన్లకు బానిసలవుతున్నారు. బాల్యంలో ఓ ప్రధాన భాగమైన సంప్రదాయ (కోతి కొమ్మచ్చి, తొక్కుడు బిళ్ల, కర్రాబిళ్ళా, బెచ్చాలు, గోళీ లాంటి) ఆటలకు సైతం నోచుకోలేక పోతున్నారు.



విద్యారంగంలో ప్రభుత్వ భాగస్వామ్యం తగ్గి ప్రైవేటు భాగస్వామ్యం రాను రాను పెరిగిపోవడంతో ఆటలు అటకెక్కాయి. చదువే ప్రధాన వ్యాపకంగా మారిపోయింది. విద్య ప్రభుత్వ బాధ్యతగా ఉన్నంతకాలం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో క్రీడలకు తగిన సదుపాయాలు ఉండేవి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలకు సువిశాలమైన ఆటస్థలాలతో పాటు తగిన సంఖ్యలో వ్యాయామ ఉపాధ్యాయులు సైతం ఉండటం ఒకప్పుడు సాధారణ విషయమైతే ఇప్పుడు అసాధారణ విషయంగా మారిపోయింది. ఉభయ తెలుగు రాష్ట్రాల లోని పలు నగరాలలో సింగిల్ బెడ్ రూమ్ పాఠశాలలు, డబుల్ బెడ్ రూమ్ కళాశాలలు మనకు ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా సదుపాయాలు, మైదానాలు మచ్చుకైనా కనిపించవు. ఇలాంటి విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ఆటలంటే ఏమిటో తెలియకుండా అమూల్యమైన తమ బాల్యాన్నీ, విద్యార్థి దశనూ ముగించడాన్ని మించిన విషాదం మరొకటి లేదు.

పాఠశాల దశ నుంచే ఆటలకు, క్రీడాసంస్కృతికి దూరమైన చిన్నారులు ఆ తరువాతి కాలంలో శారీరకంగా, మానసికంగా పలు రకాల సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తోంది. మన దేశంలో ఈమధ్య కాలంలో నిర్వహించిన పలు అధ్యయనాల ప్రకారం ఆటపాటలకు దూరమైన చిన్నారులు అధిక బరువుతో పాటు ఫ్యాటీ లివర్ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్) వ్యాధి బారిన పడుతున్నట్లు తేలింది. పిల్లలు బాల్యంలో ఆటలకు దూరంకావడం అంటే శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు దూరంకావటమేనని నిపుణులు చెబుతున్నారు.

దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా అధ్యయనాల ప్రకారం దేశ జనాభాలో 60 శాతం మంది అధిక బరువు సమస్య ఎదుర్కొంటుంటే... అందులో 30 శాతం మంది ఊబకాయం సమస్యతో నానాపాట్లు పడుతున్నారు. బాలల్లో 40 శాతం మంది ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) చైర్మన్ డా॥ నాగేశ్వర రెడ్డి సైతం హెచ్చరిస్తున్నారు.

తమ పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో బాల్యంలో ఆటలూ అంతే ముఖ్యమని తల్లిదండ్రులూ... ఆరోగ్యవంతమైన, ఆహ్లాదభరితమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత తమపైనే ఉందని పాలకులూ, పాఠశాలల యాజమాన్యాలు గ్రహించిన రోజే బాల్యం అమూల్యంగా, అపురూపంగా మిగిలిపోగలుగుతుంది.

– కృష్ణారావు చొప్పరపు
సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ ၊ 84668 64969

హిందీ వ్యతిరేకత ఎందుకు?

అభిప్రాయం



ఉల్లి బాలరంగయ్య

మత, భాష, ప్రాంతీయ ఉన్మాదాలు భారతదేశ సమగ్రతకు, సమైక్యతకు గొడ్డలిపెట్టు అనే విషయంలో దేశ హితాన్ని కోరే అందరి వ్యక్తుల అభిప్రాయం ఒకే విధంగా ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీ భాషపై అవాకులు చవాకులు పేలడం దేశంలో పెద్ద చర్చనీయాంశమైంది. 'త్రిభాషా సూత్రం' అమలులో భాగంగా హిందీనీ విద్యాలయాల్లో బోధించడాన్ని వ్యతిరేకించడం తమిళ రాజకీయాలలో ఒక భాగమే. దేశంలో తెలివైన విద్యార్థులకు మంచి విద్యను అందించడానికి, విద్యార్థుల్లో 'ఈ దేశం నాది' అనే భావనను నిర్మాణం చేయడానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో 'నవోదయ' విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలు తమిళనాడుకు అవసరం లేదని ద్రవిడ పార్టీల నాయకులు అడ్డుకున్నారు. ఆ పాఠశాలల్లో హిందీని ఒక భాషగా బోధించడమే ఇందుకు కారణం. 'సర్వ శిక్షా అభియాన్' నిధులను తమిళనాడు రాష్ట్రానికి ఇవ్వడం విషయంలో కేంద్రానికి–రాష్ట్రానికి మధ్య చోటుచేసుకున్న వివాదం కారణంగా త్రిభాషా సూత్రం తమిళనాడు రాష్ట్రంలో అమలు చేయడం వీలు కాదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ బహిరంగ ప్రకటన చేయడంతో త్రిభాషా సూత్రం అమలు విషయంపై రాద్ధాంతం మళ్లీ తెరపైకి వచ్చింది.



దక్షిణ భారతంలో ఉన్న ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఈ విషయంపై అభ్యంతరాలు లేవు. త్రిభాషా సూత్రం అమలులో భాగంగా దక్షిణాదిలో రాష్ట్ర భాష, ఇంగ్లీషు, హిందీ బోధించేటట్లు; ఉత్తరాదిలో హిందీ, ఇంగ్లీషు, ఏదైనా దక్షిణాది రాష్ట్రాల భాష (తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం ఏదో ఒకటి) బోధించేటట్లు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఏకాభిప్రాయంతో నాటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే తమిళులు దీన్ని వ్యతిరేకించారు. తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం ఈనాటిది కాదు. 1937లో 'ద్రావిడార్ కళగం' పేరుతో ఈవీ రామస్వామి తమిళ ప్రజలను రెచ్చగొట్టి, 'ఉత్తరాది వారి భాష హిందీ మనకెందు'కంటూ, తమిళ ప్రజల్లో హిందీ భాషపై ద్వేషాన్ని నూరి పోశారు. తమిళనాడులోని జస్టిస్ పార్టీ కూడా ఈ హిందీ వ్యతిరేక ఉద్యమానికి అండగా నిలిచింది. అగ్నికి ఆజ్యం పోసింది. ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో అప్పటి రాజగోపాలాచారి నేతృత్వంలోని మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రభుత్వం రాజీనామా చేయడంతో ఉద్యమం చల్లారింది. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఇంగ్లీషు స్థానంలో హిందీని జాతీయ భాషగా ప్రవేశపెట్టాలని ఆలోచించడంతో 1965లో 'ద తమిళనాడు స్టూడెంట్స్ యాంటీ హిందీ యాజిటేషన్ కౌన్సిల్' పేరుతో తమిళ నాయకులు పెద్ద ఎత్తున హింసాత్మక ఉద్యమాన్ని లేవదీశారు. ఉద్యమాన్ని అణచడానికి పారా మిలటరీ దళం రంగ ప్రవేశం చేయడంతో 500 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. నాటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి బలవంతంగా హిందీని తమిళ ప్రజలపై రుద్దే అవకాశం లేదని ప్రకటించడంతో ఉద్యమం ఆగిపోయింది.


ఈ ఉద్యమ ప్రభావంతో 1967 ఎన్నికల్లో తమిళనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. ఉత్తరాది ప్రజలు ఆర్య సంస్కృతికి చెందిన వారనీ, వారి భాష హిందీ అనీ, ఆ భాషను మాట్లాడటం తమిళుల ఆత్మగౌరవానికి భంగం అనే భావనను తమిళ ప్రజల మనసులో బాగా చొప్పించారు బ్రిటిష్ పాలకులు. పాశ్చాత్య కోణంలో హిందూ సంస్కృతిని దునుమాడడమే ధ్యేయంగా పెట్టుకున్న ఈవీ రామ స్వామి బ్రిటిష్ పాలకులకు ఒక పనిముట్టుగా దొరికారు. ఆయన ప్రియ శిష్యుడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శ్రీరామునిపై, రామాయణంపై దుర్వ్యాఖ్యలు చేయడం, ఆయన మనుమడు ఉదయనిధి ఒక మంత్రి హోదాలో సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా లాంటిదని మాట్లాడటం బ్రిటిష్ వాళ్ళు నూరి పోసిన ఆర్య ద్రావిడ వాద ప్రభావమే! తమిళులే హిందీని వ్యతిరేకించడం వెనుక దాగి ఉన్న రహస్యం ఇదే!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

ముందే మేల్కొనాలి!

ఎవరైతే జీవిత ప్రాముఖ్యాన్నీ, దాని ప్రయోజనాన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నించరో... అటువంటివారు తమ జీవితాన్ని వృథా చేసుకొంటారు. చాలామంది తాము ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, వృత్తులపైనా; బంధువులు, స్నేహితులు, విలాసాలపైనా మనసును నిమగ్నం చేసి జీవితాన్ని గడుపుతూ ఉంటారు. అటువంటివారు దురదృష్టవంతులు. ఎందుకంటే... వారు పైపై ప్రాపంచిక విషయాల వల్ల సంతోషాన్ని పొందుతూ, విషయ వాంఛల్లో మునిగిపోతూ ఉంటారు. జీవితంలో ఏ సంఘటన కూడా అటువంటి వారి హృదయాన్ని చలింపజేయదు. ఆ విధంగా ఎంత కాలం మోటుగా జీవితం సాగించగలరు?

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

పరాత్పరుడే వారిని ఏదో ఒకరోజు తన వైపు మళ్ళించుకుంటాడు. ముందుగా ప్రతికూలత, నిరాశ, నిస్పృహలు వారిని చుట్టు ముడతాయి. అందువలన వారికి అతీతమైన ఏదో ఒక శక్తి వారి ఊహలను తారుమారు చేస్తూ ఉన్నట్లు తెలుసుకుంటారు. అప్పుడు వారు నెమ్మదిగా దేవాలయాలకు, గురువు దగ్గరికి వెళ్ళడం, సంప్రదాయంగా పూజించడం ప్రారంభిస్తారు. చివరగా వారు జీవితం ఎందుకు వచ్చింది, దానికి గల ప్రయోజనం ఏమిటి అని ఆలోచిస్తారు.

దుఃఖం, నిరాశ కలిగే వరకూ వేచివుండి, దేవుని శరణుజొచ్చుట తెలివిగలవారు చేసే పనేనా? మరణం సంభవించే వరకూ నిరీక్షిస్తూ, మందబుద్ధితో ఉండటమా? దీని గురించి సుదీర్ఘంగా ఆలోచించాలి. నీకు జీవితం ఎందుకు వచ్చిందంటూ విచారిస్తూ (ఆలోచిస్తూ) కాలం వృథా చేయకూడదు. అంటే ఈ విషయాన్ని త్వరగా తెలుసుకొని, జీవితాన్ని సఫలం చేసుకోవాలి.

ఉపన్యాసాల కన్నా, రాతల కన్నా శక్తిమంతమైనది ధ్యానశక్తి. ఉపన్యాసాలు, పుస్తకాలు స్వల్ప ప్రయోజనం కలిగిస్తాయి. ప్రారంభ దశలో ఉన్నవారికి అవి మార్గాన్ని చూపించడానికి ఉపయోగపడతాయి. ఆధ్యాత్మిక విషయాలలో అవి మీ ఆసక్తిని పెంపొందించినా పెంపొందించవచ్చు. మెదడుకు మేత పెట్టవచ్చు. బుద్ధికి ప్రోత్సాహాన్ని కలిగించవచ్చు. కాని అవి 'ఆత్మజ్యోతి'ని చూపించలేవు. ఇటువంటి దర్శనానికై మనస్సు ఆత్మను అంటిపెట్టుకొని ఉండాలి. ఈ విషయంలో సద్గురువు నిర్దేశంలో ధ్యానం చేయడమే మార్గం.

నీవు దేనిని గూర్చి అన్వేషిస్తున్నావో, అది నీ లోపలే ఉంది. పుస్తకాలన్నీ బాహ్య ప్రపంచంలో ఉన్నాయి. ధ్యానంలోనే నిజమైన కార్యం జరిగిపోతుంది. 'ఆత్మపై లక్ష్యమును ఉంచి ధ్యానం చెయ్యి' అని భగవద్గీత కూడా ప్రబోధిస్తోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.10.20 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పుబ్బ తె.5.40 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ప.12.39 నుండి 2.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.12 నుండి 11.00 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** రా.10.56 నుండి 12.39 వరకు, హోలీ పండుగ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 6.05.

‘మండలి’లో టీడీపీ సెల్ఫ్‌గోల్

గత ప్రభుత్వంలో సచివాలయ భవనాలు తాకట్టు పెట్టిన మాట వాస్తవమేనా అంటూ ‘మండలి’లో టీడీపీ ప్రశ్న

- బదులివ్వకుండానే సభ్యులు ప్రశ్నను ఉపసంహరించుకున్నారని ప్రభుత్వం వెల్లడి
- గతేడాది ఈ అంశంపై ఎల్లో మీడియాలో దుష్ప్రచారం
- ఇది అవాస్తవమని అప్పట్లోనే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: గత వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం రాష్ట్ర సచివాలయ భవనాలను తాకట్టు పెట్టేసిందంటూ ‘మండలి’లో టీడీపీ ప్రశ్న వేసి సెల్ఫ్‌గోల్‌ చేసుకుంది. 2019–24 మధ్య రాష్ట్ర సచివాలయ భవనాలు తాకట్టు పెట్టిన విషయం వాస్తవమేనా అని టీడీపీ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌ రెడ్డి, పరుచూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి.. సీఎం చంద్రబాబు తరపున మంత్రులు బుధవారం ‘మండలి’లో సమాధానం ఇవ్వాల్సి ఉండగా, సభ్యులు ప్రశ్నను ఉపసంహరించుకున్నారని ప్రకటించారు.


FactCheck.AP.Gov.in
@FactCheckAPGov
‘తాకట్టులో సచివాలయం’ శీర్షికతో 03-03-2024న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన వార్త పూర్తిగా అవాస్తవం. ఈ కథనాన్ని స్వయంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖండించింది. ...
Translate post

సచివాలయాల తాకట్టు అంటూ ప్రచురించిన కథనం అవాస్తవమని గతేడాది మార్చిలో ఫ్యాక్ట్‌ చెక్‌ పేజీలో స్పష్టం చేసిన ప్రభుత్వం

పరువుపోతుందని విత్‌డ్రా

‘మండలి’లో బుధవారం ఈ ప్రశ్న పోస్ట్‌ అవడంతో ప్రభుత్వం ఇచ్చే సమాధానం ఆధారంగా అనుబంధ ప్రశ్నలు వేయడంతో పాటు, గత ప్రభుత్వంపై బురద జల్లడానికి వీలుగా టీడీపీ ఎమ్మెల్సీలు సిద్ధమైనట్లు తెలిసింది. పైగా ఆ పత్రికలో ప్రచురించిన తప్పుడు కథనం తాలూకు ప్రతులను సైతం వెంటబెట్టుకుని వచ్చారు. అయితే, ఈ ఆరోపణలు అవాస్తవమని ప్రభుత్వం ‘మండలి’కి సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో.. టీడీపీ నేతలు, ప్రభుత్వ పెద్దల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లైంది. ఈ అంశంపై యథావిధిగా సమాధానమిస్తే తమ పరువే పోతుందని ప్రభుత్వ పెద్దలు భావించారో ఏమో.. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా, సభ్యులే ప్రశ్నను విరమించుకున్నారని ప్రకటించారు. వాస్తవాలు పరిశీలిస్తే.. రూ.370 కోట్లకు రాష్ట్ర సచివాలయ భవనాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని ‘తాకట్టులో సచివాలయం’ అంటూ గతేడాది మార్చి 3న బూతు పత్రిక ఓ తప్పుడు కథనం ప్రచురించింది. ఈ కథనం అవాస్తవమని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు అప్పట్లోనే కొట్టిపారేశారు. అయినా, ఇదే అంశంపై శాసన మండలిలో టీడీపీ ప్రశ్నవేసి తోక ముడిచింది.

ఎస్సీ కమిషన్‌ నివేదిక
నోటిఫై అయ్యాకే డీఎస్సీ



- ఈ ఏడాదే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం
- తల్లిదండ్రులే పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వొద్దన్నారు
- గత సర్కారులో రూ.1,300 కోట్లు వృథా
- శాసన మండలిలో మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌

సాక్షి, అమరావతి: ‘ఎస్సీ వర్గీకరణపై వచ్చిన నివేదిక ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అది హౌస్‌లో చర్చకు వస్తుందని అనుకుంటున్నాం. ఆ తర్వాత కేబినెట్‌ ఆమోదంతో ఎస్సీ కమిషన్‌కు పంపించి ఆ మేరకు నోటిఫికేషన్‌ విడుదలయ్యాక డీఎస్సీ నోటిఫికేషన్‌ ఇస్తాం’ అని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ స్పష్టం చేశారు. డీఎస్సీకి కట్టుబడి ఉన్నామని, ఈ సంవత్సరమే ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. బుధవారం శాసన మండలిలో ‘విద్యా రంగంలో సంస్కరణల’పై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్స్‌ ఇవ్వడం ద్వారా రూ.1,300 కోట్లు వృథా చేసిందని విమర్శించారు. ‘తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు ట్యాబ్స్‌ ఇవ్వడం సరికాదని నాతో చెప్పారు. మళ్లీ మీరు ట్యాబ్స్‌ ఇవ్వకండన్నారు. నాకు తొమ్మిది సంవత్సరాల అబ్బాయి దేవాన్ష్‌ ఉన్నాడు. తనకు ఫోన్‌ ఇవ్వం. ఐప్యాడ్‌ లేదు. వారానికి రెండు గంటలు ఒక సినిమా చూడొచ్చు. కానీ, టెక్నాలజీ యుగంలో హోం వర్క్, రీసెర్చ్‌ ఆన్‌లైన్‌ చేయాలంటే డెస్క్‌టాప్‌ (కంప్యూటర్‌)ని అది కూడా సూపర్‌వైజ్‌ చేసి యాక్సెస్‌ ఇస్తాం’ అంటూ చెప్పుకొచ్చారు. సీబీఎస్సీ మోడల్‌ ఎగ్జామ్‌ విధానంపై చాలా ప్రిపరేషన్‌ అవసరమని, అది పూర్తి అయిన తర్వాతే కొనసాగించేందుకు వాయిదా వేశామన్నారు. స్థానికంగా విద్యార్థులు ఇంగ్లిష్‌లో వెనుకబడితే గత ప్రభుత్వం టోఫెల్‌తో ఇబ్బంది పెట్టిందన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గిస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను దశల వారీగా విడుదల చేస్తామని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై ఉపాధ్యాయులకు సెలవుల్లోనే శిక్షణ తరగతులు పెడతామని, వర్సిటీలకు ఉమ్మడి చట్టం తీసుకురావడంతో పాటు డీప్‌టెక్‌ వర్సిటీని నెలకొల్పుతామని చెప్పారు. అంబేడ్కర్‌ ఓపెన్‌ వర్సిటీని డిజిటల్‌ వర్సిటీగా మారుస్తామన్నారు. పంచాయతీరాజ్‌ శాఖను నిర్వహించడం ఎంతో సులువని, అయితే తాను కఠినమైన విద్యా శాఖను తీసుకున్నానని తెలిపారు.

క్లుప్తంగా...

ఎన్టీఆర్‌ వైద్యసేవ ట్రస్ట్‌తో చర్చలు విఫలం
ఈ నెల 17 నుంచి నిరసనలు



సాక్షి, అమరావతి: డిమాండ్ల పరిష్కారం కోరుతూ సామూహిక శాంతియుత నిరసనలు తెలపాలని ఎన్టీఆర్‌ వైద్య సేవ ఫీల్డ్‌ ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. వైద్యసేవ ట్రస్ట్‌ అధికారులతో బుధవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో భవిష్యత్‌ కార్యాచరణను అసోసియేషన్‌ ప్రతినిధులు మీడియాకు తెలిపారు. ఈ నెల 16లోగా క్యాడర్‌ అమలు చేసి ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా తమను గుర్తిస్తూ జీవో జారీ చేయాలని అల్టిమేటం ఇచ్చారు. 17, 24 తేదీల్లో డీసీ ఆఫీస్‌ ఎదుట, 27న మంగళగిరి ట్రస్ట్‌ ఆఫీస్‌ ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించినట్టు వివరించారు.

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్‌



గుంటూరు లీగల్‌/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాస్టర్‌ను బెదిరించిన కేసులో బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు గుంటూరు ఎక్సైజ్‌ కోర్టు బుధవారం బెయిల్‌ మంజూరు చేసింది. గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో బోరుగడ్డ అనిల్‌కుమార్‌ కోర్టు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. అనంతరం ఆయన ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారు. బెయిల్‌ ముగియడంతో బుధవారం ఉదయం 6 గంటల సమయంలో అనిల్‌ కుమార్‌ రాజమహేంద్రవరం సెంట్రల్‌ జైలులో లొంగిపోగా.. పోలీసులు ఆయనను గుంటూరులోని స్పెషల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ ఫర్‌ ప్రొహిబిషన్‌ ఎక్సైజ్‌ కోర్టులో హాజరుపరిచారు. కేసును క్షుణ్ణంగా పరిశీలించి ఎక్సైజ్‌ కోర్టు బెయిల్‌ మంజూరు చేసింది. తదుపరి ఉత్తర్వులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

వర్రా రవీంద్రారెడ్డికి 14 రోజుల రిమాండ్‌



రవీంద్రారెడ్డిని జగ్గయ్యపేట సబ్‌ జైలుకు తరలిస్తున్న పోలీసులు

జగ్గయ్యపేట: కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌ జిల్లాకు చెందిన సోషల్‌ మీడియా యాక్టివిస్ట్‌ వర్రా రవీంద్రారెడ్డిని ఎన్టీఆర్‌ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు పోలీసులు బుధవారం తెల్లవారుజామున పీటీ వారెంట్‌పై జగ్గయ్యపేటకు తీసుకొచ్చారు. ఉదయం 11 గంటలకు అతడిని కోర్టులో హాజరుపర్చగా అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ ఎమ్‌.శోభారాణి 14 రోజుల రిమాండ్‌ విధించారు. అతని ఆరోగ్య సమస్యల నేపథ్యంలో సబ్‌జైలులో బెడ్‌ ఏర్పాటు చేయాలంటూ పోలీసులను ఆదేశించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు నారా లోకేశ్, భార్య బ్రాహ్మణిపై సోషల్‌ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారంటూ 2024 నవంబర్‌ 11న చిల్లకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎనికే గోపి ఫిర్యాదు చేశారు. దీంతో రవీంద్రారెడ్డిపై కేసు నమోదైంది.

జనసేన సభకు రూ.వందల కోట్లు ఎక్కడివి?
ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌



సాక్షి, రాజమహేంద్రవరం: పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు రూ.వందల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌ నిలదీశారు. రాజమండ్రిలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆవిర్భావ సభ దేనికి పవన్‌ అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని దోచుకోవడానికా.. దాచుకోవడానికా.. సర్వనాశనం చేసేందుకా.. నిరుద్యోగుల కడుపులు కొట్టేందుకా.. ప్రజల్ని సర్వనాశనం చేసేందుకా? అని దుయ్యబట్టారు. జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ఖర్చు పెడుతున్న రూ.కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో తనకు తెలుసన్నారు. రూ.కోట్లు ఎలా ట్రాన్స్‌ఫర్‌ చేశారో కోర్టులో కేసు వేశానని, దానిపై విచారణ జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో 9 నెలల్లోనే కూటమిపై పూర్తి వ్యతిరేకత ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌ మోదీతో ఉండి, టీడీపీని, చంద్రబాబును విమర్శించే స్థాయికి చేరతారన్నారు. పవన్‌ తన ఫ్యూచర్‌ మాత్రమే చూసుకుంటున్నారని చెప్పారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం రూ.10వేల కోట్లు కేటాయించాలి: సీపీఐ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదలకిచ్చే ఇళ్ల స్థలాల కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్‌ బుధవారం సీఎం చంద్రబాబును కలిశారు. ఇప్పటికే పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని మరో వినతిపత్రం అందజేశారు.

హత్యా రాజకీయాలకు ఆద్యుడు చంద్రబాబు

- ఆయన ఎదుగుదలంతా కుట్రలు, కుతంత్రాలతోనే
- జైల్లో ఉన్న నిందితులను విడిపించిన చరిత్ర చంద్రబాబుదే
- నందమూరి లక్ష్మీపార్వతి



సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హత్యా రాజకీయాలకు చంద్రబాబే ఆద్యుడని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి గుర్తు చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ఎదుగుదలంతా కుట్రలు, కుతంత్రాలతోనే ముడిపడి ఉందన్నారు. ప్రతి అడుగులోనూ ఆయన చేసిన కుట్రలు, కుతంత్రాలు కనిపిస్తాయని మండిపడ్డారు. తన 45 ఏళ్ల జీవితంలో హత్యా రాజకీయాలకు దూరంగా ఉన్నానని చంద్రబాబు ఇప్పుడు నీతులు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌ మరణానికి కారకులెవరో ప్రజలందరికీ తెలుసని, అందుకు తాను కూడా ప్రత్యక్ష సాక్షిని అని చెప్పారు. ‘నిన్ను చంపితే దిక్కెవరు జగన్‌’ అని చంద్రబాబు గతంలో హెచ్చరించలేదా.. ఆయన హెచ్చరించినట్లుగానే జగన్‌పై రెండుసార్లు హత్యాయత్నం జరగలేదా అని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా అంగళ్లలో పోలీసులను ఉద్దేశించి ‘తరమండి నా కొడుకుల్ని..’ అంటూ రెచ్చగొట్టి దాడులు చేయించింది చంద్రబాబు కాదా అన్నారు. టీడీపీ నాయకుల దాడుల కారణంగా ఒక పోలీస్‌ కంటిచూపు కోల్పోయాడని గుర్తుచేశారు. చంద్రబాబు మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసిన నాలుగేళ్లలోనే ఆయన ప్రేరణతో ఎన్నో హత్యలు జరిగాయన్నారు. హత్య కేసుల్లో అరెస్టైన నిందితులపై కేసులు ఎత్తేయించి నిర్దోషులుగా బయటకు తీసుకొచ్చిన ఘటనలే చంద్రబాబు హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తారని చెప్పడానికి ఉదాహరణ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకుండానే ఎన్నికల తరువాత హింస ఆయన ప్రోద్బలంతోనే జరిగిందని, వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా వందలాది మందిపై దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇప్పటికీ నడిరోడ్డుపై హత్యలు చేయడం, హత్యాయత్నాలకు పాల్పడటం రాష్ట్రంలో ఏదో ఒక మూల జరుగుతూనే ఉన్నాయి. 1995–1996లో ఒకేసారి రాయలసీమలో 14మందిని హత్య చేయించారని, దీని వెనుక ఉన్నది చంద్రబాబు కాదా అని నిలదీశారు.

చంద్రబాబూ.. ఒక్క ఆరోపణ అయినా రుజువు చేశావా?

నాపై, నా తండ్రిపై కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారు

- మాపై కూటమి ప్రభుత్వం బురద జల్లుతోంది
- మద్యం స్కాం రూ.50 వేల కోట్లని.. ఇప్పుడు రూ.3 వేల కోట్లే అంటున్నారు
- అటవీ భూమిని ఆక్రమించామన్నారు
- 75.76 ఎకరాలు మాదేనని కలెక్టరే నివేదిక ఇచ్చారు
- మీరు ఎంత ఇబ్బంది పెట్టాలని చూస్తే అంత గట్టిగా పోరాడతా
- వైఎస్సార్‌సీపీ లోక్‌సభ ఫ్లోర్‌ లీడర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ‘విమానాశ్రయ సిబ్బందిపై చేయి చేసుకున్నామన్న ఆరోపణ నుంచి అటవీ భూమిని ఆక్రమించామనడం వరకు.. మాపై చేసిన ఏ ఒక్క ఆరోపణ అయినా రుజువు చేశావా చంద్రబాబూ?. మీ ప్రభుత్వానికి ఆ దమ్ము ధైర్యం ఉందా?’ అని వైఎస్సార్‌సీపీ లోక్‌సభ ఫ్లోర్‌ లీడర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చాలెంజ్‌ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ మహావృక్షం వంటివారని, ఆ వృక్షానికి కొమ్మలుగా ఉన్నందుకు తనపైన, తన తండ్రిపైన వ్యక్తిత్వ హననానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. జగన్‌కు అండగా నిలుస్తున్న నేతలను దెబ్బతీయాలనేదే వారి లక్ష్యమని పేర్కొన్నారు. మిథున్‌రెడ్డి బుధవారం ఢిల్లీలోని నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో మద్యం కుంభకోణం మొదట రూ.50 వేల కోట్లు అని.. తర్వాత రూ.30 వేల కోట్లు.. ఆపై రూ.10 వేల కోట్లు అంటూ ప్రచారం చేసిన కూటమి సర్కార్‌.. తాజాగా రూ.3 వేల కోట్లు అంటోందని, ఇది మరో కొత్త నాటకం అని.. తనను ఎంత ఇబ్బంది పెట్టాలని చూస్తే అంతకంటే గట్టిగా పోరాటం చేస్తానని హెచ్చరించారు. మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి ఉన్నారంటూ ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తనపై, తన తండ్రిపై బురద రాజకీయాలు చేసే ప్రతిఒక్కరిపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ‘ఢిల్లీలో ప్రభుత్వ దుకాణాలను ప్రైవేటుపరం చేయడంతో స్కాం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఏపీలో ప్రైవేటు దుకాణాలను ప్రభుత్వమే తీసుకుని నిర్వహించింది. ఇందులో స్కాం ఏముంది? ‘మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఫైల్స్‌ దగ్ధం ఘటనలో మాపై బురదచల్లారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న గౌతమ్‌తేజ్‌ అనే ఉద్యోగిని అరెస్ట్‌ చేశారు. మేం టీడీపీ సానుభూతిపరులం, చంద్రబాబు మాకు బంధువు. మా కుమారుడిని అన్యాయంగా అరెస్ట్‌ చేశారంటూ గౌతమ్‌ తల్లిదండ్రులు మీడియాకు చెప్పారు. గౌతమ్‌ తేజ్‌కు చేసిన సత్యశోధన పరీక్షలోనూ కుట్ర, నేరం నిరూపితం కాలేదు. మైనింగ్‌లో గత ప్రభుత్వం రూ.వేల కోట్లు దోచేసిందంటూ ఆరోపణలు చేసి 2 నెలల పాటు మైనింగ్‌ కార్యాలయాలను సీజ్‌ చేశారు. మరి దర్యాప్తులో ఏం తేల్చారో స్పష్టం చేయాలి. వందలాది మైన్లలో అక్రమాలు అన్నారు, ఒక్కదాంట్లోనైన తప్పు జరిగినట్లు తేల్చారా? వీటిపై ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. ఎర్రచందనం అక్రమ రవాణాతో మాకు సంబంధం ఉందంటూ ఓ మంత్రి, 75.76 ఎకరాల అటవీ భూమి కబ్జా చేశామని ఎల్లో మీడియా ఆరోపణలు చేసింది. ఈ భూమిపై తాజాగా కలెక్టర్‌ నివేదిక ఇచ్చారు. ఆ 75.76 ఎకరాలు మాదేనని తేలింది’ అని మిథున్‌రెడ్డి వివరించారు. కూటమి ప్రభుత్వంలోని పెద్దలు, ఎల్లో మీడియా తమపై దుమ్మెత్తి పోశాయని, అవన్నీ అబద్ధాలు అని నిర్ధారణ జరిగిన తరువాత మౌనంగా ఉంటే సరిపోతుందా? అని నిలదీశారు. తాము చేసింది తప్పేనని వారు బహిరంగంగా అంగీకరించి, క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు.

భద్రాచలం ఆలయంలో ముత్యాల రీసైక్లింగ్‌!

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తులకు విక్రయించగా మిగిలిన ముత్యాల తలంబ్రాలను నిల్వ చేయగా, అవి పాడైపోయినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం వెలుగుచూసింది. కొన్నేళ్లుగా స్వామివారి ముత్యాలతలంబ్రాలకు భక్తుల నుంచి అధిక ఆదరణఉంటోంది. ఈ నేపథ్యంలో గత శ్రీరామ నవమి తర్వాత ఏడాదిపాటు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను విక్రయించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. పెద్ద సంఖ్యలో ప్యాకెట్లు తయారు చేశారు. వేడుకల్లో విక్రయించిన అనంతరం భారీ స్థాయిలో ప్యాకెట్లు మిగిలిపోవడంతో వాటిని దాచిఉంచినట్లు సమాచారం. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తలంబ్రాలు పాడైపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆలయ అధికారులు గుట్టుచప్పుడుకాకుండా సీఆర్వో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఓ సత్రంలో కొద్దిరోజులుగా పాడైపోయిన ప్యాకెట్లలోని తలంబ్రాలను, ముత్యాలను వేరుచేసే ప్రక్రియ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా వేరుచేసిన ముత్యాలను తిరిగి ప్యాకింగ్‌ (రీసైక్లింగ్‌) చేసే అవకాశం ఉంది. కాగా తలంబ్రాలు పూర్తిగా పాడైపోయే స్థితికి చేరేవరకు అధికారులు గమనించకపోవటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కోవిడ్‌ అనంతరం ఇదేవిధంగా మిగిలిన తలంబ్రాలను రామాలయఅధికారులు గోశాలలో గుంతలు తీసి పూడ్చిపెట్టడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. తలంబ్రాలు పాడైన ఘటనపై ఆలయ ఈవో రమాదేవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు.

యలమంచిలి ఎమ్మెల్యే, సోదరునిపై డీఐజీకి ఫిర్యాదు

అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని టీడీపీ నేత ఆరోపణ

అచ్యుతాపురం రూరల్‌: యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అతని సోదరుడు సుందరపు సతీశ్‌కుమార్‌పై పూడిమడక గ్రామానికి చెందిన టీడీపీ నేత మేరుగు అప్పలనాయుడు డీఐజీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సంబరాల ముసుగులో యలమంచిలి ఎమ్మెల్యే, అతని సోదరుడు పలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి రూ.లక్షలు వసూలు చేశారని, దీనిపై విశాఖపట్నం డీఐజీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై 2025 జనవరి 27న ప్రజాదర్బార్‌లో సీఎంకు, జనవాణిలో ఉప ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేసినట్టు అప్పలనాయుడు తెలిపారు. అలాగే జిల్లా ఎస్పీ, డీఎస్పీకి గతంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో బుధవారం డీఐజీకి ఫిర్యాదు చేశామని తెలిపారు.

జాతి ఉద్యమం కోసం పోరాడాలి

ఢిల్లీలో బీసీ మేధావుల సదస్సులో వక్తలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతి ఒక్క బీసీ పౌరుడు జాతి ఉద్యమం కోసం పోరాడాలని పలువురు ఎంపీలు పిలుపునిచ్చారు. ఓబీసీల డిమాండ్ల సాధన కోసం అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని సూచించారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌ అంబేడ్కర్‌ ఆడిటోరియంలో ఓబీసీ డిమాండ్లపై బీసీ మేధావుల సదస్సు జరిగింది. ఎంపీలు ఆర్‌.కృష్ణయ్య, వద్దిరాజు రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, నాగరాజు, అప్పలనాయుడు, అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఓబీసీ డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా ఉద్యమించాలన్నారు. ఆంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్‌.మారేష్, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, పితాని ప్రసాద్, ఆగురు నగరాజు, శశి భార్గవి పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల్లో మూడోరోజూ సోదాలు

కీలక రికార్డులు, భారీగా నగదు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్‌: పన్ను ఎగవేతలకు సంబంధించి శ్రీ చైతన్య విద్యాసంస్థలపై సోమవారం ఉదయం ప్రారంభమైన ఐటీ సోదాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్‌ రోడ్‌ నంబర్‌ 32, రోడ్‌ నంబర్‌ 10లోని శ్రీచైతన్య డైరెక్టర్లు బొప్పన సుష్మ, సీమ ఇళ్లల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అయితే సోదాల సమయంలో వారు ఇంట్లో లేరని సమాచారం. అయిదేళ్లుగా ఆదాయం, ఐటీ చెల్లింపుల్లో అవకతవకలను సోదాల్లో గుర్తించారు. మాదాపూర్‌ అయ్యప్ప సొసైటీలోని కార్పొరేట్‌ ఆఫీస్‌ సహా డైరెక్టర్‌ యలమంచిలి శ్రీధర్‌ ఇల్లు, ఆఫీసుల్లో పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం టౌన్‌లోని ఎన్టీఆర్‌ సర్కిల్‌ శ్రీచైతన్య కాలేజీలోనూ సోదాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబైలోని ప్రాంతీయ కార్యాలయాల్లో హార్డ్‌ డిస్కులు, ఫీజుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో ఇప్పటికే భారీగా నగదు పట్టుబడినట్లు తెలిసింది. సెర్చ్‌ ఆపరేషన్‌ అనంతరం ఐటీ నోటీసులు జారీ చేసి, ఆదాయం, ఐటీ చెల్లింపులు, పన్ను ఎగవేత సమాచారంతో విచారించనుంది.

సివిల్‌ పోలీసులకు ప్రమోషన్‌ కష్టాలు

రాష్ట్రవ్యాప్తంగా 869 మంది హెడ్‌ కానిస్టేబుళ్లుగా ఎంపిక



ఒంగోలు పోలీస్‌ ట్రైనింగ్‌ కళాశాల

- రెండుసార్లు ట్రైనింగ్‌కు పిలిచి వెనక్కి పంపిన ఉన్నతాధికారులు
- ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టిన కానిస్టేబుళ్లు
- ఏఆర్, ఏపీఎస్పీ, సివిల్‌ కానిస్టేబుళ్ల మధ్య సర్వీసుల వివాదం
- తరచూ కోర్టును ఆశ్రయిస్తున్న ఏఆర్, ఏపీఎస్పీ సిబ్బంది
- మార్కుల ఆధారంగా ఉద్యోగం పొందిన తమకు న్యాయం చేయాలంటున్న సివిల్‌ కానిస్టేబుళ్లు

కంభం: కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు హెడ్‌ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు వచ్చాయని సంతోషపడేలోపే వారి ఆనందం ఆవిరైపోతోంది. ఇలా జరగడం ఇది మొదటిసారేమీ కాదు. ఎందుకంటే.. గత ఆగస్టులో ట్రైనింగ్‌కు పిలిచి మూణ్రోజుల ముందు ట్రైనింగ్‌ రద్దయిందని చెప్పడంతో అప్పట్లో వారంతా తీవ్ర నిరాశ చెందారు. అలాగే, ఈనెల 6న పీటీసీలలో ట్రైనింగ్‌కు వెళ్లిన వారికి అదేరోజు రాత్రి మీ ట్రైనింగ్‌ వాయిదా పడిందని పంపేయడంతో ఉసూరుమంటూ తిరిగొచ్చారు. ఏపీఎస్పీ, ఏఆర్‌ నుంచి సివిల్‌లోకి మారిన వారు.. తొలి నుంచి సివిల్‌లో ఉన్న వారు సర్వీసుల్లో వ్యత్యాసాలతో కోర్టును ఆశ్రయిస్తుండటంతో రెండుసార్లు ట్రైనింగ్‌ రద్దయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతులు పొందిన 869 మంది కానిస్టేబుళ్లు తీవ్ర నిరాశ చెందుతున్నారు. సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారుల జాప్యం కారణంగా మూడు శాఖల ఉద్యోగులు కోర్టులకు వెళ్తుండడంతో వారి మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని తొలి నుంచి సివిల్‌ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు కోరుతున్నారు.

అడ్డదారుల్లో సివిల్‌ కానిస్టేబుళ్లుగా..

ఇదిలా ఉంటే.. పోలీస్‌ సెలక్షన్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉద్యోగాల ఎంపిక జరుగుతుంది. ఎక్కువ మార్కులు వచ్చిన వారు సివిల్‌ కానిస్టేబుళ్లుగా, ఆ తర్వాత ఏఆర్‌ కానిస్టేబుళ్లుగా, ఆ తర్వాత ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపిక చేస్తారు. గతంలో నక్సల్స్‌పై దాడులు, తీవ్రవాదులతో పోరాటాల్లో పాల్గొన్న ఏఆర్, ఏపీఎస్పీ సిబ్బందిని సివిల్‌ కానిస్టేబుళ్లుగా మార్చేవారు. ఆ తర్వాత వారు తమకు వచ్చే పదోన్నతులను వదులుకుని ఏపీఎస్పీ నుంచి ఏఆర్‌లోకి, అక్కడి నుంచి సివిల్‌లోకి వస్తున్నారు. వారు వచ్చే సమయంలో తమకు పదోన్నతులు వద్దని చెప్పి వస్తున్నారని, సివిల్‌లోకి వచ్చిన తర్వాత ముందు నుంచి తమ సర్వీసును కలిపి సివిల్‌ వాళ్లతో సమానంగా తమకు హెడ్‌ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తుండడంతో ముందు నుంచి సివిల్‌లో ఉన్న తమకు అన్యాయం జరుగుతోందని సివిల్‌ కానిస్టేబుళ్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు కానిస్టేబుళ్లు తమ సర్వీసు మొత్తం కానిస్టేబుళ్లుగానే చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భాలున్నాయి. ఏ ఉద్యోగస్తులైనా వారి మాతృ సంస్థలో నిబంధనల ప్రకారం ఉద్యోగోన్నతులు పొందడానికి అర్హులని అంటున్నారు.

రాష్ట్రంలో 869 హెడ్‌ కానిస్టేబుళ్ల ఎంపిక

ఇక రాష్ట్రవ్యాప్తంగా 869 మంది కానిస్టేబుళ్లు హెడ్‌ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వారిలో అనంతపురం పీటీసీకి 240, విజయనగరం పీటీసీకి 289, ఒంగోలు పీటీసీకి 340 మందిని కేటాయించారు. వీరందరూ ఈనెల 6న మెడికల్‌ పరీక్షలు పూర్తిచేసుకుని వారికి కేటాయించిన పీటీసీలలో జాయినయ్యారు. వారికి అక్కడ రూమ్‌లు సైతం కేటాయించి, స్క్వాడ్‌లను డివైడ్‌ చేశారు. మెస్‌ ఫీజులు కూడా చెల్లించి ఒకపూట భోజనం చేసిన తర్వాత వారి ట్రైనింగ్‌ రద్దయిందని, మళ్లీ తేదీలు ప్రకటిస్తామని చెప్పడంతో వారంతా ఉసూరుమన్నారు. ఈసారి మళ్లీ ఎప్పుడు పిలుస్తారో, అప్పుడైనా ట్రైనింగ్‌ జరుగుతుందో లేదోనని వారు ఆవేదన చెందుతున్నారు. ఇతర శాఖల ఉద్యోగుల మాదిరి ధర్నాలు, పోరాటాలు చేసే పరిస్థితి వారికి లేకపోవడంతో వారు లోలోన మథనపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు న్యాయం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సివిల్‌ కానిస్టేబుళ్లు కోరుతున్నారు.

పీటీసీల వారీగా కేటాయించిన కానిస్టేబుళ్ల వివరాలు

ఒంగోలు పీటీసీ	340
కృష్ణ	52
విజయవాడ సిటీ	41
గుంటూరు అర్బన్‌	26
గుంటూరు రూరల్‌	70
ప్రకాశం	50
నెల్లూరు	101
అనంతపురం పీటీసీ	240
కర్నూలు	07
కడప	31
అనంతపురం	112
చిత్తూరు	61
తిరుపతి అర్బన్‌	29
విజయనగరం పీటీసీ	289
శ్రీకాకుళం	35
విజయనగరం	06
విశాఖపట్నం	11
విశాఖపట్నం రూరల్‌	50
తూర్పు గోదావరి	137
పశ్చిమ గోదావరి	50

గాయాన్ని గంటల్లో మాన్పే మాయా చర్మం

అది చర్మం కాని చర్మం. అయితే అలాంటిలాంటి చర్మం కాదు. గాయాలను శరవేగంగా నయం చేసే చర్మం! ఎంతటి గాయాన్నయినా నాలుగే గంటల్లో 90 శాతం దాకా మాన్పుతుంది. 24 గంటల్లో పూర్తిగా నయం చేసేస్తుంది. వినడానికి ఏదో సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమా కథలా అన్పిస్తున్నా అక్షరాలా నిజమిది. ఈ మాయా చర్మం అందుబాటులోకి వస్తే వైద్యచికిత్స కొత్తపుంతలు తొక్కడం ఖాయమని చెబుతున్నారు. అచ్చం చర్మాన్ని తలపించే కొత్త రకం హైడ్రోజెల్‌ను రూపొందించడంలో సైంటిస్టులు విజయవంతమయ్యారు. చర్మానికి ఉండే స్వీయచికిత్స సామర్థ్యాన్ని ఇది ఎన్నో రెట్లు పెంచుతుందట. ఫిన్లండ్‌లోని ఆల్టో యూనివర్సిటీ, జర్మనీలోని బైరైట్ వర్సిటీలకు చెందిన పరిశోధకులు దీన్ని రూపొందించారు. నిజానికి ఇటువంటి విప్లవాత్మక ఆవిష్కరణ కోసం ప్రపంచవ్యాప్తంగా చాలా ఏళ్లుగా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతూనే వస్తున్నాయి. కానీ అవేవీ ఇప్పటిదాకా అంతగా విజయవంతం కాలేదు. చర్మం తాలూకు విలక్షణతే అందుకు కారణం. సాగే లక్షణం, దీర్ఘకాలిక మన్నిక, తీవ్ర ప్రతికూల పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యం వంటి ఎన్నో ప్రత్యేకతలు చర్మం సొంతం. వీటన్నింటినీ మించి గాయాలను తనకు తాను నయం చేసుకునే సాటిలేని సామర్థ్యం చర్మానికి ఉంది. ఇన్ని లక్షణాలతో కూడిన కృత్రిమ చర్మం రూపకల్పన ఇన్నేళ్లుగా సైంటిస్టులకు సవాలుగానే నిలిచింది. తాజాగా రూపొందించిన హైడ్రోజెల్ మాత్రం పూర్తిగా చర్మం లక్షణాలను కలిగి ఉంటుంది. కాలిన, తెగిన గాయాలపై ఈ జెల్‌ను అమరిస్తే వాటిని చిటికెలో నయం చేస్తుంది. తర్వాత దాన్ని తొలగించవచ్చు. లేదంటే క్రమంగా అదే కరిగిపోతుంది.

ఇలా సాధించారు...

అతి పలుచనైన నానోషీట్‌తో రూపొందించిన పాలిమర్ సాయంతో కృత్రిమ చర్మం రూపకల్పన సాధ్యపడింది. మోనోమర్ పౌడిని నీటితో కూడిన నానోషీట్లతో చాకచక్యంగా కలపడం ద్వారా అధ్యయన బృందంలోని శాస్త్రవేత్త చెన్ లియాంగ్ దీన్ని సాధించారు. తర్వాత ఈ మిశ్రమాన్ని యూవీ రేడియేషన్‌కు గురిచేయడంతో అందులోని అణువుల మధ్య ఆశించిన స్థాయిలో బంధం సాధ్యపడింది. ఫలితంగా చక్కని సాగే గుణమున్న చర్మంలాంటి హైడ్రోజెల్ రూపొందించింది. ''అత్యంత హెచ్చు సామర్థ్యంతో కూడిన వ్యవస్థీకృత నిర్మాణం దీని సొంతం. హైడ్రోజెల్‌కు ఇది గట్టిదనం ఇవ్వడమే గాక గాయాల వంటివాటిని తనంత తానుగా నయం చేసుకోగల సామర్థ్యాన్ని కూడా కట్టబెట్టింది'' అని అధ్యయన బృందం పేర్కొంది. ''జీవకణాలు చూసేందుకు గట్టిగా ఉన్నా స్వీయచికిత్స సామర్థ్యంతో కూడి ఉంటాయి. సింథటిక్ హైడ్రోజెల్‌లో ఈ లక్షణాలను చొప్పించడం ఇప్పటిదాకా సవాలుగానే నిలిచింది. దాన్నిప్పుడు అధిగమించాం'' అని వివరించింది. కృత్రిమ చర్మ పరిజ్ఞానంలో ఇది మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. ''కాలిన, దీర్ఘకాలిక గాయాలను సత్వరం నయం చేయడం ఇకపై మరింత సులువు కానుంది. అంతేగాక వైద్య చికిత్సలోనే గాక ప్రోస్తటిక్స్, సాఫ్ట్ రోబోటిక్స్ తదితర రంగాల్లో కూడా ఇది ఉపయుక్తం కానుంది'' అని వివరించింది. మిల్లీమీటర్ మందంలోని జెల్‌లో దాదాపు 10 వేల నానోషీట్లుంటాయి. ఫలితంగా దానికి గట్టిదనంతో పాటు సాగే గుణం కూడా ఉంటుంది. ఈ మిరాకిల్ జెల్ ప్రస్తుతానికి ప్రయోగ దశలోనే ఉంది. వైద్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మరో ఐదేళ్లకు పైగా పట్టవచ్చు. అధ్యయన వివరాలు ప్రతిష్టాత్మక జర్నల్ నేచర్ మెటీరియల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

ఏమిటీ హైడ్రోజెల్

సింపుల్‌గా చెప్పాలంటే ఇది జెల్ వంటి మృదువుగా ఉండే పదార్థం. దీన్ని పాలిమర్ తదితర మెటీరియల్స్‌తో తయారు చేస్తారు. వెంట్రుకల చికిత్స మొదలుకుని ఆహారోత్పత్తుల దాకా దాదాపు అన్నింటిలోనూ వీటిని విస్తృతంగా వాడుతున్నారు.



– సాక్షి, నేషనల్ డెస్క్

గ్లోబల్ సౌత్‌కు 'మహాసాగర్'

మారిషస్ ప్రధాని రామ్‌గులాంతో మోదీ చర్చలు

- 'విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యం'గా ద్వైపాక్షిక బంధం
- ఇరు దేశాల మధ్య కుదిరిన 8 కీలక ఒప్పందాలు
- మోదీకి మారిషస్ అత్యున్నత జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకున్నాక ఆ దేశ అధ్యక్షుడు ధరమ్ గోకుల్, ప్రధాని రామ్‌గులాంలతో మోదీ

పోర్ట్ లూయిస్: ద్వైపాక్షిక సంబంధాలను 'విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్య' స్థాయికి పెంపొందించుకోవాలని భారత్, మారిషస్ నిర్ణయించాయి. ఇరు దేశాల ప్రధానమంత్రుల భేటీలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. వ్యాపారం, వాణిజ్యం, సముద్రయాన రక్షణ తదితర కీలక రంగాల్లో పరస్పర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. ఇందులో భాగంగా భారత్, మారిషస్ మధ్య ఎనిమిది కీలక ఒప్పందాలు కుదిరాయి. సీమాంతర లావాదేవీల కోసం ఇరు దేశాలు ఇకపై తమ నేషనల్ కరెన్సీలు ఉపయోగించుకోవచ్చు. మారిటైమ్ డేటాను పంచుకోవచ్చు. మనీ లాండరింగ్‌ను నియంత్రించడానికి ఉమ్మడిగా కృషి చేయొచ్చు. ఎంఎస్ఎంఈ రంగంలో సహకారం పెంపొందించుకోవచ్చు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం బుధవారం సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధికి సంబంధించి 'మహాసాగర్' పేరిట నూతన దార్శనికతను ఈ సందర్భంగా మోదీ ప్రకటించారు. హిందూ మహాసముద్రంపై పట్టు కోసం డ్రాగన్ దేశం చైనా తీవ్రంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో 'మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్(మహాసాగర్) విజన్‌ను మోదీ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. స్వేచ్ఛాయుతమైన, పూర్తి భద్రతతో కూడిన హిందూ మహాసముద్రానికి ఉమ్మడిగా అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని భారత ప్రధానమంత్రి స్పష్టంచేశారు. రెండు దేశాల నడుమ వ్యూహాత్మక భాగస్వామ్యంలో రక్షణ సహకారం, మారిటైమ్ సెక్యూరిటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తాము నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు రామ్‌గులాంతో భేటీ అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలికి రక్షణ సహకారం అందిస్తామన్నారు.

భారత్ నుంచి బహుమతి

ప్రధాని మోదీ 2015లో మారిషస్‌లో పర్యటించినప్పుడు సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్) పాలసీని ప్రకటించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఇండియా ప్రాముఖ్యతను పెంచడానికి ఈ విధానం తీసుకొచ్చారు. 'సాగర్'ను మరింత ముందుకు తీసుకెళ్తూ 'మహాసాగర్'ను ఆవిష్కరించినట్లు మోదీ ఉద్ఘాటించారు. గ్లోబల్ సౌత్‌లో శాంతి, సౌభాగ్యం, సుస్థిరతను కోరుకుంటున్నట్లు వెల్లడించారు. మారిషస్‌లో నూతన పార్లమెంట్ భవన నిర్మాణానికి సహకరిస్తామని ప్రకటించారు. ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి లాంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక బహుమతి అవుతుందన్నారు. ఇండియాలో చార్‌ధామ్ యాత్ర, రామాయణ్ యాత్రలో పాల్గొనే మారిషస్ ప్రజలకు తగిన వసతులు కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారు.

మారిషస్ జాతీయ దినోత్సవంలో మోదీ

రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం మారిషస్ 57వ జాతీయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారిషస్ అత్యున్నత జాతీయ పురస్కారం 'ద గ్రాండ్ కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషియన్'ను మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు స్వీకరించిన మొట్టమొదటి భారత ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించారు. ఈ పురస్కారం తనకు లభించడం భారత్–మారిషస్ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక, చారిత్రక సంబంధాలకు ప్రతీక అని మోదీ అభివర్ణించారు. శతాబ్దాల క్రితం భారత్ నుంచి మారిషస్‌కు చేరుకున్న భారతీయులకు, వారి వారసులకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. మారిషస్ నేషనల్ డే పరేడ్‌లో భారత నావికాదళం సైతం పాలుపంచుకుంది. ఈ వేడుకలకు హాజరు కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మరోవైపు మోదీ, నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ 'అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీసు, ఇన్నోవేషన్'ను సంయుక్తంగా ప్రారంభించారు.

స్కూళ్లల్లో ఎయిర్ ప్యూరిఫయర్లు

సౌమ్య స్వామినాథన్ సిఫార్సు

న్యూఢిల్లీ: ఢిల్లీ వంటి నగరాల్లో వాయు కాలుష్యం నుంచి పిల్లలను రక్షించేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎయిర్ ప్యూరిఫయర్లను ఏర్పాటు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్, శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ సూచించారు. ప్రస్తుతం ఆరోగ్యశాఖ సలహాదారుగా ఉన్న ఆమె.. వాయు కాలుష్యంపై భారత్ తగినంత డేటాను సేకరించిందని, చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 'పెద్దలకంటే పిల్లలు వేగంగా శ్వాస తీసుకుంటారు. అలాగే వారు చిన్నగా ఉండటం వల్ల నేలకు దగ్గరగా ఉండటంతో గాలిలోని దుమ్ము, ధూళి, కాలుష్యం వారిని తొందరగా చేరుతుంది. తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇంటి తరువాత పిల్లలు ఎక్కువసేపు గడిపేది పాఠశాలల్లోనే. కాబట్టి కచ్చితంగా ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాల్లో ప్యూరిఫయర్లను ఏర్పాటు చేసి గాలి నాణ్యతను మెరుగుపరచాలి' అని ఆమె సూచించారు. అయితే బయోమాస్ స్థానంలో ఎల్పీజీని తీసుకొచ్చి, ఇప్పటికే ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలు కొంత మేర ప్రయోజనం చేకూరుస్తున్నాయని స్వామినాథన్ తెలిపారు. నగరాల్లో ప్రజారవాణాను విస్తరించాలని, మితిమీరిన కార్ల వినియోగంపై జరిమానాలు విధించాలని, పారిశ్రామిక కాలుష్య చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆమె పేర్కొన్నారు. చట్టాలు, నిబంధనలు తీసుకొస్తే సరిపోదని, వాటిని కఠినంగా అమలు చేయాలన్నారు.



డబ్ల్యూహెచ్‌ఓ పరిమితుల కంటే అధికం..

ఢిల్లీలో గాలి నాణ్యత తరచూ దెబ్బతింటోంది. శీతాకాలంలో ఇది మరింత ప్రమాదకర స్థాయిలను చేరుతుంది. గాలి కాలుష్యం పిల్లల్లో అభ్యాస నైపుణ్యాన్ని ప్రభావితం చేస్తోంది, తద్వారా విద్యా వ్యవస్థకు నష్టం వాటిల్లుతోంది. దీనిపై సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఇక స్విస్‌ఎయిర్ టెక్నాలజీ సంస్థ ఐక్యూఎయిర్ మంగళవారం ప్రకటించిన నివేదిక ప్రకారం.. ప్రపంచంలోని 10 అత్యంత కాలుష్య నగరాల్లో ఆరు భారత్‌లోనే ఉన్నాయి. ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరమని, భారత్‌ఐదో అత్యంత కాలుష్య దేశమని వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ -2024 తెలిపింది. 2023తో పోలిస్తే ఢిల్లీలో వాయుకాలుష్యం 2024లో బాగా పెరిగింది. ఒక్క ఢిల్లీనే కాదు.. భారత్‌లోని 35 శాతం నగరాల్లో కాలుష్యం డబ్ల్యూహెచ్‌ఓ పరిమితుల కంటే 10 రెట్లు ఎక్కువగా ఉంది.

ఉక్రెయిన్‌కు మళ్లీ అమెరికా ఆయుధాలు

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడులు.. ఐదుగురి మృతి

కీవ్: ఉక్రెయిన్‌కు సైనిక సాయంపై సస్పెన్షన్‌ను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఎత్తివేయడంతో ఆయుధాల సరఫరా బుధవారం నుంచి మళ్లీ ప్రారంభమైంది. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. పోలాండ్ లాజిస్టిక్ సెంటర్ నుంచి ఈ ఆయుధాలు వచ్చినట్లు వెల్లడించాయి. మరోవైపు రష్యాతో 30 రోజులపాటు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధికారులు సంకేతాలిచ్చారు. కాల్పుల విరమణపై అమెరికా నుంచి సమాచారం కోసం ఎదురు చూస్తున్నామని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు. ఒకవైపు శాంతి కోసం ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడిలో ఐదుగురు మరణించినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు.

కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరించాలి: ట్రంప్

న్యూయార్క్: ఉక్రెయిన్‌తో 30 రోజుల కాల్పుల విరమణకు రష్యా అంగీకరిస్తుందని తాను ఆశిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం చెప్పారు. ఉక్రెయిన్ ముందుకొచ్చింది కాబట్టి ఇక రష్యా అధినేత పుతిన్ చొరవ తీసు కోవాలని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్రంప్ ఒక వీడియో పోస్టు చేశారు. కాల్పులు ఆగకపోతే జనం మరణిస్తూనే ఉంటారని, ఇది తెలివైన పని కాదని చెప్పారు. కాల్పుల విరమణకు రష్యా అంగీకరిస్తే అది చాలా గొప్ప విషయం అవుతుందన్నారు. మరోవైపు ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ సైతం స్పందించారు. 30 రోజుల కాల్పుల విరమణ అనేది సానుకూలమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ ప్రతిపాదనను అంగీకరించేలా రష్యాను ఒప్పించాల్సిన బాధ్యత అమెరికాపై ఉందన్నారు.

నెలాఖరులో భారత్‌కు జేడీ వాన్స్

న్యూయార్క్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌కు రానున్నారు. సెకండ్‌లేడీ ఉషా వాన్స్‌తో కలిసి ఆయన ఈ నెలాఖరులో మనదేశంలో పర్యటించనున్నారు. గత నెలలో ఫ్రాన్స్, జర్మనీల్లో ప్రపంచ వేదికలపై మాట్లాడిన వాన్స్‌కు ఇది రెండో విదేశీ పర్యటన. జేడీ వాన్స్ భార్య చిలుకూరి ఉషా వాన్స్ తల్లిదండ్రులు తెలుగువారు. ఉష తల్లిదండ్రులు లక్ష్మీ చిలుకూరి, క్రిష్ చిలుకూరి 1970 దశకంలో అమెరికాకు వలస వెళ్లారు. అక్కడే జన్మించిన ఉషా వాన్స్.. యేల్ లా స్కూల్లో చదువుకున్నారు. అక్కడే జేడీ వాన్స్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. రెండో మహిళగా వాన్స్ తన తల్లిదండ్రుల స్వదేశానికి రావడం ఇదే మొదటిసారి.

రైలు హైజాక్‌కు తెర: పాక్

- మిలిటెంట్లందరినీ హతమార్చాం
- ప్రయాణికులను విడిపించాం: సైన్యం
- 21 మంది చనిపోయినట్టు వెల్లడి

కరాచీ/ఇస్లామాబాద్/క్వెట్టా: సంచలనం సృష్టించిన రైలు హైజాక్ ఉదంతానికి తెర దించినట్టు పాకిస్తాన్ బుధవారం ప్రకటించింది. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) చెరబట్టడం, పలువురు ప్రయాణికులను కాల్చి చంపి 215 మందిని బందీలను చేసుకోవడం తెలిసిందే. జైళ్లలో ఉన్న తమ నేతలను 48 గంటల్లోగా వదిలేయకపోతే బందీలందరినీ చంపేస్తామని అల్టిమేటం కూడా జారీ చేసింది. ప్రయాణికులందరినీ సైనిక ఆపరేషన్ ద్వారా బుధవారం సాయంత్రానికల్లా బీఎల్ఏ చెర నుంచి విడిపించినట్టు ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ ప్రకటించారు. ''ఘటనా స్థలిలో ఉన్న 33 మంది మిలిటెంట్లను ఆర్మీ స్నైపర్లు హతమార్చారు. ఆ క్రమంలో నలుగురు సైనికులను కోల్పోయాం. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మిలిటెంట్లు రైలును హైజాక్ చేశారు. ఆ క్రమంలో 21 మంది ప్రయాణికులను పొట్టన పెట్టుకున్నారు'' అని చెప్పారు. ట్రైన్‌తో పాటు ఘటనా స్థలిని బాంబ్ డిస్పోజల్ బృందాలు జాగ్రత్తగా జల్లెడ పడుతున్నాయన్నారు. దాడికి కారకులను, వారిని పెంచి పోషిస్తున్న వారిని వెంటాడి వేటాడతామని ప్రకటించారు.

భిన్న వాదనలు

ఆపరేషన్ విజయవంతమైందన్న ప్రకటనపై భిన్న వాదనలు విన్పిస్తున్నాయి. వేర్పాటువాదులు ఆత్మాహుతి బాంబులుగా ఇప్పటికీ ప్రయాణికుల మధ్య నక్కారని చెబుతున్నారు. మహిళలు, చిన్నారులను మానవ కవచాలుగా వాడుకున్నట్టు మీడియా పేర్కొంది. 50 మంది వేర్పాటువాదులను హతమార్చి 190 మంది ప్రయాణికులను కాపాడినట్టు పాక్ సర్కారు కూడా బుధవారం సాయంత్రం పేర్కొంది. ఇందుకు ప్రతీకారంగా 50 మందికి పైగా బందీలను చంపేసినట్టు బీఎల్ఏ ప్రకటించింది. ''ఇప్పటిదాకా 100 మందికి పైగా బందీలను కాల్చేశాం. ఇంకో 150 మంది బందీలుగానే ఉన్నారు. డెడ్‌లైన్లో కొన్ని గంటల్లో ముగియనుంది. ఆలోపు మా నేతలందరినీ వదిలేయకుంటే గంటకు కొందరు చొప్పున బందీలను చంపేస్తాం'' అని ఒక ప్రకటనలో హెచ్చరించింది.




రైలు నుంచి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తెస్తున్న ఆర్మీ జవాను

ప్రత్యక్ష నరకమే | మా కళ్లముందే కాల్చేశారు | ప్రత్యక్ష సాక్షుల భయానక అనుభవాలు

హైజాక్ నుంచి క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు తాము అనుభవించిన నరకాన్ని తలచుకుంటూ ఇప్పటికీ వణికిపోతున్నారు. వేర్పాటువాదుల చెరనుంచి బయటపడ్డాక వారంతా రాత్రిపూట వణికించే చలిలో 4 గంటల పాటు నడిచి సమీపంలోని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వృద్ధులు, పిల్లలు, రోగులను మిగతావారు భుజాలపై మోసుకెళ్లారు. సెలవుపై ఇళ్లకు వెళ్తున్న సైనికులను తమ కళ్లముందే కాల్చి పొట్టన పెట్టుకున్నారని హమీద్ అనే ప్రయాణికుడు బీబీసీకి వెల్లడించాడు. ''బోగీల్లోకి చొరబడటంతోనే ప్రయాణికుల గుర్తింపు కార్డులను చెక్ చేశారు. పిల్లలు, మహిళలు, పౌరులను వేరు చేశారు. సైనికులందరినీ మరోవైపు తరలించారు. ఆ క్రమంలో ముగ్గురు సైనికులను మేం చూస్తుండగానే కాల్చేసి బిగ్గరగా నినాదాలు చేశారు. నేను హృద్రోగినని వేడుకోవడంతో వదిలేశారు'' అని చెప్పాడు. ''భారీ బాంబు పేలుళ్లు, కాల్పుల మోతలను జీవితంలో మర్చిపోలేను. ఏం జరుగుతుందోనని 50 నిమిషాలకు పైగా ఊపిరి బిగబట్టుకుని గడిపాం'' ఇషాక్ నూర్ చెప్పుకొచ్చాడు.

విద్యా విధానం కాదు.. బీజేపీ విధానం

మరోసారి కేంద్రంపై విరుచుకుపడిన ఎంకే స్టాలిన్



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) జాతీయ విద్యా విధానం కాదని, బీజేపీ పార్టీ కాషాయ విధానమని ఆరోపించారు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి కాకుండా.. హిందీని అభివృద్ధి చేయడానికి రూపొందించిందన్నారు. నూతన విద్యావిధానాన్ని అమలు చేయడమంటే దేశంలో విద్యను కాషాయీకరించడమేనన్నారు. ఎన్ఈపీ తమ రాష్ట్ర విద్యావిధానాన్ని సమూలంగా నాశనం చేస్తుందని చెప్పారు. ఎన్ఈపీ రిజర్వేషన్లకు అంగీకరించదని, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల ప్రజలు అభివృద్ధిని ఎన్ఈపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. వృత్తి విద్య పేరుతో ఆరో తరగతి నుంచే కుల ఆధారిత వృత్తులను అమలు చేస్తారని ఆరోపించారు. అలాంటి విధానాన్ని తమ రాష్ట్రంపై రుద్దేందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రయత్ని స్తున్నారని, కేంద్రం రూ.10వేల కోట్లు ఇచ్చినా అంగీకరించబోమని స్పష్టం చేశారు. హిందీపై దృష్టి పెట్టడం కంటే.. దేశాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తే మంచిదని హితవు పలికారు. విద్యావిధానానికి ముడిపెట్టి.. రాష్ట్రంలోని పాఠశాలలకు రావాల్సిన నిధులను నిలిపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వేల కోట్లు పెట్టినా సంస్కృతాన్ని అభివృద్ధి చేయలేం. ప్రజలు మాట్లాడని భాషను అభివృద్ధి చేయడానికి కోట్లు ఖర్చు చేస్తున్నారు. అత్యధిక ప్రజలు మాట్లాడుతున్న, అనేక దేశాల్లో గుర్తింపు పొందిన తమిళ భాషకు ద్రోహం చేయాలని చూస్తున్నారు. దీన్ని సహించబోం' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఏనాడైనా రాష్ట్రంలో సమస్యలపై చర్చించని కేంద్ర ప్రభుత్వం.. రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

అనుమానాస్పద మరణవాంగ్మూలంతో... నేర నిర్ధారణ తగదు: సుప్రీం

న్యూఢిల్లీ: అనుమానాస్పద మరణవాంగ్మూలం ఆధారంగా నేర నిర్ధారణ సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇతరత్రా గట్టి సాక్ష్యాధారాలు లేనప్పుడు కేవలం అలాంటి వాంగ్మూలాన్ని ఆధారంగా తీసుకోజాలమని స్పష్టం చేసింది. భార్యకు నిప్పంటించి హత్య చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తిని నిరపరాధిగా తేలుస్తూ న్యాయమూర్తులు సుధాన్షు ధూలియా, ఎ.అమానతుల్లా ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. అతనికి దిగువ కోర్టు విధించిన జీవితఖైదును సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ''మరణ వాంగ్మూలం కీలక సాక్ష్యమన్నది నిస్సందేహం. దాని ఆధారంగా నేర నిర్ధారణ చేయడమూ సబబే. కానీ ఆ వాంగ్మూలమే అనుమానాస్పదమైన సందర్భాల్లో దాని ఆధారంగా నిందితున్ని దోషిగా నిర్ధారించడం సరికాదు. ప్రస్తుత కేసులో భార్య పరస్పరం పూర్తి విరుద్ధమైన వాంగ్మూలాలిచ్చింది. పైగా వరకట్న వేధింపులు జరగలేదని దర్యాప్తులో స్పష్టంగా తేలింది. ఇలాంటి సందర్భాల్లో కోర్టులు జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతర సాక్ష్యాలనూ పరిగణనలోకి తీసుకున్నాకే నిర్ణయానికి రావాలి'' అని సూచించింది.

ఎయిమ్స్ నుంచి ధన్‌ఖడ్ డిశ్చార్జి

న్యూఢిల్లీ: అనారోగ్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ బుధవారం డిశ్చార్జి అయ్యారు. గుండె సంబంధిత సమస్యతో ఈనెల 9న ఆయన ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే. 'వైద్య బృందం నుంచి అవసరమైన చికిత్సను అందుకున్న ధన్‌ఖడ్ సంతృప్తకరమైన స్థాయిలో కోలుకున్నారు. డిశ్చార్జి అయ్యారు' అని ఎయిమ్స్ తెలిపింది. కొద్ది రోజులు సంపూర్ణ విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.

అమెరికా ఉత్పత్తులపై ఈయూ ప్రతీకార సుంకాలు

కొత్త టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటన



బ్రస్సెల్స్: అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య టారిఫ్‌ల యుద్ధం జరుగుతోంది. ఈయూకు సంబంధించిన స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పెంచిన 25 శాతం టారిఫ్‌లు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. అందుకు ప్రతీకారంగా ఈయూ సైతం గంటల వ్యవధిలోనే అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు ప్రకటించింది. అమెరికా నుంచి వచ్చే పారిశ్రామిక, పాడి ఉత్పత్తులపై కొత్త సుంకాలు వసూలు చేయనున్నట్లు బుధవారం ఈయూ తేల్చిచెప్పింది. 28 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై సుంకాలు అతిత్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెంచడంలో భాగంగానే ఈయూ సైతం టారిఫ్‌లు విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ట్రంప్ వెనక్కి తగ్గితే ఈయూ దేశాలు సైతం వెనక్కి తగ్గే అవకాశం ఉంది. టారిఫ్‌ల విషయంలో అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెవెన్ చెప్పారు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఆర్థికవ్యవస్థలపై టారిఫ్‌ల పేరిట పెనుభారం మోపడం తమకు ఇష్టం లేదన్నారు. అయితే, అమెరికా చర్యలకు ప్రతిచర్యగా తాము సైతం టారిఫ్‌లు విధించాలని నిర్ణయించినట్లు తేల్చిచెప్పారు.

హరియాణా కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ హవా

పదింట తొమ్మిది కైవసం

చండీగఢ్: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించిన ఆరు నెలల లోపే.. బీజేపీ మళ్లీ సత్తా చాటింది. కార్పొరేషన్ ఎన్నికల్లో 10 నగరాలకు గాను తొమ్మిదింటిలో బీజేపీ గెలుపొందింది. ఈ పది స్థానాల్లో ఏడు బీజేపీ సిట్టింగ్ స్థానాలు కావడం గమనార్హం. విపక్ష కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేకపోయింది. సిట్టింగ్ స్థానమైన సోనిపట్‌ను కోల్పోయింది. అలాగే మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా ఇలాఖాలోని రోహతక్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ ఓటమి చవిచూసింది. పది కార్పొరేషన్‌లలో ఏడుగురు మహిళలు మేయర్లుగా గెలిచారు. ఇందులో ఆరుగురు బీజేపీకి చెందిన వారు. మానేసర్ నుంచి స్వతంత్ర అభ్యర్థి ఇందర్‌జిత్ యాదవ్ మేయర్‌గా గెలుపొందారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలు ఉంచిన అచంచల విశ్వాసానికి ఈ గెలుపు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. అంకితభావం కలిగిన బీజేపీ కార్యకర్తల కృషి ఫలితమే కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ ఘన విజయమని మోదీ అభివర్ణించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు ప్రజలు ఆమోదముద్ర వేశారని ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీ అన్నారు. ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వంతో హరియాణా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని హామీ ఇచ్చారు.

అస్త్రా మిస్సైల్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్ అస్త్రాను భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. గగనతలంలో కదులుతున్న లక్ష్యాన్ని తేజస్ యుద్ధ విమానం నుంచి అస్త్రా క్షిపణి నేరుగా ఛేదించింది. ఈ మిస్సైల్ పరీక్షలో అన్ని వ్యవస్థలు నిర్దేశిత పరామితులను అందుకున్నాయని రక్షణ శాఖ బుధవారం తెలిపింది. ఈ అస్త్రా క్షిపణిని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసింది. 100 కిలోమీటర్లకు పైగా దూరంలోని లక్ష్యాలను అస్త్రా ఛేదించగలదు. కచ్చితంగా లక్ష్యాన్ని ఛేదించేందుకు ఇందులో అధునాతన నావిగేషన్ సిస్టమ్ ఉంది.

ఆదుకోండి ప్లీజ్

జీతం పెంచాలి, పెన్షన్ ఇవ్వాలి అని బుధవారం బెంగళూరు స్వతంత్ర పార్కులో ప్రభుత్వ దినసరి ఉద్యోగుల ధర్నా



కష్టాల సుడిలో ఆర్టీసీ బస్సు

- రూ.5,200 కోట్ల నష్టాల్లో ఆర్టీసీ, బీఎంటీసీ
- నారీ శక్తి వల్ల 40 శాతం బస్సులు నష్టాల ప్రయాణం
- అసెంబ్లీలో రవాణా మంత్రి వెల్లడి





ఆర్టీసీ ఇబ్బందుల్లో ఉంటే.. చార్జీలు పెరుగుతాయని ప్రజలకు గుబులు



నారీశక్తి పథకం ద్వారా మహిళలు ఉచిత ప్రయాణం

బనశంకరి/ శివాజీనగర: ఇంధన ధరలు పెరగడం, సిబ్బంది జీతభత్యాలు, బస్సుల నిర్వహణ తదితర కారణాలతో గత ఐదేళ్లలో కేఎస్ ఆర్టీసీ నష్టాల్లో నడుస్తోంది. నాలుగు రవాణా మండళ్లు రూ.5,200 కోట్ల నష్టాల్లో ఉన్నాయని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీలో విధానపరిషత్‌లో బీజేపీ సభ్యుడు కేశవ ప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గత ఐదేళ్లలో కేఎస్ ఆర్టీసీకి రూ.1500 కోట్లు, బీఎంటీసీ రూ.1544 కోట్లు, కేకే ఆర్టీసీకి రూ.777 కోట్లు, ఎన్ డబ్ల్యూకె ఆర్టీసీకి కి రూ.1386 కోట్ల నష్టాలు వచ్చాయని తెలిపారు. ఇక నారీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల 40 శాతం బస్సులు నష్టాల్లో నడుస్తున్నాయని చెప్పారు. 30 శాతం బస్సులు ఎలాంటి లాభనష్టాలు లేకుండా, 30 శాతం బస్సులు మాత్రమే లాభాల్లో ఉన్నాయని చెప్పారు. రవాణాశాఖలో ప్రతిరోజు రూ.9.45 కోట్ల ఖర్చు ఉందన్నారు. నష్టాలను భరించడం, రవాణా మండళ్ల ఆర్థిక పునరుద్ధరణకు వివిధ పథకాలను రూపొందించామని తెలిపారు. ఇంధన ధరలు పెంపు, వేతనాలు, వాహన విడిభాగాల ధరలపెంపు వల్ల ఆర్థిక భారం ఏర్పడి గత జనవరిలో బస్‌టికెట్ల చార్జీలను 15 శాతం పెంచామని తెలిపారు. నారీ శక్తి పథకానికి 2024–25లో ప్రభుత్వం కేటాయించిన రూ.9,978 కోట్ల నిధుల్లో ఇంకా రూ.2 వేల కోట్లు ఆర్టీసీకి విడుదల కావాల్సి ఉందన్నారు. నారీ శక్తి పథకం నిధులతో 448 బీఎంటీసీ బస్సులను కొనుగోలు చేశామని చెప్పారు. గతంలో బస్సులు ఒక్కరోజులో 1.40 లక్షల కిలోమీటర్లు ట్రిప్పులు సంచరించేవి. ప్రస్తుతం 1.90 లక్షల కి.మీ. లకు పెరిగిందని తెలిపారు.

గ్యారెంటీ కమిటీలపై మళ్లీ రగడ

గ్యారెంటీ పథకాల అమలు కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ అసెంబ్లీ లోపల, బయట రెండవరోజూ పోరాటం కొనసాగించాయి. బుధవారం సైతం విధానసభలో ధర్నా నిర్వహించటంతో సభా కార్యకలాపాలు సక్రమంగా సాగక మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. కమిటీలలో కాంగ్రెస్ కార్యకర్తలను నియమించి వారికి జీతం ఇస్తున్నారని, వెంటనే కమిటీలను రద్దు చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్, జేడీఎస్ పక్ష నాయకుడు సీ.బీ.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. విధానసభలో సభాపతి ముందుచేరి నినాదాలతో హోరెత్తించారు. రోజూ గందరగోళం చేయడం సరికాదు, ఇలాగైతే సభను నడపలేను, దీనికో పరిష్కార మార్గం కనిపెట్టాలని స్పీకర్ యూటీ ఖాదర్ స్పష్టం చేశారు. తాలూకా అధికారులు తహశీల్దార్‌పై నమ్మకం లేదా, ఎమ్మెల్యేల కంటే కమిటీలకు పెద్దపీట వేస్తారా? అని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. అశోక్ మాట్లాడుతూ, సమావేశాలు జరగాలనే ఆశ ఉంది. అయితే ప్రభుత్వం గ్యారెంటీ కమిటీలను రద్దు చేయాలి. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. గట్టిగా నినాదాలు చేయడంతో కోలాహలం నెలకొంది. దీంతో స్పీకర్ మధ్యాహ్నం 1.45 వరకు వాయిదా వేశారు. తరువాత సౌధ ఆవరణలో కెంగల్ హనుమంతయ్య విగ్రహం ముందు ధర్నాకు దిగారు.



అసెంబ్లీ ఆవరణలో ప్రతిపక్షాల ధర్నా

తల్లీ కొడుకు ఆత్మహత్య కేసులో మలుపు

- మృతుడు భరత్‌కు హెచ్ఐవీ ఉన్నట్లు భార్య బంధువుల ఆరోపణ





జయంతి, భరత్ (ఫైల్)

యశవంతపుర: కుటుంబ కలహాలతో బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న హాసన జిల్లా చన్నరాయపట్టణ తాలూకా కబ్బళి గ్రామానికి చెందిన తల్లీ కుమారుడు జయంతి, భరత్‌ల కేసు మలుపు తిరిగింది. కోడలితో పొసగని కారణంతో జయంతి, కొడుకుతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తుండగా అందులో వాస్తవం లేదని అంటున్నారు. భరత్‌కు హెచ్ఐవీ సోకిందని, దీంతో తల్లీ కొడుకు ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడు భరత్ భార్య గీత బంధువులు అరోపిస్తున్నారు. భరత్‌కు మూడేళ్ల నుంచి హెచ్ఐవీ ఉందని, ఈ విషయాన్ని దాచిపెట్టి పెళ్లి చేశారని, 15 రోజులు మాత్రమే భరత్ గీతతో కాపురం చేశాడని గీతా తరపువారు చెప్పారు. హెచ్ఐవీ విషయం బయటకు పొక్కకుండా గీతపై భరత్, జయంతిలు ఒత్తిడి చేసినట్లు ఆరోపిస్తున్నారు. కాగా దంపతుల మధ్య కలహాలు వచ్చినప్పుడు పెద్దలు పంచాయితీ పెట్టగా గీత మద్యం తాగుతోందని, డ్రగ్స్ తీసుకుంటోందని భరత్ ఆరోపణలు చేశారు. దీంతో గీతను కొద్ది రోజుల పాటు బంధువుల ఇంటిలో ఉంచారు. మరోసారి పంచాయితీ చేసి గీతను అత్తింటికి పంపించారు. భరత్ రోజూ వేసుకునే మాత్రలను గీత ఫొటో తీసి తన అక్కకు పంపింది. వాటిని నర్సుకు చూపించగా హెచ్ఐవీ ఔషధాలని తెలిసిందని గీత కుటుంబ సభ్యులు అంటున్నారు. దీంతో భరత్‌కు వైద్య పరీక్షలు చేయించేలా పెద్దలు పంచాయితీ చేయగా ఒక తేదీని ఖరారు చేశారు. అయితే భరత్ ఆధార్ కార్డ్ ఇవ్వలేదని చెబుతున్నారు.

ఈ నెల 9న భరత్ బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌లో కబ్బళిలోని ఇంటికి వెళ్లాడు. ఆపై తల్లితో కలిసి నెరలెకెరె గ్రామంలోని అవ్వ ఇంటికి వెళ్లి బంగారం, వెండి నగలు ఆమెకు అందజేసి ఆశీర్వాదం తీసుకొని 10వ తేదీ వేకువజామున 3:15 గంటలకు సమీపంలోని బావిలోకి దూకారు. కానీ గీత పెట్టిన మానసిక వేధింపులతోనే జయంతి, భరత్‌లు ఆత్మహత్య చేసుకున్నట్లు జయంతి బంధువులు ఆరోపిస్తున్నారు.

ఐదేళ్లూ నేనే ముఖ్యమంత్రిని

- అసెంబ్లీలో సీఎం సిద్దరామయ్య
- కుర్చీ మార్పిడి లేనట్లేనా?



మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

బనశంకరి: రెండున్నర ఏళ్లు ఒకరు సీఎంగా ఉండాలి అని సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య ఒప్పందం ఉందని, ఆ మేరకు కుర్చీ మార్పు జరగాలని రాష్ట్ర కాంగ్రెస్‌లో, సర్కారులో తరచూ డిమాండ్లు వస్తున్నాయి. వారిద్దరి మధ్య శీతల సమరం కూడా సాగుతోందనేది తెలిసిందే. తరచూ ఘాటు ప్రకటనలు కూడా చేసుకుంటున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం విధానసభలో ఐదేళ్లూ నేనే సీఎం ప్రకటించుకున్నారు. మేము మళ్లీ ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వస్తామని అన్నారు. ముఖ్యమంత్రిగా మీరే ఉంటారా అని బీజేపీ నేతలు వేసిన ప్రశ్నకు.. అవును, సీఎం గా నేనే ఉంటానని స్పష్టం చేశారు. బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ మాట్లాడుతూ సిద్దరామయ్య 5 ఏళ్లు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా. కానీ ప్రస్తుతం పవర్ షేరింగ్ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. సిద్దరామయ్య సమాధానమిస్తూ అవును, నేను రానున్న ఐదేళ్లు ఇదే పదవిలో ఉంటానని చెప్పారు. ఇక గ్యారెంటీ కమిటీలతో ఎమ్మెల్యేలకు ఇబ్బంది ఉండదని, జిల్లాల కలెక్టర్లకు సూచన చేశానని సీఎం చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉండాల్సిందే. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే దీనిపై భేటీ జరిపి పరిష్కరిస్తామని తెలిపారు.

అక్రమంగా మకాం.. బంగ్లాదేశీ అరెస్టు

దొడ్డబళ్లాపురం: నకిలీ ఓటర్ ఐడీ, పాన్ కార్డు, ఆధార్ కార్డులతో బెంగళూరులో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తిని కాడుగోడి పోలీసులు అరెస్టు చేశారు. మోహమ్మద్ సిద్దిక్(55) నిందితుడు, ఇతడు 2006లో ఇండియాలోకి అక్రమంగా చొరబడ్డాడు. తరువాత వెస్ట్ బెంగాల్ నివాసిగా నకిలీ స్కూల్ టీసీతో బెంగళూరుకు వచ్చి ఓటర్ ఐడీ, పాన్ కార్డ్,ఆధార్ తయారు చేయించుకున్నాడు. దొడ్డబనహళ్లిలో జీవిస్తున్నాడు. ఇతడితో పాటు సుమారు 20 మంది వరకూ అక్రమ చొరబాటుదారులు మకాం వేసినట్లు పోలీసులు తెలిపారు. థణిసంద్ర నివాసి ఒకరు వీరికి సహకరించాడని గుర్తించారు.

వడ్డీ వేధింపులకు ఆటోడ్రైవర్ బలి

దొడ్డబళ్లాపురం: మీటర్ వడ్డీలు కట్టలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలబుర్గి పట్టణంలో చోటుచేసుకుంది. చంద్రకాంత్ పూజారి (35) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రముఖ హోటల్ యజమాని మందాకిని కుమారుడు శరణు పాటిల్ వద్ద రూ.40 వేలు అప్పు తీసుకున్నాడు. మొత్తం వడ్డీతో కలిపి రూ.50 వేలు అప్పు తీర్చినప్పటికీ ఇంకా వడ్డీ కట్టాలని వేధిస్తున్నాడు. అతని సతాయింపులను తట్టుకోలేక చంద్రకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు చంద్రకాంత్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అప్పులకు భయపడి ఆత్మహత్య చేసుకోవడం లేదని, మందాకిని,ఆమె కుమారుడు శరణు పాటిల్ వేధింపులను భరించలేక చనిపోతున్నట్లు తెలిపాడు. ఈ తల్లీకొడుకులు నగరంలో వడ్డీ వ్యాపారాలు చేస్తూ ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సబ్ అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓ తల్లి మరణ శాసనం

- ఇద్దరు కూతుళ్లను బావిలోకి తోసి, తాను ఆత్మహత్య



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు


రాయచూరు రూరల్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఇద్దరు పిల్లలతో తల్లి బలవన్మరణం పాలైన ఘటన యాదగిరి జిల్లాలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం వడగేర తాలూకా కంఠి తాండాకు చెందిన మహిళ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన శంకర్, నీలాబాయి (35) దంపతులు జీవిస్తున్నారు. వీరికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. భర్త సతాయింపులను భరించలేక తీవ్ర నిర్ణయం తీసుకుంది. బేబి (12 ఏళ్లు) 11 నెలల కొడుకు శివను ఇంటిలో వదిలి వెళ్లింది. మొదట రాజేశ్వరి (10), నిశా (4)లను బావిలోకి తోసింది. మూడో కూతురు సంజు (6)ను బావిలోకి తోస్తుండగా తప్పించుకుని పారిపోయింది. తల్లి బావిలోకి దూకేసింది. కూతురు వెళ్లి గ్రామస్తులకు చెప్పగా వారు వచ్చి చూసేసరికి ముగ్గురూ నీటిలో మునిగిపోయారు. జిల్లా ఎస్పీ పృథ్వీ శంకర్, డీఎస్పీ అరుణ్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. మృతదేహాలను వెలికితీయించారు. బంధువుల రోదనలు మిన్నంటాయి. ఇద్దరు చిన్నారులు తల్లి ప్రేమకు దూరమయ్యారు.

దుబాయ్‌లో గోల్డ్ షాపింగ్

- స్విట్జర్లాండ్‌కు అని చెప్పి బెంగళూరుకు ప్రయాణాలు
- రన్య రావు కేసులో డీఆర్ఐ విచారణ
- ఆమెకు తరుణ్‌రాజు సహకారం



నటి రన్య రావు



బనశంకరి: కోట్లాది రూపాయల బంగారం అక్రమ రవాణా కేసులో నటి, డీజీపీ రామచంద్ర రావు పెంపుడు కూతురు రన్య రావు బెయిల్ అర్జీపై తీర్పును బెంగళూరులోని ఆర్థిక నేరాల విభాగం ప్రత్యేక కోర్టు 14వ తేదీకి రిజర్వు చేసింది. ఇక రన్య బంగారం దందాలో కొత్త కొత్త సంగతులు వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది చివరిలో రెండుసార్లు దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేసిన రన్య స్విట్జర్లాండ్‌కు వెళుతున్నట్లు అక్కడ కస్టమ్స్ అధికారులకు తెలిపింది. కానీ నేరుగా భారత్‌కు వచ్చేసిందని ఆమె ప్రయాణ చరిత్రను బట్టి తెలిసిందని డీఆర్ఐ అధికారులు అరెస్ట్ నివేదికలో తెలిపారు. రన్య రావు పదే పదే బంగారం స్మగ్లింగ్‌కు పాల్పడింది, ఈ స్కాంలో ప్రధాన నిందితురాలు. ఈమె ఏడాదిలో 6 నెలలు దేశం బయట ఉంటున్నారని పేర్కొన్నారు. ఇక రన్య తనిఖీ చట్టబద్ధంగా జరగలేదని, కస్టడీలో ఆమె నిద్రపోకుండా డీఆర్ఐ అధికారులు వ్యవహరించారని రన్య తరపు న్యాయవాది వాదించారు. రన్య వివాహమైన మహిళ. ఆమె ఎక్కడికీ వెళ్లదు, బెయిల్ ఇవ్వాలని మనవిచేశారు. డీఆర్ఐ న్యాయవాదులు బెయిలు ఇవ్వరాదని తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆలకించిన కోర్టు మార్చి 14 తేదీ కి తీర్పు రిజర్వు చేసింది.

సమగ్ర విచారణ జరగాలి: మంత్రి లక్ష్మి

నటి రన్య రావు బంగారం కేసును సమగ్రంగా దర్యాప్తు చేస్తేనే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని మహిళా శిశు సంక్షేమ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. ఈ కేసులో ఓ ప్రముఖ మంత్రి హస్తం ఉందనే ఆరోపణలపై బుధవారం విధానసౌధలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. కేసు పూర్తి స్థాయిలో విచారణ జరగాలన్నారు. గ్యారంటీ పథకాలను కమిటీల గొడవపై స్పందిస్తూ ఆ కమిటీలను రద్దుచేయాలని ప్రతిపక్షాలు చేపట్టిన ధర్నాకు అర్థం లేదన్నారు. తమ పథకాలను పోలిన స్కీములను అమలు చేసిన కొన్ని బీజేపీ ప్రభుత్వాలు రెండు నెలల తరువాత రద్దు చేశాయని ఆరోపించారు.

తరుణ్ మాస్టర్ మైండ్

దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేయడం, తిరిగి రావడం ఎలా అనే అన్ని వివరాలను నటి రన్య స్నేహితుడు, పారిశ్రామికవేత్త కుమారుడు తరుణ్‌రాజు మార్గదర్శకం చేసినట్లు డీఆర్ఐ అధికారుల విచారణలో వెలుగుచూసింది. పట్టుబడిన తరుణ్‌రాజును విచారిస్తున్నారు. దుబాయ్‌కు వెళ్లే రన్య తో నిరంతరం సంప్రదించేవాడు. అతడు చెప్పినట్లు రన్య నడుచుకునేది. విదేశాల నుంచి బంగారం తీసుకొచ్చే కొరియర్‌గా రన్యరావును వాడుకున్నాడని డీఆర్ఐ భావిస్తోంది. ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారణ జరిపారు. కొన్నేళ్లుగా రన్యరావుతో తరుణ్‌రాజు ఆత్మీయంగా ఉంటున్నాడు. అతనికి దుబాయ్‌లో కొందరు పారిశ్రామికవేత్తలు బాగా తెలుసు. భారీగా ధన సంపాదన ఆశతో బంగారం స్మగ్లింగ్‌లో నిమగ్నమయ్యాడు. అతనిని ఐదురోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టారు. రన్య స్నేహితుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

రాగిణి, సంజనపై సుప్రీంకు పోలీసులు



రాగిణి ద్వివేది, సంజన

బనశంకరి: శాండల్‌వుడ్ అందాల నటీమణులు, గతంలో డ్రగ్స్ కేసుల్లో నిందితులు అయిన సంజన గల్రాని, రాగిణి ద్వివేదిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు రద్దు చేయడాన్ని ప్రశ్నిస్తూ సీసీబీ పోలీసులు సుప్రీం కోర్టులో అప్పీల్ చేశారు. 2020లో డ్రగ్స్ వాడకం, రవాణా అభియోగాలతో రాగిణి, సంజనను బెంగళూరు పోలీసులు అరెస్ట్‌చేశారు. సుమారు మూడు నెలల పాటు పరప్పన అగ్రహార జైల్లో రిమాండులో ఉన్నారు. అయితే తమకు ఏమాత్రం సంబంధం లేదని, తమపై నమోదైన కేసు రద్దు చేయాలని వారు హైకోర్టుల గతంలో పిటిషన్ వేశారు. విచారించిన హైకోర్టు వారిపై తగిన సాక్ష్యాధారాలు లేనందున కేసులను కొట్టివేస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. అయితే పోలీసులు హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేశారు. గత ఐదేళ్లుగా వీరి డ్రగ్స్ కేసు నలుగుతోంది. ఈ కేసులో అప్పట్లో లూజ్ మాద, దిగంత్ తో మరికొందరు నటులను పిలిపించి విచారించారు.

డెవిల్ షూటింగ్‌లో దర్శన్

మైసూరు: ప్రముఖ సినీనటుడు దర్శన్ సుమారు 10 నెలల తర్వాత బుధవారం నుంచి షూటింగ్‌లో అడుగుపెట్టారు. డెవిల్ చిత్రం చిత్రీకరణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాముండి బెట్టపై నాడదేవత చాముండేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తరువాత ప్రభుత్వ అతిథిగృహానికి చేరుకుని షూటింగ్‌కు వెళ్లారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో రెండో నిందితుడైన దర్శన్ గతేడాది జూన్ 9న మైసూరులోనే లలిత మహల్ ప్యాలెస్‌లో సినిమా షూటింగ్‌లో ఉండగా అరెస్టయ్యారు. దీంతో డెవిల్ చిత్రం షూటింగ్ నిలిచిపోయింది. ఇప్పుడు మైసూరులో అదే షూటింగ్ ద్వారా రీ స్టార్ట్ చేశారని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుమలతకు దర్శన్ అన్‌ఫాలో

యశవంపుర: సోషల్ మీడియాలో ప్రముఖ నటి, మాజీ ఎంపీ సుమలత అంబరీష్‌తో పాటు అనేక మందిని నటుడు దర్శన్ అన్‌ఫాలో చేయడం సినిమా రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. సుమలత స్పందిస్తూ దర్శన్ ఎప్పుడైనా నా కుమారుడే అని అన్నారు. సోషల్ మీడియా పోస్టులతో నిమిత్తం లేదని అన్నారు. దర్శన్ అన్‌ఫాలో చేశారంటూ స్క్రీన్ షాట్‌ని అభిమానులు సుమలతకు ట్యాగ్ చేశారు. తనను ఎవరు ఫాలో అవుతారో, కావడం లేదో చూసుకోవడం లేదని ఆమె అన్నారు.

రైలు తగిలి చిరుత మృతి



దొడ్డబళ్లాపురం: రైలు తగిలి చిరుతపులి మృతి చెందిన సంఘటన బిడది పట్టణ శివారులోని దాసప్పనదొడ్డి వద్ద రైలు పట్టాలపై చోటుచేసుకుంది. బుధవారం ఉదయం రైలు పట్టాలపై చిరుత కళేబరాన్ని చూసిన స్థానికులు అటవీశాఖ, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైలు పట్టాలపై చిరుత తల లేకుండా కళేబరం పడి ఉంది. ఆహారం కోసం ఇటువైపు వచ్చిన చిరుత పట్టాలపై తిరుగుతూ రైలు ఢీకొని చనిపోయి ఉండవచ్చని రామనగర అటవీ అధికారి హమ్మద్ మన్సూర్ తెలిపారు. చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేశారు.

బిడదిలో డ్రగ్స్ బెడద



పోలీసులు పట్టుకున్న డ్రగ్స్

దొడ్డబళ్లాపురం: బెంగళూరు సమీపంలోని బిడది పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రూ.7.25 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొన్నారు. అబ్బనకుప్పె గ్రామంలో ఒక వ్యక్తి ఇంట్లోనే గంజాయి అమ్ముతుండగా పట్టుకుని రూ.2.50 లక్షల విలువైన సరుకును సీజ్ చేశారు. బిల్లకెంపనహళ్లి గేట్ వద్ద బస్టాప్‌లో ఒక వ్యక్తి డ్రగ్స్ విక్రయిస్తుండగా నిర్బంధించి రూ.2.50లక్షల విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్నారు. బిడది రైల్వేగేట్ వద్ద ఓ డ్రగ్స్ విక్రేతను అరెస్టు చేసి రూ.2.25 లక్షల విలువైన మత్తు పదార్థాలను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒకేసారి ముగ్గురు పెడ్లర్లు దొరకడం బిడదిలో డ్రగ్స్ దందా తీవ్రతకు అద్దం పడుతోంది.

లోకాయుక్త అధికారులపై సీవీసీకి ఫిర్యాదు

మైసూరు: సీఎం సిద్దరామయ్య కుటుంబం మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) స్థలాలు పొందిన కేసును దర్యాప్తు జరిపిన ముగ్గురు లోకాయుక్త అధికారులపై కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదుదారుడు స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేశాడు. ఈ కేసు దర్యాప్తు జరిపిన ముగ్గురు లోకాయుక్త అధికారులు అదనపు డీజీపీ మనీష్ కర్బీకర్, ఐజీపీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, మైసూరు లోకాయుక్త ఎస్పీ టీజే ఉదేష్‌లు తగిన సాక్ష్యాధారాలున్నా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి సీఎం కుటుంబానికి క్లీన్‌చిట్ ఇచ్చారు, కోర్టుకు తప్పుడు నివేదికను సమర్పించారని కృష్ణ ఆరోపించాడు.

ఖాకీల కురుక్షేత్రం



నాటకంలోని ఓ సన్నివేశం

తుమకూరు: నగరంలోని పోలీసు మైదానంలో మంగళవారం రాత్రి పోలీసు సిబ్బంది అభినయించిన కురుక్షేత్ర అనే పౌరాణిక నాటకం ప్రేక్షకులను అలరించింది. పోలీసులు తమలోనూ కళాప్రతిభ దాగి ఉందంటూ అద్భుతంగా నటించారు. నాటక ప్రదర్శనను సిద్దగంగ మఠం సిద్దలింగ స్వామీజీ, ఎలెరాంపుర కుంచిటిగర మహాసంస్థానమఠం డాక్టర్ హనుమంతనాథ స్వామీజీ, మాజీ మంత్రి ఎస్.శివణ్ణ, ఎమ్మెల్యే జ్యోతి గణేష్, జిల్లా ఎస్పీ కేవీ అశోక్ తిలకించారు.

తండ్రి కాదు.. మృగం

- కూతురిపై లైంగికదాడి
- గర్భం దాల్చిన బాధితురాలు

కోలారు: కోలారు జిల్లాలో ఘోరం సంభవించింది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కూతురినే తండ్రి చెరిచాడు. దీంతో ఆమె ఐదు నెలల గర్భిణి అయ్యింది. బంగారుపేట తాలూకాలోని ఓ గ్రామంలో ఈ దురాగతం చోటు చేసుకుంది. వివరాలు.. ముగ్గురు పిల్లల తండ్రి అయిన నిందితుడు (50), గార పని చేస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితమే భార్య చనిపోయింది. 20 ఏళ్ల కూతురు, 18 ఏళ్ల కొడుకు, 15 ఏళ్ల కూతురు ఉన్నారు. పెద్ద కూతురిపై కన్నేసిన వంచకుడు ఆమెను బెదిరించి లైంగిక దాడికి పాల్పడేవాడు. ఫలితంగా ఆమె గర్భవతి అయ్యింది. ఇరుగుపొరుగు గమనించి ఆరా తీయగా తండ్రి అకృత్యాన్ని వివరించింది. వారి సాయంతో కామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితున్ని అరెస్టు చేశారు.

రశ్మికకు మద్దతు.. నాచప్పపై కేసు

యశవంతపుర: రశ్మిక కన్నడిగురాలు అయినా అలా చెప్పుకోవడం లేదు. సినిమా వాళ్లు అతి చేస్తున్నారు, గుణపాఠం తప్పదు, హుషార్.. అని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గాణిగ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందున, నటి రశ్మికా మందన్నకు భద్రత కల్పించాలని కొడవ జాతీయ మండలి అధ్యక్షుడు నందినేడ నాచప్ప ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాయడం తెలిసిందే. అయితే నాచప్ప సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని కొందరు మండ్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో నాచప్ప మీద పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

డీకేశికి సన్మానం

దొడ్డబళ్లాపురం: డీసీఎం డీకే శివకుమార్‌కు పాలనహళ్లి మఠం స్వామీజీ వెండి కిరీటం తొడిగి సన్మానించారు. మాగడి తాలూకా సోలూరులోని శ్రీ శనేశ్వర క్షేత్ర పాలనహళ్లి మఠం సిద్ధరాజు స్వామి బెంగళూరులోని సదాశివనగరలో ఉన్న డీకే ఇంటికి వెళ్లి వెండి కిరీటం బహూకరించారు. కేపీసీసీ అధ్యక్షునిగా 5ఏళ్లు పూర్తి చేసుకొన్నందుకు అభినందనలు తెలిపారు.

యూట్యూబర్‌పై ఎఫ్‌ఐఆర్ కొట్టివేత

యశవంతపుర: దక్షిణకన్నడ కన్నడ జిల్లా ధర్మస్థలకు చెందిన సౌజన్య హత్య కేసుపై వీడియో చేసి సంచలనం కలిగించిన సమీర్‌పై పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2012లో సౌజన్య అనే విద్యార్థినిపై కొంతమంది ఆత్యాచారం చేసి, హత్య చేశారు. ఈ ఘటనపై యూట్యూబర్ సమీర్ ఒక వీడియో చేశారు. ఇది సంచలనం కలిగించింది. వారం రోజుల్లో కోటీ 50 లక్షల మంది వీక్షించారు. వీడియో తీయడంపై ధర్మస్థల పోలీసులు సమీర్‌కు నోటీసులిచ్చి విచారణకు పిలిచారు. అనంతరం అతనిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టి వేయాలని సమీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. విచారించిన హైకోర్టు ధర్మాసనం.. ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేసింది. కేసు విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.

లోక్ అదాలత్‌లో 5310 కేసుల పరిష్కారం

చిక్కబళ్లాపురం: ఈనెల 8న నిర్వహించిన లోక్ అదాలత్‌లో 5310 కేసులను పరిష్కరించినట్లు జిల్లా న్యాయమూర్తి నెరళె వీరభద్రయ్య భవాని తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న 82969 కేసులను రాజీమార్గంలో పరిష్కారానికి ఎంపిక చేశామన్నారు. అందులో 5310 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. డైవర్స్ కోసం అర్జీలు సమర్పించిన 13 జంటలను రాజీ ద్వారా ఒక్కటి చేశామన్నారు. ఆస్తి వివాదాలు, బ్యాంకు కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

ఆస్తి వివాదంతో రాళ్ల దాడులు

యశవంతపుర: ఆస్తి వివాదంతో బెళగావి జిల్లా హళె వంటమూరి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం రాళ్లతో కొట్టుకున్నారు. కాకతి పోలీసులు కేఎస్ఆర్‌పీ బలగాలను రప్పించి బందోబస్తు ఏర్పాటు చేశారు. తీవ్రంగా గాయపడిన నింగవ్వ అనే మహిళను బెళగావి బీమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా శ్రీ రేణుకాచార్యుల జయంతి



రేణుకాచార్యుల చిత్రపటం వద్ద ప్రముఖులు

చిక్కబళ్లాపురం: మానవజాతి ఉద్ధరణ కోసం ఎందరో మహనీయులు తమదైన శైలిలో కృషి చేశారని, అందులో జగద్గురు రేణుకాచార్య ప్రముఖులు అని అదనపు జిల్లా కలెక్టర్ ఎస్. భాస్కర్ అన్నారు. జిల్లా పాలకమండలి, జిల్లా కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన రేణుకాచార్యుల జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేణుకాచార్యుల చిత్రపటానికి పుష్పమాలను సమర్పించి మాట్లాడారు. జగద్గురు రేణుకాచార్య వీరశైవ ధర్మానికి మహా గురువులన్నారు. ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం లాయర్ ప్రభా నాగరాజ్ రేణుకాచార్యుల జీవిత విశేషాలను వివరించారు. అనంతరం సముదాయ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కన్నడ సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, సముదాయ ప్రముఖులు మహేష్ బసవపుర, రాజేంద్రప్రసాద్, గంగాధర్ పాల్గొన్నారు.

సమాజ సేవకు విద్యార్థులు ముందుకు రావాలి



రక్తదనం చేసిన విద్యార్థులతో ప్రముఖులు

గౌరిబిదనూరు: విద్యార్థి దశలోనే సామాజిక సేవలు చేయాలని లయన్ క్లబ్ డాక్టర్ గుండూరావ్ సూచించారు. పట్టణంలని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో లయన్ సంస్థ, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గుండూరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. రక్తదానంతో ఇతరుల ఆరోగ్యాన్ని రక్షించడంతో పాటు మన ఆరోగ్యం సైతం బాగు పడుతుందన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్ అధ్యక్షుడు నంజేగౌడ, ఇస్తూరి సతీశ్. సూరజ్, శ్రేణిక్, మంజునాథ్, సంకేత్ శ్రీరాం, జగన్నాథ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సులు ఢీ, ఒకరి మృతి



శ్రీనివాసపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు



నుజ్జయిన బస్సుల ముందు భాగాలు

- 40 మందికి పైగా గాయాలు

శ్రీనివాసపురం : రెండు ప్రైవేటు బస్సులు పరస్పరం ఢీకొని కండక్టర్ మృతి చెందగా 40 మందికి పైగా ప్రయాణికులు గాయాల పాలయ్యారు. ఈఘటన కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకా రాయల్పాడు ఫిర్కా గుంటపల్లి క్రాస్ వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. ఏపీలోని నంద్యాల నుంచి ప్రయాణికులతో బయల్దేరిన ఏఆర్ ట్రావెల్స్ బస్సు గుంటపల్లి క్రాస్ వద్దకు రాగానే బెంగుళూరు నుంచి వైఎస్సార్ జిల్లా కడప వైపు వెళ్తున్న సువర్ణముఖి బస్సు ఎదురైంది. ఈక్రమంలో బస్సులు పరస్పరం ఢీకొన్నాయి. రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జయ్యాయి. ప్రమాదంలో మదనపల్లికి చెందిన సువర్ణముఖి బస్సు కండక్టర్ గంగాధర్ (35) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించగా రెండు బస్సుల్లోని 40 మందికిపైగా ప్రయాణికులకు గాయాలయ్యాయి. రాయల్పాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో కోలారు, మదనపల్లి, శ్రీనివాసపురం, చింతామణి ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కండక్టర్ గంగాధర్ మృతదేహాన్ని శ్రీనివాసపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సులను ప్రమాద స్థలం నుంచి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూశారు. రాయల్పాడు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



చికిత్స పొందుతున్న బాలుడు

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కటింగ్‌లో పాల్గొన్న నేతలు, అభిమానులు

బనశంకరి: కులం, మతం, ప్రాంతం చూడకుండా అందరినీ అక్కున చేర్చుకున్న పార్టీ వైఎస్సార్ సీపీ, అందరికీ అండగా నిలవడమే మా పార్టీ లక్ష్యమని పార్టీ ఐటీ వింగ్ అధ్యక్షుడు కుమార్ పులివెందుల తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం కృష్ణరాజపురంలో ఐటీ వింగ్–బెంగళూరు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సర్కారు మోసాలు, కుట్రలతో అధికారంలోకి వచ్చిందని, గత పది నెలల్లోనే కూటమి పాలన తేటతెల్లమై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి మళ్లీ వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పడతారని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా పాలన గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లి వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు జీ.రాజశేఖర్‌రెడ్డి, వింగ్ సభ్యులు పూల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎం.మారుతి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకంగా రూపొందించిన కేక్

కొడగులో భూప్రకంపనలు

యశవంతపుర: రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో బుధవారం భూ ప్రకంపనలు ఏర్పడ్డాయి.

కొడగు జిల్లా మడికెరి తాలూకా మదెనాడు, మొణ్ణంగేరిలో భూ ప్రకంపనలు వచ్చాయి. ఉదయం 10:50 గంటలకు భూమి కదిలినట్లు అనిపించిందని ప్రజలు తెలిపారు. గ్రామ పంచాయతి అధికారులకు తెలిపారు.

పిల్లలకు మంచి విద్య, సంస్కారం నేర్పండి

హుబ్లీ: దేశ భవిత పాఠశాలల్లోనే నిర్మాణం అవుతున్నందున ప్రాథమిక దశలోనే పిల్లలకు మంచి విద్య, సంస్కారం నేర్పడానికి కృషి చేయాలని జిల్లాధికారిణి దివ్యప్రభు సూచించారు. జిల్లాలోని కుందగోళ తాలూకా అల్లపూర గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 15వ ఆర్థిక ప్రణాళిక కమిషన్ నిధులతో నిర్మించిన పాఠశాల గోడ, భోజనశాల, సీసీ టీవీ కెమెరాల అమరికతో పాటు పాఠశాల వార్షికోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఉద్యోగాలు, నాణ్యమైన కనీస సౌకర్యాలకు ఉపాధి హామీ మంచి పథకం అన్నారు. ఈ పథకం ద్వారా నాణ్యతపై జాగృతి వహించాలన్నారు. అల్లాపూర గ్రామం పొగాకు, మద్య రహితమని, ఇతర గ్రామాలకు ఆదర్శప్రాయం అయిందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు ఇదే విధంగా పొగాకు, మద్య రహిత గ్రామాలైతే జిల్లా అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. జెడ్పీ సీఈఓ భువనేష్ పాటిల్, ఆ పాఠశాల ప్రధాన గురుమాత జేపీ ఉపాధ్యాయ, తహసీల్దార్ రాజు రజని పాటిల్ పాల్గొన్నారు.

15న దావణగెరెలో బృహత్ ఉద్యోగ మేళా

బళ్లారి రూరల్ : దావణగెరె నగరంలో ఈనెల 15న బృహత్ ఉద్యోగ మేళా జరుగనున్నట్లు దావణగెరె జిల్లాధికారి జీ.ఎం.గంగాధరస్వామి పేర్కొన్నారు. జిల్లాధికారి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ, జిల్లా యంత్రాంగం, కౌశల్యాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బృహత్ ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉద్యోగ మేళాలో 50 కిపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉద్యోగ మేళాలో వివిధ కంపెనీల్లో ఖాళీగా ఉన్న సుమారు 5000 ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. నగరంలోని హదడి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల, బాపూజీ ఇంజినీరింగ్ కాలేజీ(బీఐటీ) రెండు చోట్ల ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇంటర్వ్యూలు

బీఐటీలో ఇంజినీరింగ్, ఎంబీఏ పట్టభద్రులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీ, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ పట్టభద్రులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఉద్యోగ మేళాకు ఇప్పటివరకు 1000 మంది నిరుద్యోగ యువతీ, యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని వారు కూడా నేరుగా ఉద్యోగమేళాకు హాజరుకావచ్చన్నారు. ఉద్యోగమేళాలో గనులు, భూవిజ్ఞానం, ఉద్యానవన తదితర శాఖలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగమేళా జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు వరంలాంటిదన్నారు. ఉద్యోగమేళాకు వచ్చే నిరుద్యోగుల ఇంటర్వ్యూల కోసం 40 టెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అల్పాహారం, తేనీరు తదితర అత్యవసరమైన అన్ని ఏర్పాటు చేశారన్నారు. జెడ్పీ సీఈఓ సురేశ్ హిట్నాళ్, జెడ్పీ ప్రణాళికా సంచాలకులు రేష్మా కౌశర్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణులై పాఠశాలకు పేరు తేవాలి



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీనివాసపురం : విద్యార్థులు కష్టపడి చదివి పదవతరగతి పరీక్షలలో ఉత్తమ సాధన చేసి తాము చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ప్రీతి విద్యా మండలి కార్యదర్శి ఉమాదేవి హితబోధ చేశారు. తాలూకాలోని యల్దూరు గ్రామంలో విద్యా మందిర పాఠశాలలో బుధవారం నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం పదవ విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చే విధానాన్ని రద్దు చేసిందన్నారు. విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ హేమ, ఉపాధ్యాయులు ఈశ్వర్, నారాయణస్వామి, అంబిక, సుమిత్ర, సుధా, రంజిత్ పాల్గొన్నారు.

‘కేంద్ర మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం’

హుబ్లీ: సీఎం సిద్ధరామయ్య బడ్జెట్ పూర్తిగా ముస్లింల కోసం ప్రతిపాదించిన బడ్జెట్‌లా ఉందన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంగ్రెస్ నేత శివానంద ముత్తణ్ణవర్ విమర్శించారు. నగరంలో ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది బడ్జెట్ రూ.4.09 లక్షల కోట్లు ఉంది. అందులో మైనార్టీలకు కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది 1 శాతం మాత్రమే మైనార్టీలకు కేటాయించినట్లు కదా? అని అన్నారు. మైనార్టీలు అంటే కేవలం ముస్లింలు మాత్రమే కాదు, జైనులు, సిక్కులు, బౌద్ధులు తదితర చిన్నా చితకా మతస్తులు మైనార్టీల్లో ఉన్నారని కేంద్ర మంత్రికి తెలియదా? అని నిలదీశారు. ఈ సారి సిద్దు బడ్జెట్‌లో పూర్తిగా ముస్లిలకే ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని పాకిస్తాన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న జోషి వ్యాఖ్యలు వాస్తవానికి దూరం అన్నారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్రంలోని 7 కోట్ల మంది కన్నడిగులను దారి తప్పించేలా ఉన్నాయన్నారు. తక్షణమే జోషి తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యల్లప్ప కుందగోళ, వెంకటేష్, పీటర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

దుష్టశక్తులను తరిమికొడదాం

- మాజీ మంత్రి రేణుకాచార్య



మాట్లాడుతున్న మాజీ మంత్రి రేణుకాచార్య

హొసపేటె: ఆంతరంగిక వర్గాలను ఏకం చేసి సమాజాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తున్న దుష్టశక్తులను గద్దె దింపాలనే ఉద్దేశ్యంతో తాను తన బృందంతో రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి రేణుకాచార్య తెలిపారు. నగరంలోని అమరావతి గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీరశైవ లింగాయత్ వర్గానికి చెందిన 9 మంది ముఖ్యమంత్రులకు పూర్తి స్థాయిలో అధికారం దక్కకపోవడంపై ఘాటుగా స్పందించారు. విజయేంద్ర నాయకత్వానికి తాను, తన బృందం మద్దతు తెలుపుతామన్నారు. రాష్ట్రంలో డ్రగ్ మాఫియా, అత్యాచారాలు, దోపిడీలు పెరిగి పోతున్నాయన్నారు. రన్యారావు కేసులో పలుకుబడి ఉన్న మంత్రుల పాత్రపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని అన్నారు. సణాపురలో విదేశీ మహిళపై జరిగిన అత్యాచార ఘటనపై మాజీ ఎమ్మెల్యే పరన్న మునవళ్లి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆధునిక సమాజంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండటం దురదృష్టకరం అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రపై కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయన్నారు. మాజీ సీఎం యడియూరప్ప మాదిరిగానే ఇప్పుడు విజయేంద్రను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. విజయేంద్ర నాయకత్వాన్ని బలపరచాలని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

హుబ్లీ: నేటి రోజుల్లో నాయకత్వ లక్షణాలు చాలా అవసరం, వీటిని ప్రతి మహిళ పెంపొందించుకోవాలని ప్రముఖ మోడల్ రేష్మా ఫెర్నాండెజ్ అన్నారు. గోకుల్ రోడ్డు మోటో వీల్స్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఉమా మాట్లాడుతూ పురుషులకు సరిసమానంగా సాధన చేయడం ద్వారా మహిళలు ఆదర్శప్రాయులయ్యారన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని వాడుకొని సాధన చేయాలన్నారు. ఈ విషయంలో హుబ్లీ మోటో వీల్స్ మహిళా సిబ్బందికి అవకాశం కల్పించడం గర్వకారణం అన్నారు.

ఇంటికెళ్లనంటూ మొండికేస్తున్న విద్యార్థి

- కొడుకును అప్పగించాలని కోరుతున్న తల్లిదండ్రులు



దిగంత్ (ఫైల్)

యశవంతపుర: అదృశ్యమై ఎట్టకేలకు సురక్షితంగా పోలీసులకు చిక్కిన పీయూసీ విద్యార్థి దిగంత్ తాను ఇంటికి వెళ్లేది లేదని మొండికేస్తున్నాడు. పరీక్షలంటే భయపడి దిగంత్ ఇంటినుంచి వెళ్లిపోయి పలు ప్రాంతాల్లో తిరిగాడు. ఎట్టకేలకు శివమొగ్గలో ఉండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దిగంత్‌ను బంట్వాళ పోలీసులు బాలమందిరంలో పెట్టి విచారిస్తున్నారు. కాగా ఈ బాలుడు తన ఇంటికి వెళ్లనని మొండికేస్తున్నట్లు పోలీసులు హైకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పొందుపరిచారు. మరో వైపు కుమారుడిని తమకు అప్పగించాలని దిగంత్ తల్లిదండ్రులు హైకోర్టులో మొరపెట్టుకున్నారు. కాగా దిగంత్ ఉద్దేశపూర్వకంగా అదృశ్యం కాలేదని, ఎవరో తీసుకెళ్లారని బాలుడి తల్లిదండ్రుల తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే దిగంత్ ఉద్దేశపూర్వకంగానే అదృశ్యమైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దిగంత్ విషయంపై శిశు సంక్షేమ సమితి ఒక నిర్ణయం తీసుకుంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ కామేశ్వరరావ్, జస్టిస్ టీఎం నదాఫ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది.

కోలారు వార్తలు...

హక్కులను మహిళలు వినియోగించుకోవాలి



మహిళలను సన్మానించిన దృశ్యం

కోలారు : ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు, హక్కులను కల్పిస్తోందని, వాటిని వినియోగించుకోవాలని రూరల్ ఎస్ఐ సునీతాదేవి సూచించారు. నగరంలోని వాసన్ ఐ కేర్ కంటి ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎస్ఐ పాల్గొని మాట్లాడారు. మహిళలు సాంస్కృతిక, విద్యా , రాజకీయ, ఆర్థిక తదితర అన్ని రంగాలలో అపార సాధన చేస్తుండటం సంతోషించదగిన విషయమన్నారు. న్యాయమూర్తి రత్నగౌడ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూఢనమ్మకాల నుంచి దూరంగా ఉంటూ సమాజంలో ముందడుగు వేయాలన్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో వాసన్ ఆస్పత్రి డాక్టర్ కావ్య, డాక్టర్ అపూర్వ, డాక్టర్ అగర్వాల్, పీఆర్‌ఓ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

14న యోగినారాయణ జయంతి



మాట్లాడుతున్న వెంకటస్వామి

కోలారు : యువబలిజ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన శ్రీ యోగినారాయణ తాతయ్య 299వ జయంతిని నగరంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు బలిజ సముదాయ నాయకుడు వెంకటస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం వద్ద తాతయ్య విగ్రహానికి ఉదయం 10 గంటలకు పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం నగర, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పల్లకీల ఊరేగింపు, మధ్యాహ్నం 2 గంటలకు టీ చెన్నయ్య రంగమందిరంలో వేదిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బలిజ సముదాయ ప్రముఖుడు ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ పల్లకీల కార్యక్రమం అనంతరం పీయూసీలో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన సముదాయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా బలిజ సముదాయ అధ్యక్షుడు చిట్టి, పుష్టి నారాయణ స్వామి, కేవీ సురేష్‌కుమార్, రౌత్ శంకరప్ప, సా మ బాబు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి చేతిలో ఐటీఐ విద్యార్థి హత్య



హతుడు మునిరాజు (ఫైల్)



నిందితుడు నవీన్ (ఫైల్)

మాలూరు : స్నేహితుడి చేతిలో ఐటీఐ విద్యార్థి హత్యకు గురయ్యాడు. ఈఘటన మాలూరు తాలూకా లక్కూరు ఫిర్కా ఆలంబాడి గేట్ వద్ద చోటు చేసుకుంది. చిక్క తిరుపతి గ్రామ పంచాయతీ రాజకృష్ణాపుర గ్రామానికి చెందిన మునిరాజు (22) పట్టణంలోని రక్షితా ఐటీలో చదువుతున్నాడు. ఇతని స్నేహితుడు నవీన్ కూడా అదే ఐటీఐ చదువుతున్నాడు. నిత్యం రాజకృష్ణాపుర గ్రామం నుంచి ఆలంబాడి గేట్ వరకు వచ్చి, అక్కడి నుంచి పట్టణానికి బస్సులో వచ్చేవారు. బుధవారం ఉదయం ఆలంబాడి గేట్ వద్ద మునిరాజు బస్సు కోసం వేచి ఉండగా నవీన్ కూడా వచ్చాడు. ఏదో విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆవేశానికి లోనైన నవీన్ మునిరాజును కత్తితో పొడిచి ఉడాయించాడు. తీవ్రంగా గాయపడిన మునిరాజును ఆటోలో చిక్కతిరుపతి ఆస్పత్రికి తరలించారు. అనంతరం పట్టణ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మాలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గంగమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన



విశేష పూజలు నిర్వహించిన దృశ్యం

మాలూరు : తాలూకాలోని రాజేనహళ్లి గ్రామ పంచాయతీ వ్యాప్తిలోని సోణప్పనహట్టి గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య జరిగింది. శిలా విగ్రహ స్థిర బింబ ప్రతిష్టాపనను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. సంజీవిని ట్రస్టు అధ్యక్షుడు హూడి విజయకుమార్ పాల్గొని విశేష పూజలు సమర్పించారు.

దళితుల నిధులను దారి మళ్లిస్తున్నారు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఎస్ మునిస్వామి

కోలారు : రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా గ్యారెంటీల అమలు కోసం ఎస్సీ, ఎస్టీల నిధులను ఉపయోగించుకోవాలని యోచిస్తోందని, దీనిపై శాసనసభలోని 52 మంది దళిత ఎమ్మెల్యేలు గొంతెత్తాలని మాజీ ఎంపీ ఎస్. మునిస్వామి సూచించారు. బుధవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు బడ్జెట్‌లలో ఎస్సీ, ఎస్టీల నిధులు రూ. 13,400 కోట్లను దారి మళ్లించిందని గుర్తు చేశారు. దళితులకు కేటాయించిన నిధులను వేరే పథకాలకు మళ్లిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దళితుల నిధులు పక్కదారి పడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్.సి. మహదేవప్ప తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై సంపంగి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఓం శక్తి చలపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మఠాల సేవలు అనన్యం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఈశ్వర్ ఖండ్రే

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో వీరశైవ, లింగాయత్ మఠాలు, సంస్థలు అందిస్తున్న సేవలు మరువలేనివని అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే అన్నారు. రవీంద్ర కళాక్షేత్రంలో కన్నడ–సంస్కృతి శాఖ బుధవారం ఏర్పాటు చేసిన జగద్గురు శ్రీ రేణుకాచార్య జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిద్ధగంగ మఠం, సుత్తూరు మఠం, సిరిగెరె మఠాలకు చెందిన విద్యా సంస్థల్లో చదివిన అనేకమంది నేడు దేశ,విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మంత్రి శివరాజ్ తంగడగి, వీరశైవ, లింగాయత అభివృద్ధి మండలి అధ్యక్షుడు విజయానంద కాశప్పనవర్, యడెయూరు మఠం రేణుకా శివాచార్యస్వామిజీ హాజరయ్యారు.

భవిష్యత్‌లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యత

గౌరిబిదనూరు: డిగ్రీ అనంతరం ఉన్నత విద్యలో అనేక కోర్సులు ఉంటాయని, వాటి పట్ల క్షుణ్ణంగా తెలుసుకోవాలని నేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజా సప్తగిరి సూచించారు. పట్టణంలోని నేషనల్ కాలేజీలో జెట్‌కింగ్ శివాజీ నగర్ లర్నింగ్ సెంటర్, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ సహకారంతో మంగళవారం ఏర్పాటు చేసిన డిజిటల్ స్కిల్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. రాబోవు రోజుల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యత పెరుగనుందన్నారు. కంప్యూటర్ శిక్షణ చాలా అవసరమన్నారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ సయ్యద్ అహమ్మద్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ రాజేశ్వరి, డాక్టర్ గుణరంజని, ప్రొఫెసర్ నిజాముద్దీన్, సుబ్రహ్మణ్య పాల్గొన్నారు.

రైలులో గంజాయి రవాణా



పట్టుబడ్డ నిందితుడితో బాల్కి పోలీసులు

దొడ్డబళ్లాపురం: రైల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని బీదర్ జిల్లా బాల్కి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పవన్(30) మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు రైల్లో గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సాచారం మేరకు పోలీసులు తనిఖీ చేశారు. బ్యాగులో దాచిన రూ.14 లక్షల విలువైన గంజాయి సీజ్ చేశారు. దాడి సమయంలో బాల్కి తహసీల్దార్ ఉన్నారు.

రుణం పేరుతో వ్యాపారవేత్తకు టోపీ

మైసూరు: వాణిజ్య దుకాణ సముదాయ నిర్మాణానికి రూ.10 కోట్ల రుణం ఇప్పిస్తామని వ్యాపారవేత్తను నలుగురు వ్యక్తులు నమ్మించి రూ.12.50 లక్షలు కొల్లగొట్టారు. ఈ ఘటన నగరంలో జరిగింది. రాజేంద్రనగర నివాసి రామకృష్ణ ఉదయగిరి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వాణిజ్య భవనం నిర్మించాలని భావించాడు. రుణం కోసం రామకృష్ణ యత్నిస్తుండగా స్నేహితుడు కలుగజేసుకొని రూ.10 కోట్ల రుణం ఇప్పించేవారు తనకు పరిచయం ఉన్నారని చెప్పారు. అనంతరం పాషా, రోషన్ అనే మధ్యవర్తులను పరిచయం చేశారు. ఆ తర్వాత వారిద్దరూ కలిసి బెంగళూరుకు చెందిన రాజగోపాల్ తిలక్, సుందర్‌ను పరిచయం చేశారు రూ.10 కోట్ల రుణాన్ని ఇప్పిస్తామని చెప్పి రూ.12.50 లక్షల కమీషన్ తీసుకున్నారు. రోజులు గడిచినా రుణం మాత్రం ఇప్పించలేదు. రుణం ఇప్పించకపోతే కమీషన్‌ను వాపసు ఇవ్వాలని రామకృష్ణ కోరగా చంపుతామని బెదిరించారు. దీంతో రామకృష్ణ నరసింహరాజ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రధాన కార్యదర్శిగా నియామకం



నారాయణస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: స్థానిక చలవాది సఘం అధ్యక్షుడు ఆర్‌ఎం నారాయణస్వామి రాష్ట్ర స్థాయి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా స్థానిక సంఘం నాయకులు నారాయణస్వామిని ఘనంగా సత్కరించారు. నారాయణస్వామి ప్రసంగిస్తూ చలవాది సముదాయ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జయరామయ్య, లక్ష్మీపతి, హనుమంతరాయప్ప, ఉమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి వ్యక్తి బలి

మైసూరు: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన చామరాజనగర జిల్లా హనూరు పట్టణం శివార్లలోని లొక్కనహళ్లి ప్రధాన రహదారిలో జరిగింది. హనూరు తాలూకా పీజీ పాళ్య గ్రామ పంచాయతీ ఉయ్యలనత్త గ్రామానికి చెందిన లింగరాజు (50) బైక్‌లో తన స్వగ్రామం నుంచి హనూరుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమదంలో లింగరాజు తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మరణించాడు.

రాత్రివేళ ట్రెక్కింగ్‌కు చలో కబ్బాళ దుర్గ

- థ్రిల్లింగ్ కోసం యువత మక్కువ
- బెంగళూరుకు 80 కిలోమీటర్ల దూరం
- శిఖరంపై రమణీయ దృశ్యాలు

బనశంకరి: పగటి సమయంలోనే ట్రెక్కర్లకు, సాహసప్రియులకు కొండలను ఎగబాకడం ఎంతో ఉత్కంఠంగా ఉంటుంది. చీకట్లు కమ్ముకున్న రాత్రి సమయాల్లో ట్రెక్కింగ్ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయితే థ్రిల్లింగ్ కోసం యువత ఇష్టపడుతోంది. ఇలా నైట్ ట్రెక్కింగ్‌కు బెంగళూరునగర సమీపంలోని కబ్బాళ దుర్గ అనుకూలంగా ఉంది. రాత్రి సమయంలో కబ్బాళ దుర్గపైకి ట్రెక్కింగ్ చేయడం ప్రత్యేక అనుభూతి కలిగిస్తుంది. మొదటిసారి నైట్ ట్రెక్కింగ్ చేసేవారికి ఎంతో సాహసం అవసరం. కబ్బాళదుర్గ శిఖరం 3600 అడుగుల ఎత్తులో ఉంది. ఈ శిఖరంపై కబ్బాళమ్మదేవి అలయం ఉంది. అదేవిధంగా ఇక్కడ కోట ఉండటంతో కబ్బాళ దుర్గగా పేరువచ్చింది. పచ్చదనం ప్రకృతి రమణీయతతో భారీ బండలతో కూడుకొని ఉంటుంది ఈ కొండ. ఒకరోజు విహారానికి సరైన ప్రదేశం కబ్బాళదుర్గ. కబ్బాళ దుర్గపైకి ట్రెక్కింగ్‌ను రాత్రి 10 గంటలకు ప్రారంభిస్తే మూడుగంటల్లోశిఖరంపైకి చేరుకోవచ్చు. పౌర్ణమి చంద్రుడి వెలుగులో ట్రెక్కింగ్ ప్రత్యేక అనుభూతి కలిగిస్తుంది. శిఖరంపైకి చేరుకోగానే సూర్యోదయం సమయం నయనమనోహరంగా ఉంటుంది. శిఖరంపై నుంచి చూస్తే చుట్టు పక్కల పచ్చదనంతో అలరారే ప్రాంతాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. కబ్బాళదుర్గ సమీపంలో చెరువుల్లో జలవిహారం కూడా చేయవచ్చు. కబ్బాళదుర్గ ట్రెక్కింగ్‌కు వెళ్లే ట్రెక్కర్లు టార్చ్, వ్యక్తిగత ఔషధాలు, బలమైన బ్యాక్‌ప్యాక్ వాటర్‌బాటిల్స్, ఎనర్జీఫుడ్, చల్లటి పానీయాలు, స్పోర్ట్‌షూ, కెమెరా తీసుకెళ్లడం ఉత్తమం.

కబ్బాళదుర్గ ఎలా వెళ్లాలంటే...

బెంగళూరు నుంచి కేఎస్‌ఆర్‌టీసీ బస్సుల్లో 62 కిలోమీటర్ల దూరంలోని కనకపురకు రెండుమూడు గంటల్లో చేరుకోవచ్చు. అక్కడ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సాతనూరు చేరుకోవాలి. అక్కడి నుంచి కుడివైపు ఆరు కిలోమీటర్లు ప్రయాణిస్తే కబ్బాళ గ్రామానికి వెళ్లవచ్చు.



కబ్బాళ కొండపైకి చేతికర్రలు పట్టుకొని నైట్ ట్రెక్కింగ్ చేస్తున్న సాహసికులు



బండరాళ్లను దాటుతున్న దృశ్యం



మార్గం మధ్యలో సేదతీరిన ట్రెక్కర్లు



ఎంతో కష్టంతో ట్రెక్కింగ్ చేస్తున్న దృశ్యం



వేకువజామున నయనమనోహర దృశ్యం



కొండపైకి వెళ్తున్న ట్రెక్కర్లు

మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించాలి



ప్రసంగిస్తున్న సభ్యుడు రమేశ్

గౌరిబిదనూరు: పట్టణ పౌరులకు ఉత్తమ సౌలభ్యాలను అందించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సభ్యుడు రమేశ్ సూచించారు. నగరసభ సభాభవనంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణప్ప అధ్యక్షతన బుధవారం జరిగిన బడ్జెట్ ముందస్తు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మురుగు కాలువలు, రోడ్లు, పరిసరాల శుభ్రత, మంచినీటి సరఫరా తదితర పనులకు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. సభ్యుడు మార్కెట్ మోహన్ ప్రసంగిస్తూ ఉద్యానవనాలకు జీవంపోయాలన్నారు. కాగా సమావేశానికి చాలమంది సభ్యులు గైర్హాజరయ్యారు. కమిషనర్ గీత, ఉపాధ్యక్షుడు ఫరీద్, కలీంవుల్లా, వెంకటరెడ్డి, గిరీశ్, గోపాల్, సుబ్బమ్మ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల తొలగింపు వివాదాస్పదం

యశవంతపుర: కలబురగి పట్టణంలో జగద్గురు రేణుకాచార్య జయంతి కార్యక్రమంలో భాగంగా కట్టిన బ్యానర్లను తొలగించడం వివాదాస్పదమైంది. సూపర్ మార్కెట్, వీరశైవ కల్యాణ మంటప ప్రాంతాలలో కట్టిన బ్యానర్లను పాలికె అధికారులు బుధవారం తొలగించారు. దీంతో నిర్వాహకులు ఆక్రోశం వ్యక్తం చేశారు. బ్యానర్లు తొలగించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు.

మందుగుండు తిని పశువు నోరు ఛిద్రం

మైసూరు: పొలంలో మేత మేస్తూ మందుగుండును తిని మూగ జీవి నోరు ఛిద్రమైంది. ఈ ఘటన చామరాజనగర జిల్లా హనూరు తాలూకా బూదబాళు గ్రామంలో జరిగింది. గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద పశువులు మేత మేసేందుకు వెళ్లాయి. దుండగులు మేతతో పాటు మందుగొండు పేలుడు వస్తువును కూడా అక్కడ ఉంచారు. మల్లయ్య అనే వ్యక్తికి చెందిన మూగజీవి ఒకటి మేత తింటూ వెళ్లి అక్కడ ఉంచిన మందుగుండు వస్తువును కూడా తినింది. వెంటనే పేలుడు సంభవించి దాని నోరు ఛిద్రమైంది. ఈ దృశ్యం చూసిన స్థానికులను కలచివేసింది. హనూరు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

లోకాయుక్త వలలో పీడబ్ల్యూడీ ఉద్యోగి

మైసూరు: లంచం తీసుకుంటూ చామరాజనగర ప్రజాపనుల శాఖ(పీడబ్ల్యూడీ) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లోకాయుక్తకు పట్టుబడ్డాడు. చామరాజనగర తాలూకా ఇరసవాడికి చెందిన ప్రసన్న అనే వ్యక్తి కాంట్రాక్ట్ ఆధారంగా ఎం–స్యాండ్ క్రషర్‌ను నిర్వహిస్తున్నారు. ఎం–స్యాండ్ ఇసుక విక్రయానికి నాణ్యతా పరీక్ష నివేదిక శాఖ నుంచి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఈ నివేదిక కోసం ప్రసన్న చామరాజనగర కోర్టు రోడ్డులోని ప్రజాపనులు, ఓడరేవులు, అంతర్గత జలరవాణా శాఖ కార్యాలయంలోని నాణ్యత ఉపవిభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ నందరాజును ఆశ్రయించాడు. పని జరగాలంటే రూ.5500 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అడ్వాన్స్‌గా రూ.1000 తీసుకున్నాడు. దీనిపై ప్రసన్న లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. పథకం ప్రకారం ప్రసన్న బుధవారం మిగతా రూ.4500 అందజేస్తుండగా లోకాయుక్త ఎస్పీ ఉదేష్, డీఎస్పీ కేటీ మ్యాథ్యూథామస్‌ల మార్గదర్శనంలో సీఐ లోహిత్ కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. నందరాజును బంధించి, నగదును స్వాదీనపరచుకుని కేసు నమోదు చేసుకున్నారు.

‘తల్లిదండ్రులను విస్మరిస్తే ఆస్తిపై హక్కు ఉండదు’

దొడ్డబళ్లాపురం: తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు వారి ఆస్తిపై హక్కు ఉండదని, విల్, దానపత్రాన్ని రద్దు చేసుకునే అవకాశం పెద్దలకు కేంద్రం కల్పించిందని రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ అన్నారు. బుధవారం విధానపరిషత్‌లో ఎమ్మెల్సీ బల్కీస్ భాను అడిగిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా సమాధానం ఇచ్చారు. కేంద్రం 2007లోనే ఇలాంటి చట్టం ఒకటి తీసుకువచ్చిందన్నారు. ఇటీవలి కాలంలో పిల్లలు పెద్దవారయ్యాక తమ తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వృద్ధులు దిక్కులేనివారవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు తాము రాసిన విల్, దానపత్రాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉందన్నారు. పట్టించుకోని పిల్లలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

స్టే తొలగించాలని రివిజన్ పిటిషన్

మైసూరు: సోషల్ మీడియాలో అనుచిత పోస్టు పెట్టిన కేసులో నిందితుడు సతీష్‌ను సరిహద్దు బహిష్కరణ చేయాలని పోలీసు శాఖ ఇచ్చిన నోటీసుపై కోర్టు విధించిన స్టేను తొలగించాలని కోరుతూ ఉదయగిరి స్టేషన్ పోలీసులు రివిజన్ పిటిషన్ వేశారు. వివరాలు.. వివాదాత్మక పోస్టుతో గొడవలకు కారకుడైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సతీష్ అలియాస్ పాండురంగను సరిహద్దు బహిష్కరణ చేయాలని పోలీసులు ఇచ్చిన నోటీసుపై జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు స్టే ఇచ్చింది. దీనిని తొలగించాలని పోలీసులు వేసిన పిటిషన్ విచారణ వేళ నిందితుని తరఫు న్యాయవాది భాస్కర్ స్టే తొలగింపునకు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిందితుడు సతీష్‌పై పోలీసులు వెలువరించిన సరిహద్దు బహిష్కరణ ఆదేశాలు చట్టవ్యతిరేకమని పునరుచ్ఛరించారు. ఈ ఆదేశాలను వెలువరించే ముందు ఎలాంటి నియమాలను పాటించలేదన్నారు. నిందితునిపై ఎలాంటి ఆరోపణలు లేవు, దర్యాప్తు నివేదిక కూడా లేదన్నారు. దీనికి తోడు నిందితునిపై ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు. అయినా ఎందుకోసం సరిహద్దు బహిష్కరణ నోటీసు ఇచ్చారో స్పష్టం చేయాలని పట్టుబట్టారు. వాదోపవాదాలను ఆలకించిన న్యాయమూర్తి ఈనెల 15కు తీర్పును రిజర్వ్ చేస్తూ కేసు తదుపరి విచారణను వాయిదా వేశారు.

బస్సు,బైక్ ఢీ.. ఒకరి మృతి



రోడ్డుపక్కకు దూసుకుపోయిన బస్సు

దొడ్డబళ్లాపురం: బస్సు,బైక్ ముఖాముఖి ఢీకొని బైకిస్టు మృతిచెందిన ఘటన దొడ్డ తాలూకా గుండంగెరె వద్ద చోటుచేసుకుంది. దొడ్డ పట్టణ నివాసి పునీత్ కుమార్(27)తన బైక్‌పై బంకేనహళ్లి వైపు నుంచి వస్తుండగా వాబసంద్ర–గుండంగెరె మార్గంలోని మలుపులో ఎదురుగా కేఎస్‌ఆర్టీసీ బస్సు వచ్చింది. రెండు వాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ పునీత్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ను తప్పించే ప్రయత్నంలో బస్సు రోడ్డుపక్కకు దూసుకుపోయింది.హొసహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని కూలీ ....

తుమకూరు: రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మరణించిన ఘటన జిల్లాలోని తిపటూరు తాలూకా మారనగెరె గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తాపీ పని చేసే నరసింహమూర్తి (31) మృతుడు. రైలు ఢీకొనడంతో నరసింహమూర్తి తలకు, వెన్నుకు తీవ్ర గాయాలై చనిపోయాడు. ఘటనపై అరసీకెరె రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రమాదమా, ఆత్మహత్య అనేది తేలాల్సి ఉంది.

మృతదేహం ఆస్పత్రికి తరలింపు

శివమొగ్గ: జిల్లాలోని సాగర తాలూకా ఆనందపుర గ్రామం రంగనాథ వీధి పక్కలోని భూమిక ఏజెన్సీ ఎదురుగా ఈనెల 6న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సదరు మహిళ నిద్రలోనే మరణించినట్లు తెలుస్తోంది. మృతురాలికి 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ప్రస్తుతం మృతదేహాన్ని మెగ్గాన్ ఆస్పత్రి శవాగారంలో ఉంచారు.

కనీస ఆటో చార్జీ రూ.40 గా నిర్ణయించండి

శివాజీనగర: రాష్ట్ర రాజధాని బెంగళూరులో 2 కిలోమీటర్ల దూరానికి కనీస చార్జీని రూ. 40కు పెంచాలని ఆటో డ్రైవర్లు పట్టుబట్టారు. ట్రాఫిక్ తూర్పు విభాగం డీసీపీ కార్యాలయంలో బుధవారం బెంగళూరు నగర ప్రాంతీయ రవాణా ప్రాధికార అధికారులు ఆటో మీటర్ ధర పెంపుపై సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్ల సంఘం ప్రముఖులు, ఓలా, ట్యాక్సీ ఫర్ ష్యూర్, ఉబర్ డ్రైవర్ల సంఘం నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రస్తుతం 2 కిలోమీటర్లకు మినిమమ్ చార్జి రూ. 30 ఉందని, ఆ మొత్తాన్ని రూ. 40కు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. అదే విధంగా మొబైల్‌లో మీటర్ వేసుకొని తిప్పే వాహనాలను స్వాధీనం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవా డిమాండ్ చేశారు.

కొట్టానికి నిప్పంటుకొని ఆవులు సజీవ దహనం

తుమకూరు: పశువుల కొట్టానికి నిప్పంటుకుని నాలుగు ఆవులు, ఒక దూడ సజీవదహనమైన ఘటన జిల్లాలోని కొరటగెరె తాలూకా తోవినకెరె గ్రామంలో చోటు చేసుకుంది. తోవినకెరె గ్రామానికి చెందిన కొండప్ప అనే రైతు పొలంలో కొట్టం ఏర్పాటు చేసుకొని పాడి పోషణ చేపట్టాడు. పశువులకు దోమల బెడద నివారించేందుకు కొట్టం పక్కనే పొగ పెట్టాడు. మంటలు కొట్టానికి వ్యాపించి అందులో కట్టివేసిన నాలుగు ఆవులు, ఒక దూడ సజీవదహనమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. తాలూకా పశు వైద్యాధికారి డాక్టర్ నాగభూషణ్, నాడ కార్యాలయం ఆర్‌ఐ ప్రతాప్, గ్రామాధికారి ఆనంద మఠ ఘటన స్థలాన్ని పరిశీలించారు.



మృత్యువాత పడిన దూడ

హోసూరు వార్తలు..

పంటల సాగుపై జాగృతి



తోటల వద్ద రైతులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా రాయకోట సమీపంలోని నెల్లూరు గ్రామంలో విత్తన, మందుల విక్రయ సంస్థల ద్వారా కాయగూరల సాగుపై రైతులకు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రాంతంలో రైతులు పండిస్తున్న టమాటా, బెండ, దోస, బీట్‌రూట్, క్యాప్సికం పంటల తోటలకు తీసుకెళ్లి సాగులో పాటించాల్సిన మెళకువలను వివరించారు. చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన 500 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగు దాడి



రైతుల పంటలపై దాడి చేస్తున్న ఒంటి ఏనుగు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని మరగట్ట అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగు మంద నుంచి ఓ ఏనుగు విడిపోయి రాత్రి వేళల్లో రైతుల పంటలపై దాడి చేస్తోంది. మరగట్ట అటవీ ప్రాంతంలో 20కి పైగా ఏనుగులు మకాం వేసి ఆ ప్రాంతంలో రైతులు పండిస్తున్న పంటలను పాడు చేస్తున్నాయి. మంగళవారం రాత్రి ఓ ఏనుగు మంద నుంచి విడిపోయి చామంతి తోట మీద పడి తొక్కివేసింది. లక్షలకు లక్షలు ఖర్చు పెట్టి పంటలు పండిస్తే పంట చేతికందే సమయంలో ఏనుగులు దాడి చేయడంతో నష్టపోతున్నామని రైతులు వాపోయారు. అటవీ శాఖ బాధిత రైతులకు పరిహారం అందజేయాలని కోరారు.

సౌకర్యాలు ఏవీ?



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

హోసూరు: క్రిష్ణగిరి యూనియన్‌లోని నార్లపల్లి పంచాయతీ ఎక్కల్‌నత్తం అటవీ ప్రాంత గ్రామంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ అటవీ ప్రాంత గ్రామానికి తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, రేషన్ దుకాణం, అంబులెన్స్ సేవలు కల్పించాలని కోరారు. వసతులు కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని అటవీ ప్రాంత గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచరించడం, అక్రమ మద్యం విక్రయాలపై అధికారులకు సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని.. యువతి ఆత్మహత్య

హోసూరు: దాదాపు 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడంతో ఆవేదన చెందిన యువతి ఆత్మహత్య చేసుకొంది. సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని బాలేతోటం ప్రాంతానికి చెందిన తమిళ్ తెన్నరసి (31), హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి ప్రాంతంలోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఇంత వయసు వచ్చినా సంబంధాలు కుదరక వివాహం జరగలేదు. తన తోటివారందరికీ పెళ్లిళ్లయి కుటుంబంతో ఉంటున్నారని మథనపడేది. ఆమె మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రథోత్సవ ఏర్పాట్ల తనిఖీ

హోసూరు: 14వ తేదీ జరగనున్న రథోత్సవం సందర్భంగా తేరుపేట ప్రాంతంలో ఏర్పాట్లను బుధవారం హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య, కమిషనర్ పరిశీలించారు. హోసూరు తేరుపేటలోని చారిత్రక ప్రసిద్ధ మరకతాంబ సమేత చంద్రచూడేశ్వర స్వామి తేరు వేడుక జరగనుంది. 14వ తేదీ హోసూరు, సూళగిరి, డెంకణీకోట, అంచెట్టి తాలూకాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలకు సెలవు ఇచ్చారు. ఉపమేయర్ ఆనందయ్య, ఎస్.ఎస్.మాదేశ్వరన్, క్రిష్ణవేణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్ నేతలతో యత్నాళ్ భేటీ

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రను ఆ పదవి నుంచి దించాలని అలుపెరుగకుండా ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ రెబల్ ఎమెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ బుధవారం బెంగళూరులో లింగాయత్ సామాజిక వర్గం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. బెంగళూరులోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఈ సమావేశం జరిగింది. విజయేంద్రను పార్టీ అధ్యక్ష స్థానం నుంచి దించేందుకు ఏ విధంగా ముందుకు సాగాలి, ఢిల్లీకి లింగాయత్ నేతల కమిటీని తీసుకువెళ్లే విషయాలపై ప్రధానంగా చర్చించారని తెలిసింది.

వ్యక్తి దుర్మరణం

క్రిష్ణగిరి: హోసూరు– క్రిష్ణగిరి హైవేలో టోల్‌గేట్ వద్ద పాదచారిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మరణించాడు. వివరాల మేరకు నడిచి వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిపై ఏదో వాహనం దూసుకెళ్లింది. అతడు తీవ్ర గాయాలేర్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాలూకా పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

బెంగళూరు కరగ ఉత్సవానికి రండి



ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

బనశంకరి: ప్రపంచప్రఖ్యాతి గాంచిన బెంగళూరు కరగమహోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ధర్మరాయ ఆలయ కమిటీ బుధవారం సీఎం సిద్దరామయ్యను ఆయన అధికారిక నివాసమైన కృష్ణాలో కలిసింది. కరగ మహోత్సవానికి విచ్చేయాలని ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో శాంతినగర ఎమ్మెల్యే, బీడీఏ అధ్యక్షుడు ఎన్‌ఏ.హ్యారీస్, కరగ పూజారి జ్ఞానేంద్ర, కాంగ్రెస్‌నేతలు, ధర్మరాయస్వామి ఆలయ కమిటీ పదాధికారులు పాల్గొన్నారు.

6 శాతం రిజర్వేషన్ అమలు చేయండి

శివాజీనగర: ఎస్సీ వర్గీకరణలో భాగంగా సుప్రీం కోర్టు తీర్పును పరిగణలోకి తీసుకొని న్యాయమూర్తి నాగమోహన్‌దాస్ ఏకసభ్య కమిషన్ ద్వారా మధ్యంతర నివేదిక తెప్పించుకొని మాదిగ, ఉప కులాలకు 6 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని మాదిగ దండోరా (ఎంఆర్‌పీఎస్) నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రాధ్యక్షుడు బీ.నరసప్ప దండోరా నేతృత్వంలో రిజర్వేషన్ అమలు బృందం సభ్యులు బుధవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ చేశారు. సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలుగా చేపట్టిన పోరాటాన్ని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం బి.నరసప్ప దండోరా విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ వర్గీకరణ అమలు అయ్యేవరకు ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయరాదన్నారు. అన్ని పదోన్నతి ఆదేశాలను రిజర్వేషన్ వర్గీకరణ జారీ అయ్యేవరకు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాదగ దండోరా ప్రధాన కార్యదర్శి జే.ఎం.దేవరాజ్, కార్యధ్యక్షుడు జే.ఎం.ఫర్నాండిస్ హిప్పళగావ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.రామకృష్ణ, అధికార ప్రతినిధి కత్తి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులను తప్పుదోవ పట్టించిన ఇద్దరిపై కేసులు

మైసూరు: నిందితులకు జామీను ఇప్పించే విషయంలో కోర్టులను తప్పుదోవ పట్టించిన ఇద్దరిపై లక్ష్మీపురం, సరస్వతీపురం పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వివరాలు.. చామరాజనగర నివాసి మాదేగౌడ, మైసూరు తాలూకా ఇలవాల ఫిర్కా జట్టిహుండి గ్రామానికి చెందిన సిద్ధప్పాజీలు ఒకే ఆస్తికి వేరే వేరే ఆధార్ కార్డులను సమర్పించి కోర్టును తప్పుదోవ పట్టించారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు సెషన్స్ కోర్టు పాలనాధికారి రమేష్ బీ.కులకర్ణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్‌ఆర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన పోక్సో కేసులో నిందితుడు సమీఉల్లాకు మాదేగౌడ హారదనహళ్లి సర్వే నెంబర్–397/4 ఆస్తి పత్రాన్ని జామీనుగా సమర్పించారు. సదరు పత్రాన్ని వేర్వేరు కోర్టుల్లో ఆధార్ కార్డులను దాఖలాలతో సహా వినియోగించి సమర్పించిన విషయం పరిశీలనలో బయట పడింది. దీంతో మాదేగౌడపై వంచన కేసు నమోదైంది. మరొక కేసులో కూడా మాదేగౌడ, ఇలవాల ఫిర్కా సిద్ధప్పాజీ కూడా ఇదే విధంగా ఆధార్ కార్డులను వినియోగించి మోసం చేశాడు. సరస్వతీపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఓ కేసుకు సంబంధించి రెండో నిందితుడైన యతీష్‌కు జామీను ఇచ్చాడు. సదరు ఆధార్ కార్డులను వేర్వేరు కోర్టుల్లో వినియోగించి కోర్టునే వంచించారనే ఆరోపణలపై కేసు నమోదైంది.


యువత పోరులో భాగంగా విజయవాడలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు



కడపలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరుకు తరలివచ్చిన అశేషప్రజానీకం

బాబు నయవంచనపై తిరుగుబాటు

యువత హోరు!

వైఎస్ జగన్ పిలుపుతో కదంతొక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండ్


'మెడికిల్ బాబు' అంటూ అనంతపురంలో ప్లకార్డును ప్రదర్శిస్తున్న విద్యార్థినులు


కర్నూలులో యువత పోరు కార్యక్రమానికి భారీగా హాజరైన విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


అనంతపురంలో జరిగిన 'యువత పోరు' ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు


ఒంగోలులో యువత పోరు ర్యాలీకి భారీగా తరలివచ్చిన విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు


తిరుపతిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువత

సాక్షి, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా తమను చదువులకు దూరం చేస్తున్న చంద్రబాబు సర్కారు కుట్రలపై విద్యార్థులు తిరగబడ్డారు. తమ బిడ్డల భవిష్యత్ కోసం తల్లితండ్రులు గర్జించారు. 20 లక్షల ఉద్యోగాలు.. లేదంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తామని నమ్మించి నట్టేట ముంచడంపై యువత పిడికిలి బిగించింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'యువత పోరు'కు మండుటెండలోనూ వెల్లువలా తరలివచ్చారు. విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులను రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పోలీసులు అడ్డగించి బెదిరింపులకు దిగినా వెరవలేదు. అన్ని జిల్లా కేంద్రాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'యువత పోరు' గ్రాండ్ సక్సెస్ అయ్యింది. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల వరకు చేపట్టిన ప్రదర్శనలు, బైక్ ర్యాలీల్లో వేలాదిగా విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులు కదం తొక్కారు. తక్షణమే గతేడాదికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద గతేడాదికి సంబంధించి కూటమి ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.3,200 కోట్లు.. ఈ ఏడాది ఇవ్వాల్సిన రూ.3,900 కలిపి మొత్తం రూ.7,100 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లే కేటాయించడంపై మండిపడ్డారు. పిల్లలను చదువులకు దూరం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ తీసుకొచ్చిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ.. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందకుండా చేయడమే కాకుండా వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయడంపై విద్యార్థులు, తల్లితండ్రులు మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక డీఎస్సీపై చేసిన తొలి సంతకమే మోసంగా మారిందని.. జాబ్ క్యాలెండర్ విడుదల లేదు.. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలనే ఊడబెరుకుతున్నారంటూ ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి కోసం గతేడాది బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేని.. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులు ర్యాలీల్లో నినదించారు. ఈమేరకు డిమాండ్లతో కూడిన పత్రాలను విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులతో కలిసి వైఎస్సార్‌సీపీ నేతలు కలెక్టర్లకు అందజేశారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా వేలాదిగా విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులు 'యువత పోరు'లో కదం తొక్కడం పది నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వం పాలనపై పెల్లుబుకుతున్న ప్రజావ్యతిరేకతకు అద్దం పట్టిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతేడాది డిసెంబర్ 13న అన్నదాతలపై సమస్యలపై నిర్వహించిన రైతు పోరు.. డిసెంబర్ 27న కరెంటు చార్జీల పెంపును నిరసిస్తూ చేపట్టిన విద్యుత్ పోరు తరహాలోనే యువత పోరు గ్రాండ్ సక్సెస్ కావడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.


చిత్తూరులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ప్రజలు


అనంతపురంలో కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగులు


నెల్లూరులో భారీ ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు


రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


గుంటూరులో యువత పోరు ర్యాలీకి పోటెత్తిన విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


తిరుపతిలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చంద్రబాబూ.. తొలి హెచ్చరిక

'ఎక్స్' వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం

"యువత పోరు"ను పోలీసులతో అడ్డుకోవడానికి మీ ప్రభుత్వం కుటిల యత్నాలు

సాక్షి, అమరావతి: విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్‌సీపీ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమాన్ని పలు చోట్ల పోలీసులతో అడ్డుకోవాలని యత్నించినా వాటన్నింటినీ అధిగమించి చంద్రబాబు ప్రభుత్వం పెడుతున్న కష్టాలపై నిలదీశారని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 'చంద్రబాబూ..! నిరుద్యోగులు, విద్యార్థులు మీకు పంపిన తొలి హెచ్చరిక ఇది' అని హెచ్చరించారు. 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. పలు సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులతో సహా అన్ని వర్గాలకూ పార్టీ ఎప్పుడూ తోడుగా నిలుస్తుందని 'ఎక్స్' వేదికగా భరోసా ఇస్తూ తన ఖాతాలో వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. అందులో ఏమన్నారంటే..



అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సైతం ఊడగొడుతున్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలంటే ఏటా రూ.7,200 కోట్లు చొప్పున ఖర్చు చేయాలి. కానీ గతేడాది బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయింపూ లేదు. ఈ ఏడాదికి కూడా ఒక్క పైసా కేటాయించలేదు. రెండేళ్లలో ప్రతి నిరుద్యోగికీ రూ.72 వేల చొప్పున బకాయి పడ్డారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందకుండా అడ్డుకుంటూ.. పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేస్తున్నారు.

- చంద్రబాబూ..! పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే మీ కుట్రలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యయుతంగా "యువత పోరు" ద్వారా గళమెత్తిన విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులపై పోలీసుల దౌర్జన్యాలను తీవ్రంగా ఖండిస్తున్నా. పోలీసులతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే యత్నాలను అధిగమించి సంవత్సరం కాలంగా మీ ప్రభుత్వం పెడుతున్న కష్టాలపై నిలదీశారు. నిరుద్యోగులు, విద్యార్థులు మీకు పంపిన తొలి హెచ్చరిక ఇది.
- పేదరికం కారణంగా ఎవరూ పెద్ద చదువులకు దూరం కాకూడదన్న దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం విద్యాదీవెన ద్వారా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ద్వారా హాస్టల్, మెస్ ఛార్జీలను నేరుగా తల్లులు, ఆ పిల్లల ఖాతాలకే జమ చేస్తూ అమలు చేసిన ఈ పథకాలను మీ ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చింది. చంద్రబాబూ..! మీ గత పాలనలోని చీకటి రోజులనే మీరు మళ్లీ తెచ్చారు.
- 2024 జనవరి – మార్చి త్రైమాసికానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను ఏప్రిల్‌లో వెరిఫై చేసి మే నెలలో చెల్లించాల్సి ఉంది. అక్కడి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రతి త్రైమాసికానికి రూ.700 కోట్ల చొప్పున ఏడాదికి రూ.2,800 కోట్లు ఇవ్వాలి. వసతి దీవెన కింద హాస్టల్ ఖర్చులకు మరో రూ.1,100 కోట్లు ఇవ్వాలి. ఈ రెండు పథకాలకు ప్రతి ఏడాదికి రూ.3,900 కోట్లు ఖర్చు చేయాలి. కానీ చంద్రబాబూ..! మీరిచ్చింది కేవలం రూ.700 కోట్లు మాత్రమే. అది కూడా ఇప్పటికీ పూర్తిగా పిల్లలందరికీ చేరలేదు. అంటే గతేడాది పిల్లలకు బాకీ పెట్టిన రూ.3,200 కోట్లు.. అది కాకుండా ఈ ఏడాది ఖర్చు చేయాల్సిన మరో రూ.3,900 కోట్లు.. రెండూ కలిపితే మొత్తం రూ.7,100 కోట్లు ఈ సంవత్సరం ఖర్చు పెట్టాలి. కానీ ఈ బడ్జెట్‌లో మీరు ప్రవేశపెట్టింది కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే. అంటే దీని అర్థం.. పేద విద్యార్థుల చదువులు, వారి బాధ్యత విషయంలో మీరు తప్పించుకుంటున్నట్లే కదా? ఆ పిల్లల జీవితాలను అంధకారంలోకి నెడుతున్నట్టే కదా? చదువుకుంటున్న పిల్లలకు ఇది మీరు చేస్తున్న ద్రోహం కాదా? విద్యార్థులను ఇంతగా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు చంద్రబాబూ?
- కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది కూడా కాకముందే మిమ్మల్ని ప్రశ్నిస్తూ నిరుద్యోగులు, ఇంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డెక్కడం ఎప్పుడైనా చూశారా చంద్రబాబూ? ప్రజల పక్షాన నిలుస్తూ, విద్యార్థుల సమస్యలపై చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూ "యువత పోరు" కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పిల్లలు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందర్నీ అభినందిస్తున్నా. విద్యార్థులతో సహా అన్ని వర్గాలకూ పార్టీ ఎప్పుడూ తోడుగా నిలుస్తుందని భరోసా ఇస్తున్నా.

దక్షిణ భారత అఖిలపక్ష నాయకుల సమావేశానికి వైఎస్ జగన్‌కు ఆహ్వానం

వైఎస్ జగన్‌ను కలిసిన తమిళనాడు పీడబ్ల్యూడీ మంత్రి ఈవీ వేలు, ఎంపీ విల్సన్.. 22న చెన్నైలో సమావేశం


వైఎస్ జగన్‌కు తమిళనాడు సీఎం స్టాలిన్ రాసిన లేఖను అందజేస్తున్న ఆ రాష్ట్ర మంత్రి వేలు, ఎంపీ విల్సన్

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను తమిళనాడు పీడబ్ల్యూడీ శాఖ మంత్రి ఈవీ వేలు, రాజ్యసభ ఎంపీ విల్సన్ కలిశారు. ఈనెల 22న చెన్నైలో నిర్వహించే దక్షిణ భారత అఖిలపక్ష నాయకుల సమావేశానికి వైఎస్ జగన్‌ను ఆహ్వానిస్తూ తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ రాసిన లేఖను వైఎస్ జగన్‌కు అందజేసి, దక్షిణ భారత అఖిలపక్ష నాయకుల సమావేశానికి ఆహ్వానించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ వివిధ రాష్ట్రాల సీఎంలు, వివిధ పార్టీల అధినేతలకు ఆహ్వానం పంపారు. దీన్లో భాగంగా తమిళనాడు డీఎంకే నేతలు వైఎస్ జగన్‌ను కలిశారు.

పట్టు నాడి పట్టుకోవడం కష్టం.
తాకితే... మృదువుగా ఉంటుంది.
పట్టుకుంటే మెత్తగా జారిపోతుంది.
అసలు పట్టును తెలుసుకోవడం ఓ పరీక్ష.
నకిలీని 'పట్టు' కోవడానికీ ఉందో పరీక్ష.



కల్యాణి

● సిల్క్ మార్క్

పట్టుకు పట్టం

మన అమ్మమ్మలు, నానమ్మలు పట్టుచీరలు కట్టుకున్నారు. పట్టుదారం మృదుత్వాన్ని ఆస్వాదించారు. పట్టు చీర కొనేటప్పుడు ఇది అసలుదా నకిలీదా అని తెలుసుకోవాల్సిన అవసరం ఆ తరానికి రాలేదు. ఎందుకంటే అప్పుడు పట్టుచీరలన్నీ అసలువే. అందుకే ప్రభుత్వం నియమాలు, నిబంధనల పట్టికలేవీ జారీ చేయలేదు. 'ఇది అసలైన పట్టు' అని ఒక గుర్తింపునిచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. నకిలీలు మార్కెట్‌లో రాజ్యమేలుతున్న తరుణంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిల్క్ మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా 2004, జూన్ 17వ తేదీన 'సిల్క్ మార్క్ లేబిల్' పేరుతో ఒక లోగోను ఆవిష్కరించింది. బంగారు ఆభరణాల స్వచ్ఛతను, కచ్చితత్వాన్ని నిర్ధారించడానికి నిర్దేశించిన 'బిఐఎస్ హాల్‌మార్క్' వంటిదే ఇది కూడా. సిల్క్‌మార్క్ లేబిల్ అంటే... సదరు పట్టు వస్త్రం అసలైన పట్టుదారంతో తయారైనదే అని నిర్ధారించే లేబిల్ అన్న మాట.

పట్టులు నాలుగే!

పట్టు పేరుతో మార్కెట్‌లో దొరికే వస్త్రాల్లో సగం అసలైన పట్టు వస్త్రాలు కాదు. అలాగే నేత విధానాలను కూడా పట్టులో రకాలుగానే వ్యవహరించడంలో నెలకొన్న అయోమయం అది. మనదేశంలో లభించే పట్టు రకాలు మల్బరీ, టస్సర్, ముగా, ఎరీ అనే నాలుగు. ఎనభై శాతం వస్త్రాలు మల్బరీ పట్టు ఆధారంగా తయారయ్యేవే. అన్నింటిలోకి మృదువైన పట్టు దారం కూడా మల్బరీదే. ఇక కంచిపట్టు, ధర్మవరం పట్టు, గద్వాల పట్టు, పోచంపల్లి పట్టు, పైఠానీ, బెనారస్ సిల్క్ అని పిలుచుకునే వన్నీ పట్టులో రకాలు కాదు. నేత విధానంలో రకాలు. ప్రపంచంలో ముప్పెక్కి పైగా దేశాల్లో పట్టు ఉత్పత్తి అవుతోంది. పట్టు ఉత్పత్తిలో చైనా తొలిస్థానంలో ఉంటే మనదేశం రెండవస్థానంలో ఉంది.

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు

పట్టుచీర మీద ఉన్న సిల్క్ మార్క్ లేబిల్ క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ చీరను తయారు చేసిన వీవర్ వివరాలతోపాటు షోరూమ్ వివరాలు కూడా తెలుస్తాయి. నకిలీ కోడ్‌లను గుర్తించడం ఎలాగో కూడా తెలుసుకోవాలి. ఇలాంటి మోసాలను అరికట్టడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. కానీ వినియోగదారుల్లో చైతన్యమే అసలైన నియంత్రణ.

పదివేల పురుగుల శ్రమ

ఒక పట్టుచీర తయారు కావాలంటే పదివేల పట్టుగూళ్లు కావాలి. పట్టు పురుగుల పెంపకం అంటే పసిపిల్లలను పెంచినట్లే. ఆ రైతు శ్రమ ఉంటుంది. ఆ తర్వాత పట్టుగూడు నుంచి దారం తీసే వాళ్ల శ్రమ. ఆ దారంతో మగ్గం మీద చీరను నేసే చేనేతకారుల శ్రమ. ఒక పట్టుచీర ధరలో పట్టు రైతుకు దక్కేది, దారం తీసిన వాళ్లకు దక్కేది, చేనేతకారులకు దక్కేది స్వల్పమే. శ్రమించకుండా భారీ ఆదాయం తీసుకునే వాళ్లు పట్టుదారం కొనే ట్రేడర్, పట్టుచీరను అమ్మే దుకాణదారులు మాత్రమే. చేనేతకారులు, దారం తయారు చేసే వాళ్లు మధ్య దళారుల దోపిడీకి గురవుతున్నారు.

బంగారు జరీ

ప్యూర్ బై ప్యూర్ పట్టు చీర అంటే సహజమైన పట్టు దారాన్ని వెండి లేదా బంగారు ద్రవంలో ముంచి తయారు చేసిన జరీతో నేసినది. ఒకప్పుడు అన్నీ ప్యూర్ బై ప్యూర్ పట్టుచీరలే. ఇప్పుడు హాఫ్‌ఫైన్ వస్తున్నాయి... అంటే పాలియెస్టర్‌ని వెండి లేదా కాపర్‌లో అద్దిన జరీతో తయారు చేసినవి. ఇక టెస్టెడ్ జరీ అంటే విస్కోస్‌ని కాపర్‌తో కోట్ చేస్తారు. గోల్డ్ జరీ పట్టుచీర కావాలంటే వీవర్‌కి డిజైన్‌ను బట్టి రెండు లేదా మూడు గ్రాముల బంగారం ఇచ్చి చేయించుకోవాలి.

నిప్పులాంటి పరీక్ష!

ఇక చీరను నేసిన దారం స్వచ్ఛమైన పట్టుదారమేనా లేక పట్టును పోలిన సింథటిక్ దారమా అనేది తెలుసుకోవడానికి ఫ్లేమ్ టెస్ట్ చేయాలి. చీరలో ఒక చివర నుంచి రెండు దారాలను కత్తిరించి తీసుకుని వాటిని వెలిగించాలి. దారం మెల్లగా కాలుతూ, కొంతకాలి ఆగిపోతూ, వెంట్రుక కాలిన వాసన వస్తూ, బూడిద మెత్తటి పొడిలా రాలితే అది స్వచ్ఛమైన పట్టుదారం. దారం వేగంగా కాలిపోతూ, పేపర్ కాలిన వాసనతో గరుకు బూడిద రాలితే అది నకిలీ పట్టు. కొన్నింటికి నకిలీ పట్టు దారాలను కాల్చినప్పుడు వ్యర్థం జిగురుగా ముద్దలా వస్తుంది. మరో విషయం ఏమిటంటే అసలైన పట్టుదారంతో నేసిన పవర్‌లూమ్ చీరకు సిల్క్ మార్క్ ఉంటుంది, ఉండాలి కూడా. ఎందుకంటే సిల్క్‌మార్క్ అనేది పట్టుకు కొలమానమే కానీ చేతితో నేసిన వాటిని పవర్ మగ్గం మీద నేసిన వాటినీ వర్గీకరించే వ్యవస్థ కాదు. సిల్క్‌మార్క్ ఉన్న చీరల్లో కూడా ఏది చేతితో నేసిన నేత, ఏది పవర్ లూమ్ మీద నేసిన చీర అనేది తెలుసుకోవడం కూడా ఓ కళ. సిల్క్‌మార్క్ ఉన్న పవర్‌లూమ్ చీర ధర సిల్క్‌మార్క్ ఉన్న చేనేత చీర ధరలో దాదాపు సగమే ఉండాలి. ఆ తేడాను గుర్తించాలి, గౌరవించాలి. అప్పుడే చేనేత కళ కొనసాగుతుంది.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో : ఎస్. ఎస్. ఠాకూర్

వ్యవస్థ ఉంది కానీ... అవగాహన లేదు!

నకిలీ పట్టు చీరలను అసలైన పట్టుచీరలుగా నమ్మిస్తున్న మోసాన్ని నివారించడం కోసం ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి సిల్క్ మార్క్ లేబిల్‌ని తయారు చేసింది. ఇది జరిగి పదేళ్లయినా ఈ విషయం తెలిసిన వాళ్లు ఒక్క శాతం కూడా లేరు. వినియోగదారులు చైతన్యం అయినప్పుడే ఈ మోసానికి అడ్డుకట్ట పడుతుంది. సిల్క్‌మార్క్ పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సిల్క్ మార్క్ లేబిల్‌నే నా బిజినెస్‌కి లోగోగా పెట్టుకున్నాను. ప్రతి ఒక్కరూ అసలైన పట్టుచీరలే కొనాలని చెప్పను. అసలైన పట్టుచీరకు అంత ధర పెట్టడం ఇష్టం లేని వాళ్లు పట్టును పోలిన సింథటిక్ చీర కొనుక్కోవడం తప్పుకాదు. అయితే ఆ విషయం తెలిసి చేయాలి తప్ప, అసలైన పట్టుచీరనే కొనుక్కున్నామనే భ్రమలో నకిలీ పట్టు చీరలను కొని మోసపోకూడదు. రెండేళ్లపాటు కంచి, వెంకటగిరి, ధర్మవరం, బనారస్, గద్వాల్‌వంటి చేనేతకారుల గ్రామాల్లో పర్యటించిన తర్వాత నాకు తెలిసిన విషయాలివి.

– కల్యాణి, రామి సిల్క్స్, హైదరాబాద్

న్యూస్ అలెర్ట్

ఉదయాన్నే రాగి సంగటి తినమంటారొకరు. తింటే దేంజరంటారొకరు. వేపాకులను తినేయండి అని ఒకరు. రావి ఆకుల జ్యూస్ అని ఒకరు. ఇటీవల ఆరోగ్యం మీద అందరికీ ఆసక్తి పెరిగింది. దానికి తగ్గట్టు యూట్యూబ్‌లో చిట్కాల వీడియోలు పెరిగాయి. అర్హతలు ఉన్నవారూ లేనివారూ చెప్పేది వింటే ప్రాణం మీదకు రావచ్చు. కేరళలోని కన్నూరులో ఓ 18 ఏళ్ల యువతి బరువు తగ్గడానికి కేవలం వేడినీళ్లు తాగుతూ అవయవాలు దెబ్బ తిని మరణించింది. పిల్లలను హెచ్చరించే మనం జాగ్రత్త పడాల్సిన సమయం ఇది.

యూట్యూబ్ సలహా ప్రమాదం కావచ్చు...



శ్రీనంద

ఆరోగ్య ప్రచారం మంచికోసం కాకుండా సబ్‌స్క్రయిబర్ల కోసం, వ్యూస్ కోసం సాగడం నేటి విషాదం. ఎలాంటి టిప్స్ చెప్పిస్తే వీడియోలు వైరల్ అవుతాయో చూస్తున్నారో తప్పితే చెబుతున్న విషయాలు ఎవరికి, ఎంతవరకు అవసరమో ఎవరికి కీడు చేస్తాయో చెప్పడం లేదు. ఆహార విధానాలు కూడా ఎప్పటికప్పుడు కొత్త సిద్ధాంతాలు లేవనెత్తుతూ అయోమయానికి గురి చేయడం నేడు చూస్తున్నాం. కోడిగుడ్డు పచ్చసొన కొందరు వద్దు అంటే కొందరు అదే మంచిది అంటారు. ఇలాంటి అయోమయం మధ్యలో ప్రత్యామ్నాయ ఆహార ప్రచారకర్తలు ముందుకు వచ్చి తాము నమ్మిన విధానాలను ప్రచారం చేస్తున్నారు. వీరు చేస్తున్న వీడియోలకు శాస్త్రీయ నిర్ధారణ ఏమిటి అన్నది ఎవరూ చూడటం లేదు. అలాగే చురుగ్గా, ఆరోగ్యంగా ఉండటమే కాకుండా 'సన్నగా' కనిపించడం అవసరం అనుకుంటున్నారు చాలామంది. సన్నగా అవడం అందరి శరీరతత్వాలకు సరిపడుతుందో లేదో వైద్య సలహా తీసుకోవడం లేదు. వీడియోలు చూసి బరువు తగ్గేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కేరళలో జరిగిన ఉదంతం ఈ విషయంలో హెచ్చరిక చేస్తోంది.

50 కిలోల నుంచి 24 కిలోలకు

కన్నూరు జిల్లా కలూరుపరయకు చెందిన 18 ఏళ్ల ఫస్ట్ ఇయర్ డిగ్రీ అమ్మాయి శ్రీనంద బరువు తగ్గిపోయి మాట్లాడలేని స్థితికి చేరుకోగా తల్లిదండ్రులు ఆమెను తలస్సెరి కోఆపరేటివ్ హాస్పిటల్‌కు తీసుకు వచ్చారు. ఆమెకు వైద్యం చేసిన డాక్టర్ ప్రభు మాట్లాడుతూ 'ఆమె బరువు 24 కేజీలు ఉంది. బి.పి. 70, ఆక్సిజన్ లెవల్ 70, బ్లడ్‌షుగర్ 45.. సోడియం, పొటాషియం లెవల్స్ పూర్తిగా పడిపోయాయి. ఆమె ఆరు నెలలుగా ఆహారం తినకుండా దాచేస్తోంది. మూడునెలలుగా యూట్యూబర్‌ను నమ్మి హాట్ వాటర్ మాత్రమే తీసుకుంటోంది. 50 కిలోల నుంచి మూడునెలల్లో 24 కిలోలకు వచ్చేసింది. ఇది ఆహారాన్ని నిరాకరించే 'అనొరెక్సియా' అనే మానసిక స్థితి. తల్లిదండ్రులు ఆ విషయాన్ని కనిపెట్టలేకపోయారు. ఇలాంటి వారిని ముందే గుర్తించి మానసిక వైద్యం చేయించాలి' అన్నారు. 'రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడం వల్ల ఆమె అంతర్గత అవయవాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వెంటిలేటర్ మీద ఉంచి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు' అని ఆయన తెలిపారు.

బాడీ షేమింగ్, వీడియోలు

ఇటీవల కాలంలో బాడీ షేమింగ్ వల్ల టీనేజర్లు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు దేశప్రధాని మన దేశంలో ఊబకాయం పెరిగిపోతోందని ఆందోళన చెందుతోంటే, అందుకు కారణాలను అర్థం చేసుకోకుండా ఊబకాయులను బాడీ షేమింగ్ చేస్తున్నారు కొందరు. టీనేజ్‌లో ఉన్న పిల్లలు సన్నబడాలని హటాత్తుగా బరువు తగ్గితే అది అవయవాల మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇలాంటి వారిని ఆకర్షించేలా యూట్యూబ్‌లో బోలెడన్ని వీడియోలు ఉంటున్నాయి. 'ఇలా చేస్తే వెంటనే బరువు తగ్గుతారు' అనే వీడియోలు నమ్మవద్దని పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉంది.

గుడ్డిగా నమ్మవద్దు

అలోపతిలోగాని ఆయుర్వేదంలోగాని లేదా ప్రత్యామ్నాయ వైద్య విధానాల్లోగాని కచ్చితమైన నిపుణులను కలిసి పూర్తిగా కేస్ హిస్టరీ చెప్పి సన్నబడటానికి లేదా బరువు తగ్గడానికి ప్రయత్నించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పచ్చి ఆకుకూరల, కాయగూరల జ్యూసులు తాగేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

నిపుణుల సలహా తప్పనిసరి



బరువు తగ్గడం అనేది మానసిక వైకల్యంగా మారే స్థితికి కొంతమంది చేరుకోవడం బాధాకరం. ఇలాంటి వారు యూట్యూబ్, ఇన్‌స్టా తదితర ప్లాట్‌ఫామ్స్‌లో తెలిసీ తెలియక చెప్పే సలహాలు నమ్మి నష్టపోతున్నారు. కేరళలో చనిపోయిన అమ్మాయి ఆరు నెలలు 'హాట్‌వాటర్' థెరపీ చేసింది. తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే ఏ ఇద్దరూ ఒకే విధంగా బరువు తగ్గరు. అందుకు వయసు, శరీర తత్వం, జన్యుపద్ధతి, జీవన విధానం... ప్రభావం చూపుతాయి. బరువు తగ్గించాలంటే ఎక్స్‌పర్ట్‌లు వ్యక్తిగతంగా వివరాలు తీసుకుని, మెడికల్ హిస్టరీ తెలుసుకొని, ఎటువంటి ఆహారం తీసుకోవాలో, వద్దో సూచిస్తారు. క్వాలిఫైడ్ డైటీషియన్స్‌ను వ్యక్తిగతంగా కలిసి డైట్ పాటించాలి తప్ప ఎవరూ ఇన్‌ఫ్లుయెన్సర్లు చెప్పే విధానాలకు దిగవద్దు.

– డా.వాణీ కత్తి, ఫుడ్‌సైన్స్ ఎక్స్‌పర్ట్

కిచెన్ టిప్స్

పెరుగు మిగిలిపోయిందా?

మిగిలిపోయిన పెరుగును తినడానికి ఇష్టపడని వారు.. దాన్ని పండ్ల రసాలు, స్మూతీస్ తయారీలోనూ వాడుకోవచ్చు. స్మూతీస్ చేసే క్రమంలోనే బ్లెండర్‌లో పండ్లు, తేనె, కొన్ని ఐస్‌ముక్కలతో పాటు కొద్దిగా పెరుగు వేసి బ్లెండ్ చేస్తే దాని రుచి పెరుగుతుంది.



- మటన్, చికెన్ వండే ముందు చాలా మంది మ్యారినేట్ చేస్తుంటారు. అయితే ఈ క్రమంలో పెరుగును కూడా కలిపితే మాంసం ముక్కలు మరింత మృదువుగా మారి త్వరగా ఉడకటమే కాదు, కూర రుచి మరింత పెరుగుతుంది.
- సలాడ్ గార్నిష్/డ్రస్సింగ్ కోసం కొత్తమీర/పుదీనా వంటి ఆకులు, వెల్లుల్లి ముక్కలు, నిమ్మరసం, ఆలివ్ నూనె వంటివి వాడుతుంటారు. అయితే క్రీమీగా చిలికిన పెరుగును వాటి పైనుంచి సన్నటి తీగలాగా పోస్తే సలాడ్ నోరూరిస్తుంది. ఇంకా తింటుంటే మధ్యమధ్యలో పుల్లపుల్లగా నోటికి తగులి టేస్టీగా ఉంటుందని అంటున్నారు.
- చిప్స్, క్రాకర్స్, కాల్చిన కాయగూర ముక్కలు, ఫ్రెంచ్ ఫ్రై స్ వంటి వాటిని వివిధ రకాల పదార్థాలతో తయారుచేసిన డిప్పింగ్ సాస్‌లో ముంచుకొని తింటుంటారు. అయితే ఈ డిప్స్ తయారీలో కొద్దిగా పెరుగును ఉపయోగిస్తే వాటి రుచి, చిక్కదనం పెరుగుతాయి.
- పెరుగుతో రుచికరమైన డిప్ తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం పెరుగును ఒక క్లాత్‌లో వేసి అందులోని నీటిని తీసేయాలి. ఆ తర్వాత దీన్ని బాగా చిలికితే క్రీమీగా తయారవుతుంది. ఇప్పుడు మీ రుచికి తగినట్లుగా చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి కలుపుకోవాలి. ఇష్టం ఉంటే సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, స్వీట్‌కార్న్ వంటివి జత చేసుకుంటే మరింత టేస్టీగా ఉంటుంది.

● మన(సు)లో మాట

ఎరక్కపోయి ఇరుక్కుపోయాను!

డాక్టర్ గారూ, నేను డిగ్రీ చదివి కానిస్టేబుల్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నాను. నాకు బాడీ బిల్డింగ్ అంటే చాలా ఇష్టం. ఒక సంవత్సరం క్రితం మా ఊర్లో ఉన్న ఒక ఫేమస్ జిమ్‌లో చేరాను. తొందరగా బాడీ పెరగడం కోసం 'టెర్మిన్' అనే ఇంజక్షన్ ఉంటుంది అని, అక్కడ పని చేసే ట్రెయినర్ ఒకతను చెబితే అది తీసుకోవడం మొదలు పెట్టాను. మొదట్లో చాలా బాగా అనిపించింది. జిమ్‌లో ఎంతసేపు వర్కవుట్స్ చేసినా అలసట వచ్చేది కాదు. నిద్రలేకపోయినా చాలా హుషారుగా ఉండేవాణ్ణి. కొన్నాళ్లకు ఇక ఇంజక్షన్ సరిపోయేది కాదు. రెండు నుంచి మూడు ఇంజక్షన్స్ తీసుకోవడం మొదలు పెట్టాను. దానివల్లేనేమో, ఆకలి బాగా తగ్గిపోయింది. బరువు తగ్గాను. బాగా చికాకుగా ఉంటోంది. ఇంజక్షన్ తీసుకోకపోతే పిచ్చెక్కినట్టు అనిపిస్తుంది. చెవిలో వింతవింత శబ్దాలు కూడా వినపడుతున్నాయి. ఎవరో నన్ను గమనిస్తున్నట్టు, నన్ను చంపడం కోసం వెంబడిస్తున్నట్టు అనిపిస్తుంది. ఆ భయంతో ఇంట్లో నుంచి బయటకు కూడా రాలేకపోతున్నాను. నా జీవితాన్ని నేను చేతులారా నాశనం చేసుకున్నానేమో అనిపిస్తుంది. దయచేసి నన్ను ఈ సమస్య నుంచి ఎలాగైనా బయట పడెయ్యండి.

– రమేష్, విశాఖపట్నం

ముందుగా మీ తప్పు మీరు తెలుసుకుని మారాలి అని అనుకుంటున్నందుకు మీకు నా అభినందనలు. మీరు పంచుకున్న ఈ సమస్య మీ ఒక్కరిదే కాదు. మన దేశంలో ఇటీవల చాలామంది యువత ఇలాంటి ఇంజెక్షన్స్‌కి అడిక్ట్ అయి బాధపడుతున్నారు. తమ అభిమాన నటుడు ఎవరో సిక్స్ ప్యాక్ శరీరం పెంచారని, తాము కూడా అలా పెంచుకోవాలిఅనే యావలో లేదా ఎవరినయినా ఇంప్రెస్ చేయాలనే ఉద్దేశ్యంతో జిమ్‌లలో చేరడం తొందరగా బాడీ పెంచాలనే ఉద్దేశ్యంతో అడ్డదారులైన ఇలాంటి ఇంజెక్షన్లను ఎంచుకుంటున్నారు. మీరు తీసుకున్న టెర్మిన్ ఇంజక్షన్ సైకోస్టిమ్యులెంట్ డ్రగ్ కిందకు వస్తుంది.


ఈ మందు మెదడులో సెరటోనిన్, డోపమైన్, నార్ అడ్రినలిన్ అనే రసాయనాలను ఎక్కువ మోతాదులో విడుదల అయ్యేలా చేస్తుంది. దానివల్ల వారికి అమితమైన బలం వచ్చినట్టు అనిపిస్తుంది. ఎంత పని చేసినా అలసట రాదు. దాంతో గంటలు గంటలు జిమ్‌లో వర్కవుట్స్ చేయగలుగుతారు. అయితే క్రమేణా కొంతకాలానికి శరీరం చల్లబడటం, బీపీ తగ్గిపోవడం, బాగా అలసటగా అనిపించడం జరుగుతుంది. బీపీ విపరీతంగా పెరగడం, ఆకలి మందగించటం, బరువు తగ్గిపోవడం, వెంట్రుకలు ఊడిపోవడం లాంటి దుష్ప్రభావాలు కనపడతాయి. ఒక్కోసారి గుండెలయలో మార్పులు వచ్చి ప్రాణం మీదికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. కొంతమందిలో చెవిలో మాటలు వినపడటం, విపరీతమైన మూడ్ స్వింగ్స్ రావడం చూస్తుంటాము. దీనినే సైకోసిస్ అంటారు. మీరు వీలైనంత తొందరగా ఒకసారి మానసిక వైద్యుడిని సంప్రదిస్తే ఈ సైకోసిస్ లక్షణాలను తగ్గించేలా సరైన వైద్యం చేసి తర్వాత అవసరమైతే కొంతకాలం పాటు మిమ్మల్ని రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచి కౌన్సెలింగ్, యోగ, ఇతరత్రా వైద్యవిధానాల ద్వారా పూర్తిగా ఈ అడిక్షన్ సమస్య నుంచి బయటకి తీసుకు రావచ్చు. ఆలస్యం చేయకుండా సైకియాట్రిస్టులను సంప్రదిస్తే మీ సమస్య పూర్తిగా తగ్గిపోతుంది. గుడ్‌లక్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

సిస్టర్ లైబ్రరీ





మహిళా రచయితల పుస్తకాలతో మహిళల కోసం మహిళలే నడుపుతున్న గ్రంథాలయం ఒకటి ఉంది తెలుసా? ఇది ముంబై లోని వెస్ట్ బాంద్రాలో ఉంది. అదే సిస్టర్ లైబ్రరీ. దీన్ని దేశంలోనే తొలి ఫెమినిస్ట్ లైబ్రరీగా చెప్పుకోవచ్చు. 2019లో ప్రారంభమైంది ఇది.

ఎలా?


ఎక్వీ థామీ

ముంబైలో 'బాంబే అండర్ గ్రౌండ్' పేరుతో ఆర్టిస్ట్ కలెక్టివ్ గ్రూప్ ఒకటుంది. నగరంలోని పలుచోట్ల తాత్కాలిక రీడింగ్ స్పేస్‌ని ఏర్పాటు చేసి.. పుస్తకాలతోపాటు తోటివాళ్లతో జనాలు సమయం వెచ్చించేలా చూడ్డం ఈ గ్రూప్ విధుల్లో ఒకటి. ఆ పనిలోనే ఉన్నప్పుడు ఈ గ్రూప్ సభ్యురాలైన ఎక్వీ థామీకి రీడింగ్ స్పేస్‌లో సమావేశమైన వారెవ్వరూ మహిళా రచయితల పుస్తకాలు చదువుతున్నట్టు కనిపించలేదు. అసలు తానెన్ని చదువుతుందో తేల్చుకోవాలనుకుంది ముందు. ఇంటికెళ్లి తన బుక్ ర్యాక్‌లో చూసుకుంటే మహిళా రచయితల పుస్తకాలు కనీసం 20 శాతం కూడా లేవు. అప్పుడు డిసైడ్ చేసుకుంది ఎక్వీ మహిళా రచయితల పుస్తకాలు చదవాలని. దేశంలోనే కాదు ప్రపంచ సాహిత్యంలో మహిళా రచయితల రాసిన పుస్తకాలన్నిటినీ సేకరించడం మొదలుపెట్టింది. అలా కేవలం మహిళా రచయితల పుస్తకాలతోనే నిండిపోయిన తన పర్సనల్ లైబ్రరీలోంచి స్నేహితులూ పుస్తకాలు అరువు తీసుకోసాగారు. ఆ డిమాండ్ చూసి నిశ్చయించుకుంది ఫెమినిస్ట్ లైబ్రరీ స్టార్ట్ చేయాలని. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. 2018లో ఆమెకు ఫైన్ ఆర్ట్ అవార్డ్ వచ్చింది. దానికింద అందిన రొక్కంతో దేశంలోని ప్రముఖ నగరాలను పర్యటించి మహిళా రచయితలు రాసిన నవలలు, వ్యాస సంపుటాలు, ఉద్యమ రచనలు, ఆర్ట్ పుస్తకాలు, మహిళాపత్రికలు వంటి వెయ్యి పుస్తకాలను సేకరించింది. వాటితోనే 'సిస్టర్ లైబ్రరీ'ని ప్రారంభించింది. 'సాహిత్య, కళా రంగాల్లో మహిళల కృషిని తెలియజేయడానికే ఈ లైబ్రరీని స్థాపించినా.. ఈ ప్రయాణ క్రమంలో అనిపించింది అసలు సృజన రంగంలో మహిళలు పంచిన జ్ఞానాన్ని, వాళ్లు సాధించిన స్థానాన్నీ ప్రపంచం గ్రహించేలా చేయాలని! ఇప్పుడా లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నాను' అని చెబుతుంది ఎక్వీ. ఈ లైబ్రరీకి దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు రంగాల్లోని మహిళలంతా తమ వంతు సాయం చేస్తున్నారు. విరాళాల నుంచి క్రౌడ్‌ఫండింగ్ దాకా ఇందులో పుస్తకాల కోసం ధన సహాయమూ అందుతోంది. ఫెమినిస్ట్ లైబ్రరీ ఆవశ్యకతను చాటడానికి, స్ఫూర్తి పంచడానికి సిస్టర్ లైబ్రరీ సభ్యులు దేశ, విదేశీ పర్యటనలూ చేస్తున్నారు.

దీంతోపాటు దేశంలో మహిళలే నిర్వహిస్తున్న చంపక బుక్‌స్టోర్ (బెంగళూరు), వాకింగ్ బుక్ ఫెయిర్స్ బుక్‌స్టోర్ అండ్ మొబైల్ లైబ్రరీ (భువనేశ్వర్), ట్రిలాజీ క్యురేటెడ్ బుక్ షాప్ అండ్ లైబ్రరీ (ముంబై)

స్టోరీటెల్లర్ బుక్‌స్టోర్ (కోల్‌కత్తా), వన్ అప్ లైబ్రరీ, బుక్‌స్టోర్ స్టూడియో అండ్ లర్నింగ్ ల్యాబ్(ఢిల్లీ), సిస్టర్స్ ఆఫ్ ద పీపుల్ (ఢిల్లీలోని చారిటీ బుక్ స్టోర్) లాంటి బుక్ స్టోర్స్, లైబ్రరీలు ఉన్నాయి.

రెండో సీడ్ జోడీకి యూకీ బాంబ్రీ ద్వయం షాక్



కాలిఫోర్నియా: తన కెరీర్‌లో ఆడుతున్న తొలి మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ జోరు కొనసాగుతోంది. ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 సిరీస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-ఆండ్రీ గొరాన్సన్ (స్వీడన్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ-గొరాన్సన్ జంట 6-2, 5-7, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో రెండో సీడ్, ప్రపంచ మూడో, నాలుగో ర్యాంకుల్లో ఉన్న హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్)-హెలియోవారా (ఫిన్‌లాండ్)లను బోల్తా కొట్టించింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గొరాన్సన్ ఒక ఏస్ సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. వాస్తవానికి ఈ టోర్నీలో తమ ర్యాంకింగ్ ప్రకారం యూకీ-గొరాన్సన్‌లకు క్వాలిఫయింగ్‌తోపాటు మెయిన్ 'డ్రా'లోనూ చోటు దక్కలేదు. అయితే మెయిన్ 'డ్రా'లో ఉన్న మార్కోస్ గిరోన్-లెర్నర్ టియెన్ (అమెరికా) చివరి నిమిషంలో వైదొలగడంతో 'రిజర్వ్' పూల్‌లో ఉన్న యూకీ-గొరాన్సన్‌లకు ఈ టోర్నీలో ఆడే అవకాశం లభించింది. క్వార్టర్ ఫైనల్ చేరడంతో యూకీ బాంబ్రీ-గొరాన్సన్‌లకు 65 వేల డాలర్ల (రూ. 56 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు ఖరారయ్యాయి.



ఆబిద్ అలీ అస్తమయం

టీమిండియాకు 34 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం ● భారత్ తరఫున వన్డేల్లో తొలి బంతి వేసిన ఘనత

సాక్షి, హైదరాబాద్: భారత మాజీ క్రికెటర్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఆబిద్ అలీ (83) కన్నుమూశారు. సుదీర్ఘ కాలంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఆయన అక్కడే తుది శ్వాస విడిచారు. 1960వ, 1970వ దశకాల్లో భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా ఆయన తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన ఆబిద్ అలీ అంతర్జాతీయ కెరీర్ ఎనిమిదేళ్ల పాటు సాగింది. 1967-1975 మధ్య కాలంలో భారత్ తరఫున 29 టెస్టుల్లో ఆయన 20.36 సగటుతో 1018 పరుగులు చేశారు. ఇందులో 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. మీడియం పేసర్ అయిన అలీ 42.12 సగటుతో 47 వికెట్లు కూడా పడగొట్టారు. ఆయన వన్డే కెరీర్ 5 మ్యాచ్‌లకే పరిమితమైంది. 5 వన్డేలు కలిపి ఆయన 93 పరుగులు చేయడంతోపాటు 7 వికెట్లు తీసుకున్నారు. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆబిద్ అలీకి ఘనమైన రికార్డు ఉంది. ఏకంగా 212 మ్యాచ్‌లు ఆడిన ఆయన 8732 పరుగులు చేయడంతో పాటు 397 వికెట్లు తీశారు. రిటైర్మెంట్ తర్వాత ఆబిద్ అలీ కొన్నేళ్ల పాటు విరామం తీసుకున్నారు. ఆ తర్వాత కోచింగ్ వైపు మళ్లారు. ఆంధ్ర రంజీ టీమ్‌తో పాటు యూఏఈ, మాల్దీవ్స్ జట్లకు ఆబిద్ అలీ కోచ్‌గా వ్యవహరించి మంచి ఫలితాలు సాధించారు. అమెరికాలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న తర్వాత అక్కడి నార్త్ అమెరికా క్రికెట్ లీగ్‌లో ఆటను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు.



"చాలా విషాదకర వార్త. ఆబిద్ అలీ జట్టు కోసం ఏదైనా చేయడానికి సిద్ధపడే దమ్మున్న క్రికెటర్. మిడిలార్డర్‌లో ఆడుతున్నప్పుడు కూడా జట్టు అవసరం కోసం ఓపెనింగ్‌కు కూడా సిద్ధమయ్యాడు. భారత స్పిన్నర్ల బౌలింగ్‌లో లెగ్ సైడ్‌లో అతను అందుకున్న చురుకైన క్యాచ్‌ల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. టెస్టుల్లో తొలి బంతికే అతను వికెట్ తీసిన రెండు సందర్భాలు నాకు గుర్తున్నాయి. నా తొలి టెస్టులో వికెట్ల మధ్య అతను చురుగ్గా పరుగెత్తిన తీరు ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచడం నాకు బాగా గుర్తుంది. వ్యక్తిగతంగా కూడా చాలా మంచి మనిషి.

– సునీల్ గావస్కర్


హైదరాబాదీ ఆల్‌రౌండర్

'ఆబిద్ అలీ తరహా ఆటకు వన్డే క్రికెట్ సరిగ్గా సరిపోయింది. ఈ ఫార్మాట్‌లో అతను అత్యుత్తమ ఆటగాడిగా నిలిచేవాడు. కానీ దురదృష్టవశాత్తూ 20 ఏళ్లు ముందుగా అతను పుట్టాడు'... ఆబిద్ అలీ గురించి, ఆయన ఆట గురించి బాగా తెలిసిన సన్నిహితులు చెప్పే మాట ఇది. స్ప్రింటర్‌లో ఉండే చురుకుదనం, మారథాన్ రన్నర్ తరహాలో శ్రమించే తత్వం, డెకాథ్లెట్ తరహాలో పట్టుదల ఆయనలో కనిపించేది. ఆటపరంగా చూస్తే మీడియం పేస్ బౌలింగ్, లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు చేయగల సామర్థ్యం, అద్భుత ఫీల్డింగ్‌తో ఒక వన్డే క్రికెటర్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఆబిద్‌లో ఉండేవి. వికెట్ల మధ్య పరుగెత్తే చురుకుదనం గురించి ప్రత్యేక ప్రశంస వినిపించేది. అవతలి ఎండ్‌లో ఆబిద్ ఉంటే సహచర బ్యాటర్ కూడా ఆయనతో పోటీ పడి పరుగెత్తలేక జాగ్రత్త పడేవాడు. సౌత్‌జోన్ తరఫున ఆడుతున్నప్పుడు దిగ్గజం గుండప్ప విశ్వనాథ్‌కు కూడా ఇదే అనుభవం ఎదురై రనౌట్ కావాల్సి వచ్చింది. అయితే ఆబిద్ వన్డే కెరీర్ వేర్వేరు కారణాలతో 5 మ్యాచ్‌లకే పరిమితమైంది. భారత జట్టు తొలి వన్డే మ్యాచ్ (1974 జూలై 13న, ఇంగ్లండ్‌తో లీడ్స్‌లో) ఆడిన జట్టులో భాగంగా ఉన్న ఆయన తొలి బంతిని బౌల్ చేసిన చిరస్మరణీయ ఘనతను సొంతం చేసుకున్నారు. తొలి వన్డే వరల్డ్‌కప్‌లో (1975) భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 98 బంతుల్లో 70 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచినా... అనూహ్యంగా అదే ఆఖరి వన్డే కూడా అయింది. ఇవన్నీ కూడా భారత జట్టుకు తొలి ఐదు వన్డేలే కావడం గమనార్హం.

మరచిపోలేని ప్రదర్శనలు...

1971లో ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు తొలిసారి టెస్టు సిరీస్ నెగ్గింది. తొలి రెండు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగియగా, ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో గెలిచి భారత్ సిరీస్ సొంతం చేసుకుంది. ఈ చారిత్రాత్మక మ్యాచ్‌లో చివరి రోజు 'విన్నింగ్ షాట్' బౌండరీ కొట్టిన బ్యాటర్‌గా ఆబిద్ అలీ అందరికీ గుర్తుండిపోయారు. 1971లో వెస్టిండీస్‌పై పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో భారత్ గెలిచి ఆపై తొలిసారి సిరీస్ సొంతం చేసుకున్న చిరస్మరణీయ టెస్టులో వరుస బంతుల్లో రోహన్ కన్హాయ్, క్లయివ్ లాయిడ్‌లను అవుట్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అదే సిరీస్‌లో జార్జ్‌టౌన్ టెస్టులో చేసిన అజేయ అర్ధ సెంచరీ కూడా ఆయన బ్యాటింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆడిన 29 టెస్టుల్లో 7 టెస్టుల్లో ఓపెనర్‌గా బ్యాటింగ్ చేయడంతో పాటు ఓపెనింగ్ బౌలర్‌గా కూడా ఆడిన ఘనత ఆబిద్ అలీ సొంతం.

1971లో ఇంగ్లండ్‌పై విన్నింగ్ షాట్ అనంతరం...





1971లో ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్ నెగ్గిన భారత జట్టు సభ్యుడిగా ఆబిద్ అలీ (సర్కిల్ చేసిన వ్యక్తి)

అరంగేట్రంలోనే సత్తా చాటి...

హైదరాబాద్‌లో స్కూల్ క్రికెట్ ద్వారా వెలుగులోకి వచ్చిన గత తరం క్రికెటర్లలో ఆబిద్ అలీ ఒకరు. స్కూల్ టోర్నీల్లో ప్రదర్శన ద్వారా హైదరాబాద్ జూనియర్ జట్టులోకి, ఆపై ఉద్యోగరీత్యా స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ తరఫున ప్రదర్శనతో హైదరాబాద్ సీనియర్ టీమ్‌లోకి ఆయన ఎంపిక అయ్యారు. దేశవాళీలో నిలకడైన ప్రదర్శన ఆబిద్ అలీకి భారత జట్టులో చోటు దక్కేలా చేసింది. 1967లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో టెస్టుతో ఆయన కెరీర్ మొదలైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి అత్యుత్తమ ప్రదర్శనతో ఆయన అరంగేట్రం చేశారు. ఇదే సిరీస్‌లో సిడ్నీ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో 78, 81 స్కోర్లతో టాప్ స్కోరర్‌గా తన ముద్ర వేస్తూ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటారు. ఆ తర్వాత వరుసగా ఏడేళ్ల పాటు ఆబిద్ కెరీర్ నిరాటంకంగా సాగింది. తన మీడియం పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న ఆబిద్‌కు అప్పటి పరిస్థితుల్లో పెద్దగా బౌలింగ్ చేసే అవకాశాలు రాలేదు. ప్రఖ్యాత భారత స్పిన్ చతుష్టయం శాసిస్తున్న ఆ రోజుల్లో మీడియం పేసర్లు ఆరంభంలో కొన్ని ఓవర్లు బౌలింగ్ వేసి బంతిని కాస్త పాతబడేలా చేయడమే ఉండేది. అక్కడితోనే వారి పని ముగిసేది. అయితే బ్యాటింగ్‌లో మాత్రం చాలా సందర్భాల్లో ఆబిద్ తన ముద్ర వేశారు. ముఖ్యంగా జట్టు అవసరాల కోసం 1 నుంచి 9 వరకు (నాలుగో స్థానం మినహా) అన్ని స్థానాల్లో ఆయన బ్యాటింగ్ చేశారు.

సింధు ఆరో 'సారీ'

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో మళ్లీ తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్



బర్మింగ్‌హమ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధు మళ్లీ నిరాశపరిచింది. ఈ మెగా టోర్నీలో ఆమె ఆరోసారి తొలి రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు 61 నిమిషాల్లో 21-19, 13-21, 13-21తో ప్రపంచ 21వ ర్యాంకర్ కిమ్ గా యున్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. తొలి గేమ్ నెగ్గిన సింధు, ఆ తర్వాత తడబడి వరుసగా రెండు గేమ్‌లను చేజార్చుకుంది. 13వసారి ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ఆడిన సింధు 2012, 2014, 2016, 2019, 2023లలో కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. 2017, 2020లలో క్వార్టర్ ఫైనల్ చేరిన సింధు... 2018, 2021లలో సెమీఫైనల్లో... 2013, 2022, 2024లలో రెండో రౌండ్‌లో పరాజయం పాలైంది.

రుత్విక-రోహన్ జోడీ గెలుపు



మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక-రోహన్ కపూర్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో రుత్విక-రోహన్ ద్వయం 21-10, 17-21, 24-22తో ప్రపంచ 41వ ర్యాంక్ జోడీ యె హోంగ్ వె-నికోల్ గొంజాలెజ్ చాన్ (చైనీస్ తైపీ)పై నెగ్గింది. మరోవైపు మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్న గాయత్రి-ట్రెసా జాలీ 21-17, 21-13తో సుంగ్ షువో యున్-యు చియెన్ హుయ్ (చైనీస్ తైపీ)లపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● కల్యాణ్ రామ్

యుద్ధం ఆరంభం

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా, విజయశాంతి మరో ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో అర్జున్ పాత్రలో కల్యాణ్ రామ్, వైజయంతి పాత్రలో విజయశాంతి నటిస్తున్నారని తెలుస్తోంది. కాగా 'అర్జున్ బ్యాటిల్ బిగిన్స్' అంటూ ఈ నెల 14న ఈ సినిమా ప్రీ టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్లుగా మేకర్స్ ప్రకటించి, కల్యాణ్‌రామ్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''టాకీ పార్టు పూర్తయింది. మిగిలిన షూట్ కూడా పూర్తయ్యాక రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా ఇది తల్లీకొడుకుల బలమైన భావోద్వేగాల నేపథ్యంలో సాగే యాక్షన్ ఫిల్మ్ అని తెలుస్తోంది. సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్, 'యానిమల్' ఫేమ్ పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



● అఖిల్

లెనిన్ లవ్‌స్టోరీ

'ఏజెంట్' మూవీ తర్వాత అఖిల్ కొత్త చిత్రానికి సంబంధించిన సమాచారం ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ కిరణ్ మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో అఖిల్ హీరోగా 'లెనిన్' అనే చిత్రం రూపొందుతోందనే ప్రచారం జరుగుతోంది. ఇందులో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారట. ఇది చిత్తూరు నేపథ్యంలో సాగే గ్రామీణ యాక్షన్ లవ్‌స్టోరీ ఫిల్మ్ అని, ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైందని సమాచారం. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 14న హైదరాబాద్‌లో ప్రారంభం అవుతుందని, దాదాపు ఇరవై రోజులు పాటు షూటింగ్ కొనసాగుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.



● విశ్వ కరుణ్, రుక్సార్, కిరణ్ అబ్బవరం, ఖ్యాతీ డేవిసన్

కొత్త కిరణ్‌ని చూస్తారు

– దర్శకుడు విశ్వ కరుణ్

''సినిమా ఇండస్ట్రీపై ఓ నమ్మకంతో ఇక్కడికి వచ్చి... కష్టాలు పడలేక ఎంతో మంది తిరిగి వెళ్లిపోవడం చూశాను. మీరు ధైర్యంగా ఉండండి... తప్పకుండా నాలా మీరు కూడా సంతోషంగా ఉండే రోజు వస్తుంది. సినిమా మీద ప్యాషన్‌తో పల్లెల నుంచి హైదరాబాద్‌కి వచ్చేవారిలో ఓ పదిమందికి ఏటా సాయం చేస్తాను... అది వసతి అయినా సరే లేకుంటే భోజనం కానీ, అవకాశాలు కానీ... నా చేతనైన సాయం వారికి చేస్తాను'' అని కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, రుక్సార్ ధిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్ రూబా'. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''నా ప్రతి సినిమాలో 40 నుంచి 50 మంది కొత్తవాళ్లకు అవకాశాలు కల్పిస్తున్నాను. ఇకపైనా చాన్స్ ఇస్తాను'' అన్నారు. విశ్వ కరుణ్ మాట్లాడుతూ– ''దిల్ రుబా'లో కొత్త కిరణ్‌ని చూస్తారు'' అని పేర్కొన్నారు. ''ఎంతోమంది మా 'దిల్ రూబా'ని రిలీజ్ చేస్తామని అడిగినా మూవీపై నమ్మకంతో సొంతంగా మేమే విడుదల చేస్తున్నాం'' అని రవి తెలిపారు. ''ఈ మూవీతో కిరణ్‌గారికి, మా టీమ్‌కి మంచి విజయం దక్కుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు రాకేశ్ రెడ్డి.

ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా గద్దర్ అవార్డులు


● 2014 నుంచి 2023 వరకూ బెస్ట్ ఫిల్మ్‌కి అవార్డు ప్రదానం
● ఉర్దూ సినిమానీ ప్రోత్సహిస్తాం

– తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజు



''తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లో 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' (టీఎఫ్ఏ) అందించనుంది. ఈ అవార్డుల కోసం ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. నర్సింగరావుగారు చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో వైస్ చైర్మన్‌గా నేను ఉన్నాను. అవార్డులు ఎలా ఇవ్వాలి? ఏం చేయాలి? అని పలుమార్లు సమావేశమై విధి విధానాలు తయారు చేశాం'' అని తెలంగాణ చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ (టీఎఫ్‌డీసీ), నిర్మాత 'దిల్' రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని టీఎఫ్‌డీసీ కార్యాలయంలో 'దిల్' రాజు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ– ''2024లో సినిమాలు నిర్మించిన నిర్మాతలకి గైడ్‌లైన్స్ అందించేందుకు ఎఫ్‌డీసీ ద్వారా వివరాలు చెబుతున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు ఎలాంటి అవార్డులు ఉన్నాయో వాటిని అలాగే ఉంచుతూ ఒకటి రెండు మార్పులు చేయడం జరిగింది. మెజారిటీ అన్నీ అలాగే ఉన్నాయి. దాంతో పాటు పైడి జయరాజ్, కాంతారావుగార్ల పేరుతో గౌరవ పురస్కారాలు అందిస్తాం. అంతే కాకుండా ఉర్దూ సినిమాలను కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఒక బెస్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వనున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో మనకు నంది అవార్డులున్నాయి. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయింది. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ 31 వరకూ విడుదలైన చిత్రాల్లో ప్రతి ఏడాది ఒక ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మన తెలుగు సినిమాకి అవార్డులు మిస్ అవకుండా ఉండాలని ప్రతి ఏడాదికి ఒక బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ ఇచ్చేలా నిర్ణయించాం. 2024కు సంబంధించి కొన్ని మార్పులు చేర్పులతో పాత రోజుల్లోని అవార్డుల ప్రక్రియనే కొనసాగిస్తాం. దరఖాస్తులను వెంటనే స్వీకరించి, స్క్రూటినీ చేసి, జ్యూరీని కూడా ఫైనలైజ్ చేసి ఏప్రిల్‌లో ఈ అవార్డుల పంపిణీని అంగరంగ వైభవంగా చేయాలని ప్రభుత్వం ఆశిస్తోంది. అందుకు ఎఫ్‌డీసీ తరఫున ఇండస్ట్రీ నుంచి చాలా మందిని జ్యూరీలాగా తీసుకుని బెస్ట్ ఈవెంట్ చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. దాన్ని మేం పూర్తి చేయాలని ఈ రోజు నుంచే కంకణం కట్టుకున్నాం. అలాగే 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సింహా అవార్డుల కోసం కొంతమంది ఎఫ్‌డీసీకి దరఖాస్తులతో పాటు కొంత డబ్బు చెల్లించారు... ఆ డబ్బును వారికి తిరిగి ఇచ్చేస్తాం. ఎందుకంటే 2024కి మనం పూర్తి స్థాయిలో అన్ని రకాల అవార్డులను ప్రదానం చేయనున్నాం కాబట్టి వారి డబ్బులు ఇచ్చేస్తాం. డబ్బులు చెల్లించిన వారు అవార్డుల విషయాన్ని ఎలాంటి వివాదం చేయకూడదని కోరుకుంటున్నాం. తెలంగాణ రాష్ట్రం నుంచి మళ్లీ అవార్డులు వస్తున్నాయి కాబట్టి అందరూ పాజిటివ్‌గా అనుకుని ఈ వేడుకని విజయవంతం చేస్తే... ప్రతి ఏడాది ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో అద్భుతంగా జరుగుతుంది. వారంలో అన్ని జ్యూరీలు ఫైనలైజ్ అవుతాయి, వారంలో దరఖాస్తులు స్వీకరించడం కూడా పూర్తవుతుంది. ఇది పూర్తవగానే జ్యూరీ సభ్యులు వారి పని మొదలుపెడతారు. ఏప్రిల్‌లో అవార్డుల పంపిణీ ఉంటుంది. అవార్డుల విషయంలో ఇది కేవలం ఆరంభం మాత్రమే. నెక్ట్స్ అప్‌డేట్స్ గురించి మళ్లీ మళ్లీ మాట్లాడుకుందాం. మొదటి అడుగులోనే రకరకాల ఆలోచనలు ఎందుకు? తొలిసారి అవార్డు వేడుక చేస్తున్నాం... సక్సెస్ అయిందంటే ప్రతి ఏడాది దాన్ని ఎలా చేయాలని ఆలోచించి, బాగా చేయాలి. ఏప్రిల్‌లో నిర్వహించబోయే వేడుక అద్భుతంగా ఉంటుంది. 'సినిమాకి సంబంధించి హైదరాబాద్‌ని ఇంటర్నేషనల్ హబ్ చేయాలంటే ఏం చేయాలి?' అని ఒక ప్రపోజల్ ఇవ్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు నాకు చెప్పారు... దీనిపై ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. గద్దర్ అవార్డుల పంపిణీ పూర్తవగానే ఆ కార్యక్రమంపై దృష్టి సారిస్తాం. గద్దర్ అవార్డు నమూనా సిద్ధమవుతోంది. అవార్డులనేవి ఎవరైనా ఇవ్వొచ్చు... ఫిల్మ్ ఛాంబర్ కూడా ఇస్తుంది. దాన్ని ప్రభుత్వానికి పోటీ అనడం తప్పు. ప్రభుత్వం అనేది అవార్డులు ఇస్తున్నప్పుడు ఎవరైనా వస్తారు... స్వీకరిస్తారు. ఎందుకంటే అది ప్రత్యేకమైన అవార్డు. మనం ఏ పని చేసినా 51 శాతం పాజిటివ్‌గా ఉంటే చాలు. 49 శాతం నెగటివ్‌గా మాట్లాడేవాళ్లు ఎలాగూ ఉంటారు'' అన్నారు.

మనం తెలుసుకోవాల్సిన నిజమే కోర్ట్



– రామ్ జగదీశ్

''కోర్ట్' కథని నానిగారు దాదాపు రెండున్నర గంటలు సింగిల్ సిట్టింగ్‌లో విన్నారు. కథ విన్నాక నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి... 'వెల్‌కమ్ టు వాల్ పోస్టర్ సినిమా' అన్నారు. అది నా జీవితంలో హై మూమెంట్'' అని డైరెక్టర్ రామ్ జగదీశ్ చెప్పారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రోషన్, శ్రీదేవి ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'. హీరో నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న రామ్ జగదీశ్ విలేకరులతో మాట్లాడుతూ– ''గతంలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో పూరి జగన్నాథ్‌గారు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన పది షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లో బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డ్ అందుకోవడం చాలా సంతోషంగా, ప్రోత్సాహకరంగా అనిపించింది. ఇక 'కోర్ట్' కథ పోక్సో యాక్ట్ నేపథ్యంలో ఉంటుంది. ఇలాంటి కేసులు ఏపీ, తెలంగాణల్లోనూ ఎన్నో ఉన్నాయి. వాటి ఆధారంగా రాసుకున్న ఫిక్షనల్ కథ ఇది. ఈ మూవీలో లవ్ స్టోరీ, కోర్ట్ రూమ్ డ్రామా చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ప్రియదర్శి, నేను చాలా స్నేహంగా ఉంటాం. అందుకే తనతో పని చేయడం సులభంగా అనిపించింది. చందు పాత్ర కోసం రోషన్ చాలా తపన పడ్డాడు. జాబిల్లి పాత్ర కోసం శ్రీదేవిని ఆడిషన్ చేసి ఎంచుకున్నాం. శివాజీగారి మంగపతి పాత్ర ఆకట్టుకుంటుంది. దీప్తిగారు సినిమాకి కావాల్సిన ప్రతిదీ సమకూర్చారు. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక నానిగారు.. 'గర్వంగా ఉంది జగదీశ్' అన్నారు... అది నాకు వచ్చిన గొప్ప ప్రశంస. 'కోర్ట్' గురించి ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మనందరి జీవితం. మనం తెలుసుకోవాల్సిన నిజం. స్క్రీన్ మీద మన జీవితమే ఉంటుంది. నా తర్వాతి సినిమా కూడా నానిగారి వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌లోనే ఉంటుంది'' అన్నారు.

సస్పెన్స్... థ్రిల్



● శ్వేత, రుషి కిరణ్

రుషి కిరణ్, శ్వేత, రూప, శివ యాదవ్, రజిత, ఏకెఎన్ ప్రసాద్, మృణాల్ ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ది సస్పెక్ట్'. రాధాకృష్ణ దర్శకత్వంలో కిరణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఎస్‌కేఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణ ఏరియాల్లో ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ– ''పెద్ద సినిమాలు జీరో కలెక్షన్స్ చేసినవీ ఉన్నాయి. అద్భుతంగా ఆదరణ పొందిన చిన్న చిత్రాలూ ఉన్నాయి. 'ది సస్పెక్ట్' చిన్న చిత్రాల్లో పెద్ద విజయం సాధించాలి. కిరణ్‌గారు ఈ సినిమాను నిర్మించడంతో పాటు ఓ మంచి పాత్ర కూడా చేశారు'' అన్నారు. ''ఒక అమ్మాయి హత్యకు కారకులైన వారిని పట్టుకునే క్రమంలో జరిగే వివిధ సంఘటనల సమాహారమే ఈ చిత్రం'' అని తెలిపారు రాధాకృష్ణ. ''సినిమా ఇండస్ట్రీలోకి రావాలన్న నా కల 'ది సస్పెక్ట్'తో నెరవేరింది'' అన్నారు కిరణ్ కుమార్.

జాక్‌కి ఆర్ఆర్

● సామ్ సీఎస్



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. ఈ చిత్రంలో వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నేతృత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా మొదలయ్యాయి. కాగా 'జాక్' సినిమాకు సామ్ సీఎస్ ఆర్ఆర్ (రీ రికార్డింగ్) అందించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. కాగా ఈ సినిమాకు అచ్చు రాజమణి పాటలు అందించారు.

సాక్షి బిజినెస్
గురువారం
13-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
73	27
74,030	22,470

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,696	▽	264
డోజోన్స్	4,523	△	89
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,541	△	45
డాక్స్	22,676	△	348
షాంఘై	3,372	▽	8
నికాయ్	36,819	△	26

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో


ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,143	△	119
బంగారం (99.5 స్వచ్ఛత)	85,798	△	118
వెండి (కేజీ)	98,100	△	1,474

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.85	87.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.50	114.41
€	యూరో	ఎస్‌బీఐ	93.86	96.55
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	47.81	69.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	53.82	56.03
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.19	67.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.35	23.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.85	24.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.17	12.99

ఫండ్ రివర్స్..!



ఫండ్స్‌లోకి భారీగా తగ్గిన పెట్టుబడులు

- ఫిబ్రవరిలో 26 శాతం డౌన్
- నికరంగా రూ.29,303 కోట్లు రాక
- జనవరిలో వచ్చింది రూ.39,688 కోట్లు
- స్మాల్, మిడ్‌క్యాప్‌లో గణనీయంగా తగ్గుదల
- మూడు నెలల కనిష్టానికి సిప్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా ఫిబ్రవరి నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయి. రూ.29,303 కోట్ల పెట్టుబడులు ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చాయి. ఈ ఏడాది జనవరిలో వచ్చిన రూ.39,688 కోట్లతో పోల్చి చూస్తే 26 శాతం తగ్గిపోయాయి. 2024 డిసెంబర్‌లో ఈక్విటీ పథకాల్లోకి రూ.41,156 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం. ఇలా చూస్తే వరుసగా రెండో నెలలోనూ ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక తగ్గినట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. ముఖ్యంగా స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడుల విలువ క్షీణించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపించింది. అటు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో వచ్చిన పెట్టుబడులు సైతం మూడు నెలల కనిష్టానికి చేరాయి. గత డిసెంబర్‌లో సిప్ ద్వారా ఈక్విటీల్లోకి రూ.26,459 కోట్లు రాగా, జనవరిలో రూ.26,400 కోట్లకు, ఫిబ్రవరిలో రూ.25,999 కోట్లకు క్షీణించాయి. మార్కెట్లలో కరెక్షన్ నేపథ్యంలో ఈక్విటీ ఫండ్స్‌లోకి లమ్సమ్ రూపంలో పెట్టుబడులు గణనీయంగా తగ్గినప్పటికీ, సిప్ పెట్టుబడుల విషయంలో ఇన్వెస్టర్లు స్థిరత్వాన్ని చూపిస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ''సిప్ పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. కానీ, పెద్ద మొత్తమేమీ కాదు. పైగా జనవరితో పోల్చితే ఫిబ్రవరి నెలలో తక్కువ రోజులు ఉంటాయి'' అని మిరే అస్సెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఇండియా డిస్ట్రిబ్యూషన్ హెడ్ సురంజన తెలిపారు. మార్కెట్లలో కరెక్షన్ కొనసాగడం ఫిబ్రవరిలో అమ్మకాలపై ప్రభావం చూపించినట్టు మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ ఈడీ అఖిల్ చతుర్వేది పేర్కొన్నారు. దీర్ఘకాలానికి సెంటిమెంట్ సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు.

స్మాల్, మిడ్‌క్యాప్‌పై ప్రభావం ఎక్కువ

- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి ఫిబ్రవరిలో రూ.3,722 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జనవరిలో వచ్చిన రూ.5,721 కోట్లతో పోల్చితే గణనీయంగా తగ్గాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు రూ.5,148 కోట్ల నుంచి రూ.3,407 కోట్లకు క్షీణించాయి.
- గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)లోకి సైతం పెట్టుబడులు ఫిబ్రవరిలో రూ.1,980 కోట్లకు పరిమితమయ్యాయి. జనవరిలో రూ.3,751 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- అన్ని రకాల పథకాల్లోకి ఫిబ్రవరిలో రూ.40,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- సిప్ ఖాతాలు 10.16 కోట్లుగా ఉన్నాయి. ఫిబ్రవరిలో కొత్తగా 44.56 లక్షల సిప్ ఖాతాలు ప్రారంభం కాగా, 54.70 లక్షల ఖాతాలను ఇన్వెస్టర్లు నిలిపివేశారు.

ఇన్వెస్టర్ల విశ్వాసం బలంగానే..



స్వల్పకాల ప్రతికూలతలు పెట్టుబడులపై ప్రభావం చూపించి ఉండొచ్చు. అయినప్పటికీ ఇన్వెస్టర్ల విశ్వాసం బలంగానే ఉంది. ఇప్పటికీ పెట్టుబడులు సానుకూలంగా ఉండడం దీన్నే సూచిస్తోంది. ఇన్వెస్టర్లు కాస్త అప్రమత్త ధోరణిని అనుసరిస్తూ, తమ దీర్ఘకాల పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోని తిరిగి పరిశీలించుకుంటున్నట్టు కనిపిస్తోంది.

– నేహల్ మెష్రామ్
సీనియర్ అనలిస్ట్, మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్

నెలవారీ పెట్టుబడుల ప్రవాహం ఇలా..

విభాగం	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)		
	2025 ఫిబ్రవరి	2025 జనవరి	2024 డిసెంబర్
మల్టీక్యాప్	2,518	3,567	3,075
లార్జ్‌క్యాప్	2,866	3,063	2,011
లార్జ్‌అండ్‌మిడ్	2,656	4,123	3,812
మిడ్‌క్యాప్	3,407	5,148	5,093
స్మాల్‌క్యాప్	3,722	5,721	4,688
వ్యాల్యూఫండ్	1,347	1,556	1,514
ఫోకస్డ్ ఫండ్స్	1,288	783	456
సెక్టోరల్/థీమ్యాటిక్	5,712	9,017	15,332
ఈఎల్ఎస్ఎస్	615	797	188
ఫ్లెక్సీక్యాప్	5,104	5,698	4,731

ఫండ్స్ ఏయూఎంలో కుదుపు

మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ ఫిబ్రవరి నెలలో 4% పతనమైంది. జనవరి చివరికి ఉన్న రూ.67.25 లక్షల కోట్ల నుంచి ఫిబ్రవరి చివరికి రూ.64.53 లక్షల కోట్లకు తగ్గింది. తాజా నిధుల సమీకరణ తక్కువగా ఉండడం, అదే సమయంలో స్టాక్స్ విలువలు పతనం కావడం ఫండ్స్ ఏయూఎం నికరంగా రూ.2.72 లక్షల కోట్ల మేర ఆవిరైంది. 2022 జూన్ తర్వాత నెలవారీ ఏయూఎం(శాతంలో) ఇంత అధికంగా క్షీణించడం ఇదే తొలి సారి. విలువ క్షీణత పరంగా చూస్తే 2020 మార్చి నెల తర్వాత గరిష్టం కావడం గమనార్హం. మార్కెట్లో దిద్దుబాటు ప్రభావం పరిశ్రమపై ఏ మేరకు ఉందో ఈ గణాంకాలు చెబుతున్నాయి.

ఐటీ షేర్లలో అమ్మకాలు

- అమెరికా ఆర్థిక వృద్ధిపై ఆందోళన ఎఫెక్ట్
- సెన్సెక్స్ నాలుగో రోజూ నేలచూపులు

ముంబై: అమెరికా ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు రేకెత్తడంతో ఐటీ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ వాణిజ్య సుంకాల అనిశ్చితి కూడా సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 73 పాయింట్లు నష్టపోయి 74,030 వద్ద స్థిరపడింది. వరుసగా నాలుగో రోజూ నష్టాల ముగింపు ఇది. నిఫ్టీ 27 పాయింట్లు పతనమై 22,470 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్లు క్షీణించి 73,598 వద్ద, నిఫ్టీ 168 పాయింట్లు పతనమై 22,330 వద్ద కనిష్టాన్ని తాకాయి. మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు తగ్గాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ షేర్లు మిశ్రమంగా స్పందించాయి. రెండు షేర్లూ ట్రేడింగ్ ప్రారంభంలో ఆర్జించిన లాభాలు కోల్పోయాయి. ఎయిర్‌టెల్ షేరు తొలుత 3.50% పెరిగి రూ.1,717 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 1% నష్టంతో రూ.1,643 వద్ద స్థిరపడింది. రిలయన్స్ షేరు ఇంట్రాడేలో 1% పెరిగి రూ.1,262 వద్ద గరిష్టాన్ని అందుకుంది. ఆఖరికి 0.75% లాభంతో రూ.1,257 వద్ద ముగిసింది.

స్టార్‌లింక్‌తో జియో జోడీ



న్యూఢిల్లీ: స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు టెలికం సంస్థ రిలయన్స్ జియో బుధవారం ప్రకటించింది. భారతీ ఎయిర్‌టెల్ ఇటువంటి ఒప్పందం చేసుకున్న మరుసటి రోజే జియో ప్రకటన వెలువడడం గమనార్హం. స్టార్‌లింక్ సేవలకు ప్రభుత్వం నుంచి ఆమోదానికి లోబడే ఈ ఒప్పందం ఉంటుందని జియో ప్లాట్‌ఫామ్స్ తెలిపింది. జియో తన రిటైల్ ఔట్‌లెట్స్, ఆన్‌లైన్ ద్వారా స్టార్‌లింక్ సేవలను అందుబాటులోకి తెస్తుంది. స్టార్‌లింక్ పరికరాలను విక్రయించడంతోపాటు కస్టమర్ సర్వీస్, ఇన్‌స్టాలేషన్, యాక్టివేషన్ సేవలు అందిస్తామని జియో వివరించింది.

ఏడు నెలల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

- ఫిబ్రవరిలో 3.61 శాతానికి డౌన్
- ఆర్‌బీఐ రేట్ల కోతకు అవకాశం



న్యూఢిల్లీ: కూరగాయలు, గుడ్లు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఇతరత్రా పదార్థాల రేట్లు నెమ్మదించడంతో ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్టమైన 3.61 శాతానికి దిగి వచ్చింది. ఇది గతేడాది జూలై తర్వాత కనిష్ట స్థాయి. తాజా పరిణామం నేపథ్యంలో వచ్చే నెలలో రిజర్వ్ బ్యాంక్ మరోసారి కీలక వడ్డీ రేట్ల కోతపై దృష్టి పెట్టడానికి కాస్త అవకాశం లభించినట్లవుతుందని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. రిజర్వ్ బ్యాంక్ ఏప్రిల్ 7–9 మధ్య ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష చేపట్టనుంది. రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో 4.26 శాతంగా, గతేడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా నమోదైంది. ఆహార ద్రవ్యోల్బణం 222 బేసిస్ పాయింట్ల మేర తగ్గినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెల్లడించింది. 2023 మే తర్వాత ఇదే కనిష్టమని పేర్కొంది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పు ధాన్యాలు మొదలైన వాటి ధరల పెరుగుదల తగ్గడమే రిటైల్, ఆహార ద్రవ్యోల్బణాలు దిగి రావడానికి కారణమని వివరించింది.

పారిశ్రామికోత్పత్తికి తయారీ దన్ను

జనవరిలో ఐఐపీ 5 శాతం అప్



న్యూఢిల్లీ: తయారీ కార్యకలాపాలు పుంజుకోవడంతో దేశీయంగా పారిశ్రామికోత్పత్తి జనవరిలో మెరుగుపడింది. దీనికి సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి 5%గా నమోదైంది. ఇది 2024 నవంబర్‌లో 5 శాతంగా ఉంది. 2024 డిసెంబర్ గణాంకాలను ప్రభుత్వం 3.2% నుంచి 3.5%కి సవరించింది. ఇక, గతేడాది జనవరిలో 3.6%గా ఉన్న తయారీ రంగ ఉత్పత్తి ఈ ఏడాది జనవరిలో 5.5%కి పెరిగింది. మరోవైపు, 2024–25 ఏప్రిల్–జనవరి మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 6 శాతం నుంచి 4.2 శాతానికి నెమ్మదించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అంకురాల్లోకి 600 బిలియన్ డాలర్లు | క్విక్ కామర్స్‌లో.. 5.5 లక్షలకు కొలువులు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబైలో 180 పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ).. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 180.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏలో ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 01.01.2025 నాటికి 23 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు ఎంఎంజీఎస్–2కు రూ. 64,820 నుంచి రూ.93,960,ఎంఎంజీఎస్–3కు రూ. 85,920 నుంచి రూ.1,05,280, ఎంఎంజీఎస్–4కు రూ.1,02,300 నుంచి రూ.1,20,940.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.03.2025
- » **వెబ్‌సైట్:** https://bankofindia.co.in

ఐటీఐ లిమిటెడ్, బెంగళూరులో 41 పోస్టులు

బెంగళూరులోని ఐటీఐ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 41.
- » **పోస్టుల వివరాలు:** అడిషనల్ జనరల్ మేనేజర్–11, డిప్యూటీ జనరల్ మేనేజర్–04, చీఫ్ మేనేజర్–12, మేనేజర్–03, డిప్యూటీ మేనేజర్–01, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–10.
- » **విభాగాలు:** బిజినెస్ డెవలప్‌మెంట్, ఎస్టేట్ మేనేజ్‌మెంట్, సివిల్,లీగల్,ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్,నెట్‌వర్క్ సెక్యూరిటీ,డేటా సెంటర్, ఐటీ.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, పీజీడీఎం, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు 28 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 38 ఏళ్లు, మేనేజర్‌కు 42 ఏళ్లు, చీఫ్ మేనేజర్‌కు 46 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50ఏళ్లు,అడిషనల్ జనరల్ మేనేజర్‌కు 54ఏళ్లు నిండి ఉండాలి.
- నెలకు అడిషనల్ జనరల్ మేనేజర్‌కు రూ.18,500 నుంచి రూ.23,900, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.17,500 నుంచి రూ.22,300, చీఫ్ మేనేజర్‌కు రూ.16,000 నుంచి రూ.20,800, మేనేజర్‌కు రూ.14,500 నుంచి రూ.18,700, డిప్యూటీ మేనేజర్‌కు రూ.13,000 నుంచి రూ.18,250, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు రూ.8,600 నుంచి రూ.14,600.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 16.03.2025.
- » **వెబ్‌సైట్:** https://itiltd.in

ఎస్‌బీఐలో మేనేజర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్(రిటైల్ ప్రాడక్ట్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, పీజీడీఎం, పీజీబీఎం, ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** 31.12.2024 నాటికి 28 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280, డిప్యూటీ మేనేజర్‌కు రూ.64,820 నుంచి రూ.93,960.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.03.2025
- » **వెబ్‌సైట్:** https://sbi.co.in

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్‌లో 75 పోస్టులు

నాగ్‌పూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్(ఎంఓఐఎల్)లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 75.
- » **పోస్టుల వివరాలు:** మైన్ ఫోర్‌మెన్1-12, సెలెక్ట్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్–05,మైన్ మేట్ గ్రేడ్1–20, బ్లాస్టర్ గ్రేడ్2–14,వైండింగ్ ఇంజన్ డ్రైవర్2–24
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** సెలెక్టెడ్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్, మైన్ ఫోర్‌మెన్‌కు 45 ఏళ్లు, వైండింగ్ ఇంజన్ డ్రైవర్, మైన్‌మేట్ గ్రేడ్–1కు 40 ఏళ్లు, బ్లాస్టర్ గ్రేడ్ 2కు 35 ఏళ్లు నిండి ఉండాలి.
- » **వేతనం:** నెలకు వైండింగ్ ఇంజన్ డ్రైవర్, మైన్ మేట్ గ్రేడ్ 1కు రూ.24,800 నుంచి రూ.44,960, బ్లాస్టర్‌కు రూ.24,100 నుంచి రూ.43,690, సెలెక్టెడ్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్‌కు రూ.27,600 నుంచి రూ.50,040, మైన్ ఫోర్‌మెన్‌కు రూ.26,900 నుంచి రూ.48,770.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ట్రేడ్ టెస్ట్ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025
- » **వెబ్‌సైట్:** https://moil.nic.in

ఐఐఎం రాయ్‌పూర్‌లో 17 పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ రాయ్‌పూర్(ఐఐఎం రాయ్‌పూర్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
- » **పోస్టుల వివరాలు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–03, సీనియర్ స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–05, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–04, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, మాస్టర్ డిగ్రీ, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సీనియర్ స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 45 ఏళ్లు, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు.
- » **వేతనం:** నెలకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సీనియర్ స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్‌కు రూ.56,100,అసి స్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.47,600, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.35,400, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు రూ.25,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.03.2025
- » **వెబ్‌సైట్:** https://iimraipur.ac.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

టీజీపీఎస్సీ గ్రూప్స్ టాపర్స్

సివిల్స్, గ్రూప్స్‌కు ఇంట్లోనే ప్రిపేర్ కావొచ్చు

'సాక్షి'తో గ్రూప్–2 రెండో ర్యాంకర్ సచిన్‌రెడ్డి



సాక్షి, సిద్దిపేట: సివిల్స్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఐఏఎస్ కావాలనేది తన లక్ష్యం అని గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించిన వడ్లకొండ సచిన్‌రెడ్డి అన్నారు. సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలేసి సివిల్స్, గ్రూప్స్‌కు ప్రిపేర్ అవడం పూర్తి స్థాయిలో ప్రారంభించానని తెలిపారు. ఇటీవల గ్రూప్–2 ఫలితాలు విడుదలైన సందర్భంగా 'సాక్షి' ఆయన్ను పలకరించింది. ఆయన మాటల్లో..

సిద్దిపేటలోనే విద్యాభ్యాసం ప్రారంభం..

7వ తరగతి వరకు సిద్దిపేటలోని గ్రేస్ గ్రామర్ స్కూల్, 8 నుంచి 10వ తరగతి వరకు కేకేఆర్, హైదరాబాద్‌లో, ఇంటర్ నారాయణ కాలేజీ, బీటెక్ ఢిల్లీలోని ముంజాల్ యూనివర్సిటీలో పూర్తి చేశాను. 2019–2021 వరకు స్ట్రింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసి 2021లో సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రిజైన్ చేశాను. 2021, 2022లో రెండు సార్లు సివిల్స్ రాసినా క్వాలిఫై కాలేదు.

పరీక్షల వాయిదాతో

2022లో గ్రూప్–2కు దరఖాస్తు చేశాను. కానీ పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. అలాగే గ్రూప్–1 కూడా పోస్ట్‌పోన్ అవుతుంటే డిస్టర్బ్ అయ్యాను. మళ్లీ సాఫ్ట్‌వేర్ సైడ్ పోదామా అనిపించింది. అప్పుడు అమ్మానాన్న సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, అన్నయ్య నితిన్ రెడ్డి, తాతయ్య వెంకట్ రెడ్డి ఎంతో ఎంకరేజ్ చేశారు.

సివిల్స్‌కు ప్రిపేర్ అవుతా

గ్రూప్–2లో 444.754 మార్కులు అలాగే గ్రూప్–1లో 461.5 మార్కులు సాధించాను. ఉద్యోగంలో జాయిన్ అయ్యాక కూడా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను. ప్రిపరేషన్‌కు రోజుకు 8 నుంచి 10 గంటలు, అదే పరీక్షలు 2 నెలలు ఉన్న సమయంలో 10 నుంచి 12 గంటలు చదివాను. ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటూ, టెస్ట్‌లు రాస్తూ నేను ఎక్కడ వీక్ ఉన్నానో తెలుసుకుని దాన్ని ఎక్కువగా ప్రిపేర్ అయ్యాను. సివిల్స్, గ్రూప్స్‌కు ఇంట్లో ఉండి ప్రిపేర్ కావచ్చు. సిలబస్ తెలుసుకుని, వాటికి సంబంధించిన స్టాండర్డ్ బుక్స్‌ను ఎంపిక చేసుకుని చదవవచ్చు. నేను ఇంట్లో ఉండి ప్రిపేర్ అయ్యాను. గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యే వారికి హార్డ్ వర్క్ ఎంతో ముఖ్యం. ఇది షార్ట్ కట్‌ల ద్వారా, రోజుకో గంట చదివితే రాదు. కంటిన్యూగా ఎఫర్ట్ పెట్టాలి.

ఐఏఎస్ కావాలన్న ఆశయంతో చదివా



గ్రూప్–1 టాపర్ వెంకటరమణ

నల్లగొండ: గ్రూప్–1 మెయిన్స్ ఫలితాల్లో నల్లగొండకు చెందిన దాది వెంకటరమణ టాపర్‌గా నిలిచారు. 900 మార్కులకు గాను 535.50 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు దాది రమాదేవి ప్రధానోపాధ్యాయురాలు, తండ్రి శ్రీనివాసరావు కాంట్రాక్టు ఏఈగా ఈడబ్ల్యూఐడీసీలో పనిచేస్తున్నారు. వీరి స్వస్థలం సూర్యాపేట కాగా.. ఉద్యోగ రీత్యా నల్లగొండలోని బృందావన్ కాలనీలో స్థిరపడ్డారు. వెంకటరమణ ఒకపక్క గ్రూప్–1 మెయిన్స్‌కు ప్రిపేరవుతూనే మరోపక్క జూనియర్ లెక్చరర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించారు.

ఐఏఎస్ కావాలన్నదే ఆశయం..

చిన్న నాటి నుంచే అమ్మనాన్న ప్రోత్సాహంతో ఐఏఎస్ కావాలన్న ఆశయంతో చదువుతూ వచ్చాను. ఎన్ ఐటీ వరంగల్‌లో ఈసీఈ పూర్తి చేశాను. 2020, 2021, 2022లో వరుసగా మూడు సార్లు యూపీఎస్సీ పరీక్ష రాశాను. కానీ ఎంపికకాలేదు. ఆ తర్వాత గ్రూప్–1పై దృష్టి సారించాను. ప్రస్తుతం ప్రకటించిన ఫలితాల్లో టాపర్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉంది.

పట్టుదలతో చదివేవాడు

వెంకటరమణ చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి చూపేవాడు. ఐఏఎస్ కావాలన్న ఆలోచనతో చదువుతూ వచ్చాడు. ఇప్పుడు గ్రూప్–1 ఫలితాల్లో టాపర్‌గా నిలిచాడు. డిప్యూటీ కలెక్టర్ పోస్టు వస్తుంది. దీంతో ఐఏఎస్ కావాలన్న కోరిక ప్రస్తుతం కాకున్నా భవిష్యత్‌లో నెరవేరే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది.

– రమాదేవి, శ్రీనివాసరావు,
వెంకటరమణ తల్లిదండ్రులు.

సబ్జెక్టును అర్థం చేసుకుంటే.. ప్రభుత్వోద్యోగం సాధించడం సులువే

గ్రూప్–2 ర్యాంకర్ వినీషారెడ్డి

త్రిపురారం: గ్రూప్–2 ఫలితాల్లో నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రేగులగడ్డ గ్రామానికి చెందిన లక్కిరెడ్డి (చామల) వినీషారెడ్డి 408.7 మార్కులతో 32వ ర్యాంక్ సాధించి మహిళల్లో మొదటి ర్యాంకర్‌గా నిలిచారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన లక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆరెనా దంపతుల కూతురు వినీషారెడ్డి. ఆమె సక్సెస్ స్పీక్స్..

మొదటి ప్రయత్నంలోనే

10వ తరగతిలో 9.8 జీపీఏ, ఇంటర్మీడియట్ బైపీసీలో 960 మార్కులు సాధించాను. బీహెచ్ఎమ్ఎస్ పూర్తి చేశా. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–2 ఉద్యోగం సాధించా.

ఇంట్లోనే ప్రిపరేషన్

బీహెచ్ఎమ్ఎస్ పూర్తికాగానే పోటీ పరీక్షలపై దృష్టి సారించాను. అమ్మానాన్నల ప్రోత్సాహంతో ఇంట్లోనే యూట్యూబ్‌లో పాఠాలు వింటూ రోజుకు 14 గంటలు ప్రిపేర్ అయ్యాను. సీడీపీఓ పరీక్షల్లో కూడా టాపర్‌గా నిలిచాను. గ్రూప్–1లో కూడా మంచి మార్కులు సాధించాను.

సంతోషంగా ఉంది

తొలి ప్రయత్నంలో గ్రూప్–2లో మహిళల్లో మొదటి ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సివిల్స్‌కు సిద్ధమవుతున్నాను. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సబ్జెక్ట్‌ను అర్థం చేసుకొని చదువుకుంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం చాలా సులువు.



క్లుప్తంగా...

క్యూఎస్ సబ్జెక్ట్ ర్యాంకింగ్స్‌లో విట్ ఘనత

సాక్షి, హైదరాబాద్: క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సబ్జెక్ట్ ర్యాంకింగ్స్‌లో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) సత్తా చాటింది. ఉన్నత విద్యలో సబ్జెక్టులవారీగా 2025 సంవత్సరానికి గాను క్యూఎస్ క్వాక్వారెల్లీ సైమండ్స్ ప్రకటించిన ర్యాంకుల్లో 14 విభాగాల్లో విట్ ఉత్తమ ర్యాంకులు సొంతం చేసుకుంది. 4 సబ్జెక్టుల్లో తన పాత ర్యాంకులను మెరుగుపర్చుకోవటమే కాకుండా, 8 సబ్జెక్టుల్లో గత ర్యాంకులను నిలబెట్టుకుంది. కొత్తగా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టుల్లో కూడా విట్‌కు ర్యాంకులు దక్కాయి. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో విట్‌కు ప్రపంచంలో 110వ ర్యాంకు దక్కింది. ఇంజనీరింగ్, టెక్నాలజీలో తన ర్యాంకును 212 నుంచి 142కు మెరుగుపర్చుకుంది. సబ్జెక్టుల బోధనలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించే సంస్థలకు ఈ ర్యాంకులు ప్రకటిస్తారు.

10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు.

సామాన్యులకు స్టార్‘లింక్’ అయ్యేనా!

మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లోనూ హైస్పీడ్ ఇంటర్నెట్ / విదేశాల్లో ఇప్పటికే అందుబాటులో.. ఖరీదూ ఎక్కువే.. / మన దేశంలో చవక ధరలో తెస్తామంటున్న టెలికం కంపెనీలు / తొలుత వ్యాపార సంస్థలకు అందుబాటులో.. తర్వాత సాధారణ జనానికి..

సాక్షి, హైదరాబాద్: కొండలు, గుట్టలు, అడవులతో కూడిన మారుమూల ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నేరుగా శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ అందించే అంశం ఇప్పుడు మన దేశంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడ శాటిలైట్ ఇంటర్నెట్ అందించేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్‌తో చేతులు కలిపినట్టు టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించిన మరుసటి రోజే.. అనూహ్యంగా రిలయన్స్ జియో సైతం తెరపైకి వచ్చింది. తాము కూడా స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకున్నట్టు బుధవారం ప్రకటించి ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ సేవలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి స్టార్‌లింక్ ఆమోదం పొందాల్సి ఉందని ఎయిర్‌టెల్, జియో స్పష్టం చేశాయి. భారతీ ఎయిర్‌టెల్ ఇప్పటికే గుజరాత్, తమిళనాడులలో బేస్ స్టేషన్లు ఏర్పాటు చేసి శాటిలైట్ టెలికం సేవల కోసం రెడీ అవుతోంది. అటు జియో కూడా దేశంలో రెండు ప్రాంతాల్లో బేస్ స్టేషన్స్ నెలకొల్పి పోటీకి సై అంటోంది.

మరింత సమయం తప్పదు

దేశంలో శాటిలైట్ టెలికం సేవలు అందుబాటులోకి రావడానికి మరికొంత సమయం పట్టనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇంకా నిబంధనలను ప్రకటించలేదు. పైగా టెలికం శాఖ, ట్రాయ్, కేంద్ర హోం శాఖ నుంచి స్టార్‌లింక్ అనుమతులు పొందాల్సి ఉంది. ఈ సేవలకు సంబంధించి ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను నేరుగా సంస్థలకు కేటాయించడానికి బదులుగా.. వేలం వేయాలని జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా పట్టుబడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో ఉన్నట్టుగా అడ్మినిస్ట్రేటివ్ కేటాయింపుల విధానం అమలు చేయాలని స్టార్‌లింక్, ప్రాజెక్ట్ కైపర్ వంటివి కోరుతున్నాయి. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అన్నీ అనుకూలించి శాటిలైట్ టెలికం సేవలు అందుబాటులోకి వస్తే.. ఈ విభాగంలోనూ టారిఫ్ వార్ ఖాయంగా కనిపిస్తోంది.



స్టార్ లింక్ ప్రత్యేకతలు ఇవీ..

కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలు: సుమారు 7,000
శాటిలైట్ ఇంటర్నెట్ అందిస్తున్న దేశాలు: 100కుపైగా
వినియోగదారులు: సుమారు 50 లక్షలు (2024 డిసెంబర్ చివరినాటికి)
అమెరికాలో దిగ్గజ బ్రాండ్‌బ్యాండ్ కంపెనీలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గట్టి పోటీనిస్తోంది.

రూరల్ కనెక్టివిటీ: మారుమూల ప్రాంతాలు, పల్లెలకు వేగంగా ఇంటర్నెట్ అందిస్తోంది. విద్య, ఆరోగ్య సేవలు, ఈ-కామర్స్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

భారత్‌లో పోటీ: దేశంలో 94.5 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు ఉన్నారు. అందులో 90.4 కోట్ల మంది వైర్‌లెస్/మొబైల్ ఇంటర్నెట్‌ను వాడుతున్నారు.

తొలుత వ్యాపార, వాణిజ్య కస్టమర్లకు..

భారత్‌లో శాటిలైట్ టెలికం, ఇంటర్నెట్ చార్జీలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తి రేపుతోంది. స్టార్‌లింక్ గేర్ (శాటిలైట్ ఇంటర్నెట్ అందుకోవడానికి కావాల్సిన పరికరాలు) ధర కూడా వెల్లడి కావాల్సి ఉంది. భారత్‌లో ప్రస్తుతమున్న సంప్రదాయ టెలికం చార్జీలతో పోలిస్తే ఇతర దేశాల్లో స్టార్‌లింక్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. కానీ భారత మార్కెట్‌కు తగ్గట్టుగా పోటీ ధరలో చార్జీలు అమలు చేసే అవకాశం ఉందని దిగ్గజ టెలికం సంస్థ అధికారి ఒకరు వెల్లడించారు. తొలుత వ్యాపార, వాణిజ్య కస్టమర్ల కోసం సేవలు ప్రారంభం అవుతాయని చెప్పారు. సాధారణ కస్టమర్లకు శాటిలైట్ టెలికం సేవలు చేరడానికి చాలా కాలం పడుతుందన్నారు.

విదేశాల్లో చార్జీలు ఇలా..

స్టార్‌లింక్ యూఎస్‌ఏలో రెసిడెన్షియల్ విభాగంలో నెలకు రూ.6,976 నుంచి ప్లాన్లు అందిస్తోంది. పరికరాల కోసం ఒకసారి చెల్లించాల్సిన సొమ్ము అదనం. స్టాండర్డ్ ఎక్విప్‌మెంట్ కిట్ ధర రూ.30,443గా ఉంది.

- ఇక మొబైల్ సేవలు కావాల్సినవారు నెలకు కనీసం రూ.4,360 చెల్లించాల్సి ఉంటుంది. డేటా అపరిమితంగా అందుకోవచ్చు. 220 ఎంబీపీఎస్ వరకు స్పీడ్ ఆఫర్ చేస్తోంది.
- రెసిడెన్షియల్ లైట్, రెసిడెన్షియల్ ప్లాన్లలో కూడా వినియోగదారులు అపరిమిత డేటాను అందుకోవచ్చు.
- రోమింగ్ ప్లాన్ తీసుకునే వినియోగదారులు దేశవ్యాప్తంగా, ప్రయాణంలో, అంతర్జాతీయ ప్రయాణ సమయంలో కూడా వినియోగం, తీర ప్రాంతాల్లో కవరేజీ పొందవచ్చు. బిజినెస్ విభాగంలో నెలకు రూ.12,208 నుంచి రూ.4,36,000 వరకు ప్లాన్స్ ఉన్నాయి.
- ఇక భూటాన్‌లో రెసిడెన్షియల్ లైట్ ప్లాన్ కింద స్టార్‌లింక్ నెలకు రూ.3,000 చార్జీ చేస్తోంది. ఈ ప్లాన్‌లో ఇంటర్నెట్ 23-100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఆఫర్ చేస్తోంది. యూరప్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్ వేగం ఊక్లా నివేదిక ప్రకారం హంగరీలో అక్టోబర్-డిసెంబర్ కాలంలో గరిష్ఠంగా 135.11, కనిష్ఠంగా సైప్రస్‌లో 36.52 ఎంబీపీఎస్ నమోదైంది.

మనదగ్గర చాలా చవక..

శాటిలైట్ ఇంటర్నెట్ చార్జీలతో పోలిస్తే మన దేశంలో మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ చాలా చవక. అటూ ఇటూగా రూ.20 చెల్లిస్తే ఒక జీబీ డేటా అందుకోవచ్చు. సుమారు రూ.50 నుంచి అన్‌లిమిటెడ్ ప్యాక్స్ లభిస్తాయి. హోమ్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు నెలకు కనీసం రూ.400 నుంచి ఉన్నాయి. హై-ఎండ్ ప్లాన్ అయితే నెలకు రూ.4,000 వరకు ఉంది. దీనిలో 10 జీబీపీఎస్ వరకు వేగం, అన్ని ఓటీటీ యాప్స్ సబ్‌స్క్రిప్షన్ కూడా అందుతుంది. రూటర్‌కు అయ్యే వ్యయమూ తక్కువే. శాటిలైట్ టెలికం కేవలం ఇంటర్నెట్‌కే పరిమితం. కాల్స్ చేయాలంటే ఓటీటీ యాప్స్‌పైన ఆధారపడాల్సిందే.

యూఎస్‌లో స్టార్‌లింక్ చార్జీలు.. (రూ.లలో)

విభాగం	నెలకు
రెసిడెన్షియల్ లైట్	6,976
రెసిడెన్షియల్	10,464
రోమ్-50 జీబీ	4,360
రోమ్-అన్‌లిమిటెడ్	14,388

భూటాన్‌లో స్టార్‌లింక్ చార్జీలు (రూ.లలో)

విభాగం	నెలకు	స్పీడ్ (ఎంబీపీఎస్)
రెసిడెన్షియల్ లైట్ ప్లాన్	3,000	23-100
స్టాండర్డ్ రెసిడెన్షియల్ ప్లాన్	4,200	25-110

భారత్‌లో ఇంటర్నెట్ వేగం ఇలా..

ఫిక్స్‌డ్ వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్
30ఎంబీపీఎస్ - 1 జీబీపీఎస్

బ్రాడ్‌బ్యాండ్-ఫైబర్ ఆప్టిక్
100 ఎంబీపీఎస్ - 10 జీబీపీఎస్

5జీ మొబైల్ వాస్తవ వేగం
300 ఎంబీపీఎస్ - 1 జీబీపీఎస్

4జీ ఎల్‌టీఈ మొబైల్ వేగం
10-50 ఎంబీపీఎస్

జగన్ చుట్టూ కోటరీ

- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి
- కాకినాడ సీపోర్ట్ వాటాల బదిలీ కేసులో సీఐడీ విచారణకు హాజరు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌కు, తనకు మధ్య కొందరు ద్వితీయ శ్రేణి నేతలు దూరం పెంచారని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. తాను ఎన్ని మెట్లు దిగానో ఆ ద్వితీయ శ్రేణి నేతలు అన్ని మెట్లు పైకి ఎక్కారన్నారు. దాంతోనే తాను వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వచ్చేసినట్లు తెలిపారు. వైఎస్ జగన్ చుట్టూ ఓ కోటరీ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఆ కోటరీ నుంచి బయటపడితే తప్ప ఆయనకు భవిష్యత్ లేదన్నారు. కాకినాడ సీపోర్ట్ వాటాల బదిలీ కేసులో ఏ2గా ఉన్న విజయసాయిరెడ్డిని సీఐడీ బుధవారం విజయవాడలోని ప్రాంతీయ కార్యాలయంలో విచారించింది. అవసరమైతే మళ్లీ విచారణకు రావల్సి ఉంటుందని ఆయనకు సూచించారు. కాగా కాకినాడ సీపోర్టు వాటాలు కొనుగోలు చేసిన అరబిందో రియాల్టీ ఇన్‌ఫ్రా కంపెనీతో తనకు ఎలాంటి సంబంధాలు లేవని విజయసాయి చెప్పారు. అరబిందో కంపెనీ తన అల్లుడు కుటుంబానికి చెందినదే అయినప్పటికీ ఆ సంస్థ వ్యవహారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని తెలిపారు. ఓ అధికారి ఉద్దేశపూర్వకంగా ఈ కేసులో తనను ఏ2గా చేర్చినట్లు చెప్పారు. కేవీ రావు, తన అల్లుడి అన్నయ్య శరత్ చంద్రారెడ్డి మధ్య కాకినాడ సీపోర్టు వాటాల బదిలీ విషయాన్ని పర్యవేక్షించినది వైవీ విక్రాంత్‌రెడ్డి అని సీఐడీకి చెప్పినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించలేక డైవర్షన్ రాజకీయాలు

- బాబు సర్కారుపై కాకాణి ధ్వజం
- ‘యువత పోరు’ నుంచి దృష్టి మళ్లించేందుకే సాయిరెడ్డితో ఇలా మాట్లాడించారు..
- మూడున్నరేళ్ల పదవీకాలం ఉండగానే రాజ్యసభ ఎంపీ పదవిని వదులుకోవడం కూటమికి మేలు చేయడం కాదా?
- వైఎస్ జగన్ వల్ల మీరు పొందిన పదవులు పార్టీలో మరెవరైనా పొందారా? ఆ విషయం మరిచారా?
- అధికారంలో లేనప్పుడు నాయకుడికి అండగా దగ్గరుండాల్సిన బాధ్యత మీది కాదా?
- మిమ్మల్ని నమ్మి అన్ని పదవులు అప్పగిస్తే మీరే దూరం వెళ్లిపోయారు
- అసలు అధికారంలో లేని పార్టీకి కోటరీ ఏమిటి?
- ఓడిపోయిన రెండు నెలలకే రఘురామకృష్ణరాజుకు ఇల్లు అద్దెకిచ్చారంటే దాని అర్థమేమిటి?

నెల్లూరు(అర్బన్): వైఎస్సార్‌సీపీ చేపట్టిన ‘యువత పోరు’ను పక్కదారి పట్టించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు తెర తీసిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. సమస్యలు పరిష్కరించలేక ప్రభుత్వ పెద్దలు డైవర్షన్ రాజకీయాలు నడిపిస్తున్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కోసం పోరాటం చేస్తున్న రోజే వి.విజయసాయిరెడ్డిని సీఐడీ విచారణకు పిలవడం, ఆయనతో మాట్లాడించడం ఇందులో భాగమేనని స్పష్టం చేశారు. బడ్జెట్‌పై వైఎస్ జగన్ మాట్లాడిన రోజు కూడా ఇదే మాదిరిగా వివేకా ఇంటి వాచ్‌మన్ రంగన్న మృతి అంశాన్ని తెరపైకి తెచ్చి డైవర్షన్ రాజకీయాలు చేశారన్నారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లో కాకాణి విలేకరులతో మాట్లాడారు. నాడు వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా గళం విప్పిన రఘురామకృష్ణరాజుకు ఇప్పుడు ఎన్నికలు జరిగిన రెండు నెలలకే తన విల్లాను అద్దెకు ఇచ్చారంటే విజయసాయిరెడ్డి ఎలా మారిపోయారో అందరికీ అర్థమవుతోందన్నారు. తమ చేతుల్లో ఉన్న మనిషితో చంద్రబాబు ఏం కావాలన్నా మాట్లాడిస్తారు.. ఎవరి పేర్లయినా చెప్పిస్తారన్నారు. కేవీ రావు, వైవీ సుబ్బారెడ్డి మంచి స్నేహితులని సాయిరెడ్డి చెబుతున్నారని, అలాంటప్పుడు కేసులు ఎందుకు దాఖలయ్యాయని ప్రశ్నించారు. సాయిరెడ్డి మాటల్లో పొంతన లేదన్నారు. కాకినాడ పోర్టు లావాదేవీలతో తనకు సంబంధం లేదంటూనే మళ్లీ ఈ డీల్స్ వెనుక కర్త, కర్మ, క్రియ వేరొకరంటూ చెప్పడం వెనుక ఉన్న మతలబును అర్థం చేసుకోవాలన్నారు. ఢిల్లీలో రాజీనామా చేసినప్పుడు.. వ్యవసాయం చేసుకుంటానని, ఇతర వ్యవహారాల్లో తలదూర్చనని వెంకటేశ్వరస్వామి మీద ఒట్టేసి చెప్పిన వ్యక్తి ఈ రోజు మాట్లాడిన మాటలు చూస్తుంటే ఒట్టు తీసి గట్టు మీద పెట్టారా? అని ప్రశ్నించారు.



- దాదాపు నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలం మిగిలి ఉన్నప్పటికీ, వైఎస్సార్ సీపీకి నష్టం చేకూరుస్తుందని, సంఖ్యాబలం లేనందున మళ్లీ తన అభ్యర్థిని గెలిపించుకోలేదని తెలిసి కూడా విజయసాయిరెడ్డి రాజీనామా చేయడం.. అంతిమంగా కూటమికి ప్రయోజనం చేకూరి ఆ సీటు వారికి దక్కుతుందని తెలిసి కూడా ఇలా వ్యవహరించారంటే దీని అర్థం ప్రలోభాలు కాదా?
- వైఎస్ జగన్ మీకు ఎన్నో కీలక పదవులు ఇచ్చారు.. రాజ్యసభ సభ్యత్వం.. పార్లమెంటరీ పార్టీ లీడర్.. రాజ్యసభ ఫ్లోర్ లీడర్.. ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి.. రాజ్యసభకు రెండోసారి అవకాశం.. కేంద్ర స్థాయిలో అన్ని ముఖ్యమైన కమిటీల్లో సభ్యత్వం.. ఇలా అధికారంలో ఉండగా అన్నిట్లోనూ మిమ్మల్నే అందలం ఎక్కించారు. దాన్నే దగ్గరకు తీసుకోవడం అంటారు. అన్ని పదవులు ఇచ్చాక కూడా మిమ్మల్ని దూరం పెట్టారని చెప్పడం విస్మయం కలిగిస్తోంది. అసలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దూరం పెట్టడం ఏమిటి? దగ్గరగా ఉండటం మీ బాధ్యత కాదా? పార్టీ పరంగా జాతీయ ప్రధాన కార్యదర్శి.. రీజనల్ కో ఆర్డినేటర్.. ఇలా ఎవరికీ ఇవ్వనన్ని పదవులు మీకే ఇచ్చి గౌరవించారు. నాయకుడు మిమ్మల్ని నమ్మి అన్ని పదవులు అప్పగించి గౌరవిస్తే మీరే దగ్గరగా ఉండకుండా దూరమయ్యారు.
- అసలు అధికారంలో లేని పార్టీకి కోటరీ ఏమిటి? అధికారం లేదని దూరమైంది మీరే. అధికారం లేనప్పుడు జగన్‌కు తోడుగా ఉండకుండా మీరే దూరం జరిగారు. వైఎస్ జగన్ ఓడిపోయిన రెండు నెలలకే రఘురామకృష్ణరాజుకు మీ ఇల్లు అద్దెకు ఇవ్వడం ద్వారా ఎలాంటి సంకేతాలు ఇచ్చారు? ముందుగా అనుకున్న ప్రకారమే తప్పటడుగులు వేశారు.
- వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రోజే మిమ్మల్ని సీఐడీ విచారణకు పిలవడంలో ఆంతర్యం ఏమిటి? అయినా కాకినాడ సీ పోర్టు గురించి మిమ్మల్ని విచారణకు పిలిస్తే బయటకు వచ్చాక మీరు మాట్లాడింది ఏమిటి? ఈ రోజు పిలవటమే ఉద్దేశపూర్వకం. బయటకు వచ్చాక ఏవేవో మాట్లాడారు. వారి లక్ష్యం మేరకు, వారు ఇచ్చిన స్క్రిప్టు మేరకు మాట్లాడారు. ఈరోజు వారికి ఇలా ఉపయోగపడుతున్నారు. మరి దీన్ని విశ్వసనీయత ఉండటం అంటారా? లేక ఏమంటారో మీరే జవాబు చెప్పాలి. ఒక పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయి మరో పార్టీకి అనుకూలంగా అడుగులు వేస్తున్న వ్యక్తితో ఏమైనా చెప్పించవచ్చు. ఏదైనా మాట్లాడించవచ్చు. అందుకు మీ వ్యవహార శైలే నిదర్శనం.

వైఎస్సార్‌సీపీ ద్వారా ఎదిగిన వ్యక్తి విజయసాయి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సాక్షి, అమరావతి: ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చదివారని, ఆయన వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. బుధవారం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. ‘‘కేవీరావు, వైవీ సుబ్బారెడ్డి మధ్య ఎలాంటి సంబంధాలు లేవు. ఒకవేళ ఉండి ఉంటే కేవీరావు కేసు ఎందుకు వేశారు? వైఎస్సార్ సీపీ ద్వారా ఎదిగిన వ్యక్తి విజయసాయిరెడ్డి. నాయకుడు కష్టకాలంలో ఉంటే పార్టీని వీడి వెళ్తారా?’’ అని నిలదీశారు. ‘‘రాజ్యసభను వదిలేసి రాజకీయ సన్యాసం ఎందుకు తీసుకున్నారు? రఘురామ కృష్ణంరాజుకు విజయసాయిరెడ్డి తన ఇంటిని ఎందుకు అద్దెకు ఇచ్చారు? అవతలి వ్యక్తులను ఎందుకు కలిశారు? పదేపదే కోటరీ అని మాట్లాడారు. విజయసాయిరెడ్డి స్వయంగా ఎంతోమందిని మా నాయకుడు వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు. మరి ఆయన్ను మించిన కోటరీ ఇంకేం ఉంది? సీఐడీ విచారణ అనేది ఒక బూటకం. ఆ పేరుతో మీడియా ముందు మాట్లాడి డ్రామా చేశారు’’ అని సుధాకర్‌బాబు మండిపడ్డారు. ఎంపీ పదవికి రాజీనామా ద్వారా ఆయన ఎవరికి లాభం చేకూర్చినట్టు? అని నిలదీశారు. విజయసాయి తమ పార్టీ, నేతలపై అనవసర ఆరోపణలు చేశారని, ఇంకెప్పుడూ కేసులకు, వైఎస్సార్‌సీపీ నేతలకు లింకు పెట్టొద్దని హితవు పలికారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు బోల్తా.. 15 మందికి పైగా గాయాలు


బోల్తా పడిన బస్సు

హొసపేటె: కొప్పళ జిల్లాలోని హట్టి హైదర్ నగర్ నుంచి బయలుదేరిన కేఎస్ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో 15 మందికి పైగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కొప్పళ తాలూకాలోని హైదర్ నగర్–హట్టి రోడ్డులో ఈ ఘటన జరగగా, బస్సులో ఉన్న పాఠశాల విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ముందరగి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. రోడ్డు పనులు నాసిరకంగా చేయడంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకారం


శంకరగౌడను అభినందించిన దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు జిల్లా ఆయుష్ ఆరోగ్య అధికారిగా దావణగెరె శంకరగౌడ అధికార బాధ్యతలు చేపట్టారు. ఇంచార్జి జిల్లా ఆయుష్ ఆరోగ్య అధికారిగా ఉన్న శంకరగౌడ ఐ పాటిల్ బుధవారం జిల్లా ఆయుష్ ఆరోగ్య అధికారి కార్యాలయంలో జిల్లా ఆయుష్ ఆరోగ్య అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో లైన్‌మెన్‌కు గాయాలు


గాయపడిన వీరేష్

రాయచూరు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలైన ఘటన తాలూకాలో జరిగింది. రాయచూరు తాలూకా వడవాటిలోని 110 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతు పనులు చేస్తుండగా లైన్‌మెన్ వీరేష్(28)కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం అతనిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

15న ఆరోగ్య మేళా

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 15న ఆరోగ్య మేళాను నిర్వహిస్తున్నట్లు రాయచూరు అసిస్టెంట్ కమిషనర్ గజానన పేర్కొన్నారు. బుధవారం మాన్విలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య శాఖ, రిమ్స్, ఇతర సంఘ సంస్థల ఆధ్వర్యంలో 200 మంది సీనియర్ వైద్యులు పాల్గొంటారన్నారు. మానసిక, కిడ్నీ, ఎముకల, నేత్ర, గుండెపోటు, చర్మవ్యాధి, శ్వాసకోశ, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పిస్తారన్నారు. సమావేశంలో జిల్లా ఆరోగ్య వైద్యాధికారులు సురేంద్ర బాబు, నందిత, శరణ బసవలున్నారు.

కాలువలో పూడికతీత ప్రారంభం


పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

హొసపేటె: విజయనగర కాలువ 11వ ఉప కాలువలో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. దిగువ ప్రాంతంలోని రైతుల పొలాల్లోకి నీరు సరిగా పారకపోవడంతో వరి సాగుకు ఇబ్బంది ఏర్పడిందని గ్రహించిన సంగాపుర నీటి వినియోగదారుల సంఘం విజయనగర కాలువ 11వ ఉప కాలువలోని పూడికను తొలగించేందుకు పొక్లెయిన్‌తో పనులు చేపట్టారు. సంగాపుర లక్ష్మీనారాయణ లేక్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఖమర్‌పాషా దొడ్డమని క్యాంపులోని 50వ పైపు ఔట్‌లెట్ నుంచి బసవదుర్గ 73వ పైపు వరకు కాలువ నుంచి పూడికను తొలగించారు. అనంతరం దొడ్డమని మాట్లాడుతూ కాలువ దిగువ రైతుల విజ్ఞప్తి మేరకు కాలువలో పూడికను తొలగిస్తున్నామన్నారు.

అక్రమ మార్కెట్లను తొలగించాలి

రాయచూరు రూరల్: నగరంలో అక్రమంగా ఉన్న కూరగాయల మార్కెట్లను తొలగించాలని రాయచూరు నగర ఉస్మానియా కూరగాయల విక్రయదారుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు మహవీర్ డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకాశవాణి మార్గంలో ఉంచిన మార్కెట్‌లను పాత ఉస్మానియా మార్కెట్‌కు తరలించాలన్నారు. టెండర్లు పిలవకున్నా మార్కెట్‌కు టెండర్లు పిలిచారని, వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయడాన్ని ఖండించారు. నగరసభలో ఉద్యోగులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఖాతాల నిర్వహణ విషయంలో సర్వర్ల సమస్యల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. ప్రభు నాయక్, ఉదయ్ కుమార్, బసవరాజ్, ఖాజప్ప, రిజ్వాన్‌లున్నారు.

ఉల్లి దిగుబడి ఘనం.. ధర పతనం

- ఉల్లిగడ్డల రైతు కంట కన్నీరు
- అమాంతంగా పడిపోయిన ధరలు
- ఇప్పటికే తగ్గిన కూరగాయల వెలలు
- రైతులకు నష్టాలు, వ్యాపారులకు లాభాలు
- కిలో ఉల్లిపాయల హోల్‌సేల్ ధర రూ.10లే
- టమాటా, పచ్చి మిర్చి ధరలన్నీ తగ్గుముఖం


మార్కెట్‌కు భారీగా తరలి వచ్చిన ఉల్లిగడ్డల బస్తాలు


ఉల్లిగడ్డలను చూపుతున్న రైతు రంగారెడ్డి

సాక్షి,బళ్లారి: గత రెండు నెలలుగా కూరగాయలు పండిస్తున్న రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. టమాటా కిలో రూ.10లకే బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంటే హోల్‌సేల్‌గా రైతులకు కిలో రూ.5లు కూడా దొరకక పోగా టమాటా బాక్స్ ధర రూ.100లోపునకు పడిపోవడంతో టమాటా రైతులు నష్టాలు బాట పట్టారు. టమాటా రైతులే కాకుండా పచ్చి మిర్చి కిలో రూ.20, బీట్‌రూట్ కిలో రూ.10, క్యారెట్ కిలో రూ.25, బెండ కిలో రూ.20, ముల్లంగి కిలో రూ.10, క్యాప్సికమ్ కూడా కిలో రూ.20 చొప్పున ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు కూరగాయలు ధరలు అన్ని తగ్గుముఖం పట్టగా, రైతులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తోచక పండించిన కూరగాయలను ఎంతకు పడితే అంత తక్కువ ధరకు అమ్ముకుని నష్టాలు చవిచూస్తున్నారు. కూరగాయల్లో అంతో, ఇంతో మొన్నటి వరకు ఉల్లిగడ్డల ధరలు కాస్తమెరుగ్గా ఉండటంతో ఉల్లి రైతులకు కొంత లాభాలు వచ్చేవి. ప్రస్తుతం రెండు రోజులు నుంచి ఉల్లి ధరలు అమాంతంగా పడిపోవడంతో ఉల్లి సాగు చేసిన రైతుల కంట కన్నీరు వస్తోంది.

ప్రస్తుతం కిలో ఉల్లి ధర రూ.20 లోపే

వారం రోజుల క్రితం బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధరలు రూ.50 పలకగా, ప్రస్తుతం కిలో ఉల్లి రూ.20 లోపునకు పడిపోవడంతో రైతుల వద్ద నుంచి హోల్‌సేల్‌గా కిలో రూ.10 లోపు ధరకు కొనుగోలు చేస్తున్నారు. బుధవారం నగరంలో ఏపీఎంసీ మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఉల్లిగడ్డలు తీసుకు వచ్చిన రైతులు పడుతున్న బాధలు వర్ణించలేని విధంగా ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం తాలూకా బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రంగారెడ్డితో పాటు పలువురు ఉల్లిగడ్డలను బళ్లారి ఏపీఎంసీకి తీసుకు వచ్చారు. మేలైన ఉల్లిగడ్డలు 50 కేజీల బరువు ఉన్న బస్తా కేవలం రూ.550 నుంచి రూ.600లోపు ధర పలకడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం పెట్టుబడి పెట్టి పంట చేతికందిన తర్వాత మార్కెట్‌కు తీసుకుని వస్తే అమాంతంగా ధరలు పడిపోవడంతో తమ పరిస్థితి ఇలా తయారైందని రైతులు కన్నీరు పెడుతున్నారు.

పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు

ఈ సందర్భంగా ఉల్లి రైతులు సాక్షితో మాట్లాడుతూ రెండు రోజుల నుంచి ఉల్లి ధరలు పడిపోతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎలా ఉంటాయోనని భయం వేస్తోందన్నారు. ఒక ఎకరా ఉల్లి సాగుకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టామన్నారు. ఒక ఎకరాకు 100 నుంచి 150 బస్తాల ఉల్లిగడ్డలు దిగుబడి లభించిందన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తుంటే పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు. జోరుగా ఉల్లి సాగు చేయడంతో ధరలు తగ్గిపోయాయని, ఇంకా తగ్గే అవకాశం లేకపోలేదని వ్యాపారులు అన్నారు. ఉల్లి ధరలు తగ్గుముఖం పడుతుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి తమకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఉల్లిగడ్డల ధరలు పెరిగితే రైతు బజార్‌లో తక్కువ ధరకు ఉల్లిగడ్డలు అమ్మి, వినియోగదారులకు మేలు చేస్తారని, అదే ధరలు తగ్గినప్పుడు రైతులకు కూడా మేలు చేసే చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలన్నారు.

కాలువలో స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు

- మూడు రోజులుగా గాలింపు
- అయినా దొరకని ఆచూకీ


గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


గణేష్(ఫైల్)

హొసపేటె: కొప్పళ జిల్లా గంగావతి తాలూకా ఆగళకేరా గ్రామ సమీపంలో కాలువలో స్నానానికి వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహం కోసం మూడు రోజులుగా గాలిస్తున్నా ఇంతవరకు ఆచూకీ దొరకక పోవడంతో బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బుధవారం యథా ప్రకారం పోలీసుల ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మృతదేహం గాలింపు చర్యలను కొనసాగించారు. కాలువలో గల్లంతైన యువకుడిని తాలూకాలోని బూదగుంప గ్రామానికి చెందిన గణేష్(21) అనే యువకుడుగా గుర్తించారు. మూడు రోజుల క్రితం స్నేహితులతో కలిసి కాలువలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. మూడు రోజులుగా వెతికినా మృతదేహం లభ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది కూడా సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించి 12 గంటలకు పైగా గాలించినా మృతదేహం ఆచూకీ తెలియలేదు. ఘటనపై మునిరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

15న దావణగెరెలో బృహత్ ఉద్యోగ మేళా


మాట్లాడుతున్న డీసీ జీఎం గంగాధరస్వామి

బళ్లారి రూరల్ : దావణగెరె నగరంలో ఈనెల 15న బృహత్ ఉద్యోగ మేళా జరుగనున్నట్లు దావణగెరె జిల్లాధికారి జీ.ఎం.గంగాధరస్వామి పేర్కొన్నారు. జిల్లాధికారి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ, జిల్లా యంత్రాంగం, కౌశల్యాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బృహత్ ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉద్యోగ మేళాలో 50 కిపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉద్యోగ మేళాలో వివిధ కంపెనీల్లో ఖాళీగా ఉన్న సుమారు 5000 ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. నగరంలోని హదడి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల, బాపూజీ ఇంజినీరింగ్ కాలేజీ(బీఐటీ) రెండు చోట్ల ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇంటర్వ్యూలు

బీఐటీలో ఇంజినీరింగ్, ఎంబీఏ పట్టభద్రులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీ, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ పట్టభద్రులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఉద్యోగ మేళాకు ఇప్పటివరకు 1000 మంది నిరుద్యోగ యువతీ, యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని వారు కూడా నేరుగా ఉద్యోగమేళాకు హాజరుకావచ్చన్నారు. ఉద్యోగమేళాలో గనులు, భూవిజ్ఞానం, ఉద్యానవన తదితర శాఖలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగమేళా జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు వరంలాంటిదన్నారు. ఉద్యోగమేళాకు వచ్చే నిరుద్యోగుల ఇంటర్వ్యూల కోసం 40 టెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అల్పాహారం, తేనీరు తదితర అత్యవసరమైన అన్ని ఏర్పాటు చేశారన్నారు. జెడ్పీ సీఈఓ సురేశ్ హిట్నాళ్, జెడ్పీ ప్రణాళికా సంచాలకులు రేష్మా కౌశర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రేణుకాచార్య జయంతి


బళ్లారిలో రేణుకాచార్య విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


బళ్లారిలో రేణుకాచార్యను దర్శించుకొంటున్న భక్తులు

- నగరంలో భారీ ఎత్తున ఊరేగింపు
- పాల్గొన్న స్వామీజీలు, ప్రముఖులు


రాయచూరులో రేణుకాచార్య జయంతిలో పాల్గొన్న స్వామీజీలు


రాయచూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

సాక్షి,బళ్లారి: శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు రేణుకాచార్య జయంత్యుత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. బుధవారం హిందూ, వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన జగద్గురు రేణుకాచార్య జయంత్యుత్సవం సందర్భంగా నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు, తేరువీధి, మోతీ సర్కిల్ మీదుగా జోళదరాశి దొడ్డనగౌడ రంగ మందిరం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో రేణుకాచార్య విగ్రహంతో పాటు చిత్రపటాలను వాహనాల్లో ఆనందోత్సాహాలతో నందికోలు, వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. కమ్మరచేడు కళ్యాణ స్వామీజీ, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, వీరశైవ సమాజ ప్రముఖులు మల్లనగౌడ, చానాళ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాశ్రమంలో..

బళ్లారి రూరల్ : రేణుకా ట్రస్టు ఆధ్వర్యంలో అల్లీపుర రేణుకాశ్రమంలో బుధవారం జగద్గురు రేణుకాచార్య జయంతిని ఆచరించారు. రేణుకాచార్య ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తాదులు జగద్గురు రేణుకాచార్యను దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజల్లో ట్రస్టు ప్రముఖులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

యువత బైక్ ర్యాలీ

రాయచూరు రూరల్ : నగరంలో రేణుకాచార్య జయంతి, యుగమానోత్సవం నిర్వహించారు. బుధవారం మంగళవార పేట మఠం నుంచి రేణుకాచార్య సర్కిల్ వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. వీరశైవ కళ్యాణ మంటపంలో జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, సాంఘీక సంక్షేమ శాఖ, వీరశైవ సమాజం ఆధ్వర్యంలో రేణుకాచార్య జయంతి, యుగమానోత్సవాన్ని ప్రారంభించి శాంతమల్ల శివాచార్య మాట్లాడారు. సమావేశంలో అభినవ రాచోటి శివాచార్య, వీరసంగన బసవ శివాచార్య, చంద్రశేఖర్, వీరయ్య స్వామి, శరణు, సురగి మఠలున్నారు. జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు శరణ భూపాల్ నాడగౌడ, సులోచనలున్నారు.

పిల్లలకు మంచి విద్య, సంస్కారం నేర్పండి

హుబ్లీ: దేశ భవిత పాఠశాలల్లోనే నిర్మాణం అవుతున్నందున ప్రాథమిక దశలోనే పిల్లలకు మంచి విద్య, సంస్కారం నేర్పడానికి కృషి చేయాలని జిల్లాధికారిణి దివ్యప్రభ సూచించారు. జిల్లాలోని కుందగోళ తాలూకా అల్లాపూర గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 15వ ఆర్థిక ప్రణాళిక కమిషన్ నిధులతో నిర్మించిన పాఠశాల గోడ, భోజనశాల, సీసీ టీవీ కెమెరాల అమరికతో పాటు పాఠశాల వార్షికోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఉద్యోగాలు, నాణ్యమైన కనీస సౌకర్యాలకు ఉపాధి హామీ మంచి పథకం అన్నారు. ఈ పథకం ద్వారా నాణ్యతపై జాగృతి వహించాలన్నారు. అల్లాపూర గ్రామం పొగాకు, మద్య రహితమని, ఇతర గ్రామాలకు ఆదర్శప్రాయం అయిందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు ఇదే విధంగా పొగాకు, మద్య రహిత గ్రామాలైతే జిల్లా అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. జెడ్పీ సీఈఓ భువనేష్ పాటిల్, ఆ పాఠశాల ప్రధాన గురుమాత జేపీ ఉపాధ్యాయ, తహసీల్దార్ రాజు రజని పాటిల్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

హుబ్లీ: నేటి రోజుల్లో నాయకత్వ లక్షణాలు చాలా అవసరం, వీటిని ప్రతి మహిళ పెంపొందించుకోవాలని ప్రముఖ మోడల్ రేష్మా ఫెర్నాండెజ్ అన్నారు. గోకుల్ రోడ్డు మోటో వీల్స్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఉమా మాట్లాడుతూ పురుషులకు సరిసమానంగా సాధన చేయడం ద్వారా మహిళలు ఆదర్శప్రాయులయ్యారన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని వాడుకొని సాధన చేయాలన్నారు. ఈ విషయంలో హుబ్లీ మోటో వీల్స్ మహిళా సిబ్బందికి అవకాశం కల్పించడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా సంస్థ పాలక మండలి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం

హుబ్లీ: సీఎం సిద్దరామయ్య బడ్జెట్ పూర్తిగా ముస్లింల కోసం ప్రతిపాదించిన బడ్జెట్‌లా ఉందన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంగ్రెస్ నేత శివానంద ముత్తణ్ణవర్ విమర్శించారు. నగరంలో ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది బడ్జెట్ రూ.4.09 లక్షల కోట్లు ఉంది. అందులో మైనార్టీలకు కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది 1 శాతం మాత్రమే మైనార్టీలకు కేటాయించినట్లు కదా? అని అన్నారు. మైనార్టీలు అంటే కేవలం ముస్లింలు మాత్రమే కాదు, జైనులు, సిక్కులు, బౌద్ధులు తదితర చిన్నా చితకా మతస్తులు మైనార్టీల్లో ఉన్నారని కేంద్ర మంత్రికి తెలియదా? అని నిలదీశారు. ఈ సారి సిద్దు బడ్జెట్‌లో పూర్తిగా ముస్లిలకే ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని పాకిస్తాన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న జోషి వ్యాఖ్యలు వాస్తవానికి దూరం అన్నారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్రంలోని 7 కోట్ల మంది కన్నడిగులను దారి తప్పించేలా ఉన్నాయన్నారు. తక్షణమే జోషి తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యల్లప్ప కుందగోళ, వెంకటేష్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

దుష్టశక్తులను తరిమికొడదాం

- మాజీ మంత్రి రేణుకాచార్య


మాట్లాడుతున్న మాజీ మంత్రి రేణుకాచార్య

హొసపేటె: అంతర్గత శక్తులను ఏకం చేసి సమాజాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తున్న దుష్టశక్తులను గద్దె దించాలనే ఉద్దేశ్యంతో తాను తన బృందంతో రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి రేణుకాచార్య తెలిపారు. నగరంలోని అమరావతి గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీరశైవ లింగాయత్ వర్గానికి చెందిన 9 మంది ముఖ్యమంత్రులకు పూర్తి స్థాయిలో అధికారం దక్కకపోవడంపై ఘాటుగా స్పందించారు. విజయేంద్ర నాయకత్వానికి తాను, తన బృందం మద్దతు తెలుపుతామన్నారు. రాష్ట్రంలో డ్రగ్ మాఫియా, అత్యాచారాలు, దోపిడీలు పెరిగి పోతున్నాయన్నారు. రన్యారావు కేసులో పలుకుబడి ఉన్న మంత్రుల పాత్రపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని అన్నారు. సణాపురలో విదేశీ మహిళపై జరిగిన అత్యాచార ఘటనపై మాజీ ఎమ్మెల్యే పరన్న మునవల్లి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆధునిక సమాజంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండటం దురదృష్టకరం అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రపై కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయన్నారు. మాజీ సీఎం యడియూరప్ప మాదిరిగానే ఇప్పుడు విజయేంద్రను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. విజయేంద్ర నాయకత్వాన్ని బలపరచాలని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత హోలీ ఆచరణకు పిలుపు


మాట్లాడుతున్న ఉమేష్ కాంబ్లే

రాయచూరు రూరల్: నగరంలో హోలీ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సదర్ బజార్ సీఐ ఉమేష్ కాంబ్లే సూచించారు. మంగళవారం రాత్రి సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న జరిగే హోలీ వేడుకలను శాంతియుతంగా ఆచరించాలన్నారు. పీయూసీ, పదో తరగతి, డిగ్రీ పరీక్షలు జరగనున్న సమయం, ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో రోజాను పాటిస్తున్నారన్నారు. హిందూ సోదరులు శాంతితో ఎలాంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా హోలీ పండుగను ఆచరించాలన్నారు. సమావేశంలో నగరసభ కమిషనర్ చలపతి, సభ్యుడు సాజిద్, శ్రీనివాస్, అశోక్ శెట్టి, నజీర్ అహ్మద్ పంజాబీలున్నారు.


మృతులకు కన్నీటి వీడ్కోలు


బంధువులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాయక్

రాయచూరు రూరల్: కర్నూలు జిల్లా ఆదోని మండలం పాండవగల్ వద్ద మంగళవారం కేఎస్ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో మరణించిన జిల్లాలోని మాన్వికి చెందిన హేమాద్రి, నాగరత్నమ్మ, దేవరాజ్‌ల మృతదేహాలకు బుధవారం బంధువులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్ మృతదేహాలపై పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం శాసన సభ్యుడి నిధి నుంచి పరిహారం కింద రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందించారు.

అపర భగీరథుడు.. గురుగుంట అమరేశ్వరుడు


గురుగుంటలో వెలసిన అమరేశ్వరుడు


జాలువారుతున్న జలం

- ఆలయంలో ప్రత్యేక పూజలు
- 14న రథోత్సవానికి ఏర్పాట్లు


ఆలయ ఆవరణలోని కోనేరు


గురుగుంటలో వెలసిన అమరేశ్వరాలయం

రాయచూరు రూరల్: దేవి శక్తి నుంచి నిర్మించ తలపెట్టిన ప్రపంచంలో మనుకుల ఉద్ధారం కోసం పలు పుణ్య క్షేత్రాలు వెలశాయి. రాయచూరు జిల్లా లింగసూగూరు తాలూకా గురుగుంట అమరేశ్వర ఆలయం ఒకటి. అమరేశ్వరలో అమర లింగం త్రేతాయుగం నాటిది. లంకాధిపతి రావణాసురుడు నిర్మించిన లింగమని భక్తుల విశ్వాసం. రావణుడి తల్లి కైకసి ప్రతి రోజు కేదారకు వెళ్లి పూజలు జరిపి పాల నైవేద్యాన్ని కుమారుడికి తాగించేది. వయస్సు మళ్లుతున్న కొద్ది కొండనెక్కడం సాధ్యం కాకపోవడంతో ఆమె మెట్లు ఎక్కక చాలా ఇబ్బందులకు గురై అక్కడే ఉండిపోయింది. ఆకలితో అలమటించే రావణాసురుడు తల్లి రాలేదన్న వార్తను మేనమామకు చేరవేశాడు. మేనమామ అడవిలో చేసిన తపస్సుతో శివుడు ప్రత్యక్షమై అమరలింగాన్ని పూజించే విధంగా వరం పొందాడు.

నేలపై పెట్టకుండా తరలించాలని సూచన

ఈ లింగాన్ని నేలపై పెట్టకుండా తీసుకెళ్లాలని ఆదేశించాడు. చెల్లెలి కోసం లింగాన్ని తీసుకుని కృష్ణా నది దాటుతుండగా రాత్రి కావడంతో అమరేశ్వరలో రాత్రి బస చేశాడు. మామ మహిరావణుడు చేతిలో ఉన్న లింగం భూమి మీదకు పడడంతో భూమిలో నుంచి నీరు బయటకు రావడం కనిపించింది. ఆ లింగం అమరం కావడంతో అమరేశ్వరగా నామాంతరమైంది. తాలూకాలోని యరడోణ గ్రామంలో శివభక్త కుటుంబంలో జన్మించిన ఆదయ్య, గుండమ్మలు అన్నదాసోహం నిర్వహించేవారు. వీరికి సంతానం కలుగక పోవడంతో గురుగుంట అమరేశ్వరుని కటాక్షంతో బాలుడు జన్మించాడు. ఇలాంటి మహిమలతో తన మహత్యాన్ని ప్రదర్శించిన సందర్భాలున్నాయి. మంగళవారం సాయంత్రం గురుగుంట అమరేశ్వరలో జాతర రథోత్సవాలు, పూజలు నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెల 14న నిర్వహించనున్న రథోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీసీ చంద్రశేఖర్ తెలిపారు.

రైన్ డ్యాన్స్ డీజేకు అనుమతి ఇవ్వొద్దు

హుబ్లీ: హోలీ సందర్భంగా ధార్వాడ కేసీడీ సర్కిల్‌లో ఈనెల 15న చేపట్టిన రైన్ డ్యాన్స్ విత్ డీజేకు ఈసారి అనుమతిని ఇవ్వరాదని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ పోలీస్ కమిషనర్‌కు సూచించారు. ఆయన ఓ ప్రకటనలో ఈ మేరకు వివరించారు. ప్రస్తుతం పీయూసీ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రం అయిన కేసీడీ కళాశాలలో ఆ రోజు 2000 మందికి పైగా విద్యార్థులు ఇంగ్లిష్ పరీక్ష రాయనున్నారు. సరిగ్గా ఆ రోజునే ఎమ్మెల్యే అరవింద బెల్లద హోలీ పండుగ వేళ సదరు సర్కిల్‌లో రైన్ డ్యాన్స్ డీజే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అతిగా డీజే, డప్పులు వాయించడం, అరుపులు, కేకల వల్ల విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఇబ్బంది కలుగుతుందని, అందుకుగాను ఈ సారి ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వరాదని నాగరాజ్ పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

స్త్రీలు, పురుషులకు హక్కులు సమానం


కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సదృఢ సమాజ నిర్మాణానికి పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానమని బీజేపీ మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు విజయ రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కులు, విధులు, సమానత్వం, విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలు ఉందన్నారు. మహిళల స్వేచ్ఛకు భంగం కలిగించరాదన్నారు. సమావేశంలో సుమతీ శాస్త్రి, అశ్విని, రామచంద్ర, నాగరాజ్, యశోద, కార్తీక, సీత, సంగీత, సరస్వతి, శివలక్ష్మి, పుష్ప, రాధ, నివేదితలున్నారు.